
‘అభివృద్ధి ఎంత ముఖ్యమో...
సంక్షేమమూ అంతే ముఖ్యం’

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 16+16 వెల: ₹ 5.00
సంపుటి: 12
సంచిక: 109

బుధవారం 10-7-2019

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL





**హెచ్చుతగ్గుల్లో స్టాక్ సూచీలు**
మిశ్రమంగా ముగింపు... రెండు రోజుల నష్టాల నుంచి ఊరట - బిజినెస్‌లో



**సెమీస్‌లో సెరెనా**
వింబుల్డన్ టోర్నీ క్వార్టర్ ఫైనల్లో శ్రమించి గెలిచిన అమెరికా స్టార్ - స్పోర్ట్స్‌లో



# సెమీస్‌కు వరుణుడి అడ్డుబ్యాటు...



- భారత్, న్యూజిలాండ్ సెమీస్‌కు వాన అడ్డంకి
- 46.1 ఓవర్ల పాటు సాగిన కివీస్ ఇన్నింగ్స్
- అనంతరం వర్షం కారణంగా నిలిపివేత
- నేడు ఇక్కడి నుంచే మిగతా మ్యాచ్ కొనసాగింపు

ప్రపంచ కప్ ఫైనల్ దిశగా ఆశావహంగా సాగుతున్న టీమిండియా ప్రయాణానికి వరుణుడు బ్యాటు అడ్డుపెట్టాడు. మంగళవారం మాంచెస్టర్‌లోని ఓల్డ్‌ట్రాఫోర్డ్ మైదానంలో సాగిన సెమీఫైనల్లో సరిగ్గా మధ్యలో ప్రవేశించి చినుకులతో చిటపటలాడించాడు. ఓ దశలో కాస్త వెనక్కు తగ్గినట్లే తగ్గినా మళ్లీ నేనున్నానంటూ ముందుకొచ్చాడు. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కివీస్... భారత బౌలర్ల ప్రతాపానికి 46.1 ఓవర్లలో 211/5 సాధారణ స్కోరుతో ఉన్న వేళ వాన ఇన్నింగ్స్ మొదలైంది.

- తెరిపినివ్వని జల్లుల కారణంగా అప్పటి నుంచి గంటలకొద్దీ వేచి చూసినా ఫలితం లేకపోయింది. పదేపదే మైదానాన్ని పరిశీలించిన అంపైర్లు... చివరకు లాభం లేదని భావించి ఆటను యథాతథ స్థితిలో నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు.
- ఇదే స్కోరుపై బుధవారం ఉదయం 10.30 (భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 3 గంటలు) నుంచి ఆటను పునః ప్రారంభిస్తారు. మధ్యలో వర్షం వస్తే డక్‌వర్త్ లూయిస్ నిబంధనలను వర్తింపజేసి భారత లక్ష్యాన్ని నిర్దేశిస్తారు. ఒకవేళ వర్షంతో ఆట సాధ్యపడక మ్యాచ్ రద్దైతే నిబంధనల మేరకు లీగ్ దశలో టాప్ ర్యాంక్‌లో నిలిచిన భారత జట్టు ఫైనల్‌కు చేరుతుంది.
- మిగిలిన 3.5 ఓవర్లలో ప్రత్యర్థి ఎంత స్కోరు చేస్తుంది?
- విరాట్ కోహ్లి సేన దానిని ఎలా ఛేదిస్తుంది?
- హిట్‌మ్యాన్ రోహిత్ మరో సెంచరీ బాదేస్తాడా?
- భారత్ ఫైనల్ గడప తొక్కే శుభ సందర్భాన్ని ఎప్పుడెప్పుడు చూద్దామా? అని ఊహా లోకంలో ఆలోచిస్తున్న కోట్లాది భారతీయులకు వరుణ దేవుడు ఉపశమిస్తే బుధవారమే సమాధానం దొరకనుంది.

- స్పోర్ట్స్‌లో



# 150 కిలోమీటర్లు పాదయాత్ర చేయాలి

**బీజేపీ ఎంపీలకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు**

బీజేపీ ఎంపీలంతా అక్టోబర్ 2 నుంచి 31 వరకు నియోజకవర్గాల్లో 150 కి.మీ. మేర పాదయాత్ర చేయాలి. పార్టీ బలహీనంగా ఉన్న నియోజకవర్గాల్లో రాజ్యసభ సభ్యులు పర్యటించాలి. పాదయాత్రలో గ్రామాలపై దృష్టి కేంద్రీకరించాలి. – మోదీ

- వివరాలు 13లో

## అయోధ్యపై సత్వర విచారణ చేపట్టాలి

- మధ్యవర్తిత్వంతో పరిష్కారమయ్యేలా లేదని సుప్రీంకోర్టులో పిటిషన్ - 13లో




# కలెక్టర్లకు ‘పుర’పవర్స్!

## మున్సిపాలిటీల పాలనపై జిల్లా కలెక్టర్లకు సంపూర్ణ అధికారాలు

- కార్పొరేషన్ల పర్యవేక్షణ కూడా.. ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్ష
- కొత్త చట్టం పరిధిలోకి పాలక వర్గాలు.. అవసరమైతే రీకాల్ చేసే అధికారం
- కలెక్టర్ నిర్ణయాన్ని సమీక్షించేందుకు ప్రత్యేక అప్పిలేట్ అథారిటీల ఏర్పాటు
- అథారిటీ చైర్మన్‌గా జిల్లా జడ్జి స్థాయి అధికారి ఉండే అవకాశం

సాక్షి, హైదరాబాద్: ఇప్పటివరకు జిల్లా కలెక్టర్లు పంచాయతీలు, గ్రామీణ ప్రాంతాలపైనే దృష్టి సారిస్తూ వస్తున్నారు. మున్సిపాలిటీల్లో సమస్యలను ఆయా పాలకవర్గాలు, అధికారులే పరిష్కరించేవారు. ఒకవేళ అందులో విఫలమైనా కలెక్టర్లు చర్యలు తీసుకునే పరిస్థితి ఉండేది కాదు. ప్రజలు బయటకు వచ్చి ధర్నాలు, ఆందోళనలు చేసినా అది పట్టణానికే పరిమితమయ్యేది. దీంతో తీవ్రమైన సమస్య ఉత్పన్నమైతే తప్ప ప్రభుత్వం రంగంలోకి దిగేది కాదు. ఈ పరిస్థితి కొత్త చట్టంతో మారిపోనుంది. పురపాలికల్లో ఏ సమస్య తలెత్తినా వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులతో పాటు ప్రజాప్రతినిధులకు తప్పనిసరి కానుంది. దీంతో మున్సిపాలిటీల్లో అడ్డగోలు వ్యవహారాలకు కళ్లెం పడనుంది. పాలనలో పారదర్శకత, పాలకవర్గాల్లో జవాబుదారీతనం పెంపొందించేలా ఉద్యోగులు, ప్రజాప్రతినిధులను ప్రతి ఒక్కరిని బాధ్యులను చేసేలా కొత్త పురపాలక చట్టంలో నిబంధనలను రూపొందిస్తున్నారు. ఈ చట్టం అమలు బాధ్యతలను కలెక్టర్లకు అప్పగించనున్నారు. పట్టణ స్థానిక సంస్థలపై కలెక్టర్లకు సంపూర్ణ అధికారాలు

మిగతా 2వ పేజీలో ▶

# సీబీఐకి బుక్కయిన బొల్లినేని గాంధీ

## హైదరాబాద్, విజయవాడలో ఏకకాలంలో దాడులు

- భారీగా అక్రమాస్తుల గుట్టురట్టు
- పదేళ్లలో 288 శాతం మేర పెరిగిన ఆస్తులు
- రూ.3.74 కోట్ల ఆస్తులు కూడబెట్టిన వైనం
- బహిరంగ మార్కెట్‌లో వీటి విలువ రూ.200 కోట్లు ఉంటుందని అంచనా
- ఏపీ మాజీ సీఎం చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడిగా పేరు
- బాబు రాజకీయ ప్రయోజనాల కోసం పనిచేసినట్లు ఆరోపణల వెల్లువ


బొల్లినేని శ్రీనివాస్ గాంధీ

సాక్షి, హైదరాబాద్/ అమరావతి/విజయవాడ: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడుకు అత్యంత సన్నిహితుడిగా పేరొందిన.. ఆయన ఆదేశాల మేరకు ఈడీలో నడుచుకున్నట్లు ఆరోపణలున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మాజీ అధికారి బొల్లినేని శ్రీనివాస గాంధీ ఇంటిపై సీబీఐ దాడులు చేసింది. ఆయన అక్రమ ఆస్తుల గుట్టును కేంద్ర దర్యాప్తు సంస్థ రట్టుచేసింది. ఆయన ఆదాయానికి మించి విచ్చలవిడిగా ఆస్తులు కూడబెట్టినట్లు గుర్తించింది. బీఎస్ గాంధీ ఆస్తులు అనూహ్యంగా పెరిగాయని, టీడీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని.. సుజనాచౌదరి కేసులనూ ఆయన నీరుగార్చారని కొంతకాలంగా ఫిర్యాదులు వెల్లువెత్తిన నేపథ్యంలో సీబీఐ అధికారులు హైదరాబాద్, విజయవాడ తదితర చోట్ల

మిగతా 2వ పేజీలో ▶


సాక్షి సెలబ్రేషన్ ఆఫర్
కో అంటే కోటి... బహుమతులు
1 కూపన్

6 Layer PLASTO GOLD
ట్రాగునీటి కొరకు సురక్షితం
9393992510

SPEEDY GOLD LOAN
మీ బంగారు ఆభరణాలపై తక్షణమే రుణం
SHRIRAM City
MONEY WHEN YOU NEED IT MOST

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE
Vencobb FRESH CHICKEN
ప్రతిపాదించిన నేటి గుడ్లు & చికెన్ హైదరాబాద్ జోన్ ధరలు

| | | | | |
|---|---|---|---|---|
| గుడ్ల రిటైల్ ధర ₹ 56 డజన్ | ఫారం దగ్గర లైవ్ బర్డ్ | 85 కిలో | డ్రెస్డ్ స్కిన్‌తో | 155 కిలో |
| | రిటైల్ లైవ్ బర్డ్ | 107 కిలో | స్కిన్‌లెస్ | 177 కిలో |

వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది
Conditions Apply


# కర్ణాటకంలో కొత్త ట్విస్ట్..



“నేను జాగరూకతతో వ్యవహరించాల్సి ఉంది. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో నేను తీసుకునే ప్రతి నిర్ణయమూ చరిత్రలో నిలిచిపోతుంది. అందుకే ఎట్టి పరిస్థితుల్లోనూ తప్పు చేయకూడదు. భవిష్యత్ తరాలు నన్నో అపరాధిగా చూస్తాయి. రాజీనామాలను ఆమోదించాలా లేక ఇతర చర్యలు చేపట్టాలా అనే విషయంలో అనుభవజ్ఞుల సలహాలు, రూల్ బుక్ ప్రకారం నడుచుకుంటా.

– కర్ణాటక అసెంబ్లీ స్పీకర్ రమేశ్‌కుమార్

9మంది రాజీనామాలు ఫార్మాట్‌లో లేవన్న స్పీకర్ రమేశ్ కుమార్

పొరపాటు నిర్ణయంతో చరిత్రలో ద్రోహిగా నిలిచిపోలేనని వ్యాఖ్య

రెబెల్స్‌ను అనర్హులుగా ప్రకటించాలని కాంగ్రెస్ డిమాండ్

రాజీనామా చేసిన మరో కాంగ్రెస్ ఎమ్మెల్యే

మళ్లీ ముంబైకి మారిన రెబెల్స్

-వివరాలు 13లో

# కృష్ణమ్మ కొరత 900 టీఎంసీలు!

**1,300** టీఎంసీల ఇరు రాష్ట్రాల అవసరాల్లో ఎగువ నుంచి వచ్చేది **400** టీఎంసీలే

- ఈ లోటును గోదావరితో తీర్చే అంశంపై తెలంగాణ, ఏపీ ఇంజనీర్ల చర్చలు
- కృష్ణా ప్రాజెక్టులకు గోదావరి వరద తరలింపుపై కొన్ని ప్రతిపాదనలతో ముందుకు..

ఈ నెల **13** లేదా **15**న మళ్లీ భేటీ... అనంతరం అలైన్‌మెంట్‌లపై స్పష్టత

4లో



## డాలర్ డ్రీమ్స్‌కి పచ్చజెండా!

- అమెరికాలో శాశ్వత నివాసం, ఉపాధి కోసం ఉద్దేశించిన గ్రీన్ కార్డు బిల్లుపై అమెరికా కాంగ్రెస్‌లో ఓటింగ్‌కు సర్వం సిద్ధమైంది. ఈ బిల్లు కాంగ్రెస్ ఆమోదం పొందితే దశాబ్దాల తరబడి గ్రీన్ కార్డు కోసం ఎదురు చూస్తున్న భారతీయులకు భారీగా ప్రయోజనాలు దక్కుతాయి.

13లో



## షార్జా గోల్డెన్ వీసా

- అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)కి చెందిన పారిశ్రామికవేత్త లాలో శామ్యూల్‌కు శాశ్వత నివాసాన్ని కల్పిస్తూ మొదటిసారిగా షార్జా గోల్డ్‌కార్డు వీసా మంజూరు చేసింది.

13లో



## ఇదం జగత్



మనం అలా చేసినందుకే ఇక్కడ ఉంచారు! మళ్లీ ఎందుకు సార్!!


రాంప్రసాద్ మృతదేహం


కోగంటి సత్యం

# సుపారీ ఇచ్చింది కోగంటి సత్యమే..

- పోలీసుల విచారణలో నేర అంగీకారం
- కామాక్షి స్టీల్స్ గొడవలే హత్యకు కారణం
- బోండా ఉమ జోక్యంతోనే ముదిరిన వివాదం
- రాంప్రసాద్ హత్యకు రూ. 10 లక్షలిచ్చిన సత్యం
- సురేష్‌తో కలసి పథకం అమలు చేసిన శ్యామ్

- వివరాలు 5లో

# నమ్మించి గొంతుకోశాడు...

**ప్రేమోన్మాది ఘాతుకం**

- తానూ చేతులు కోసుకుని ఆత్మహత్యాయత్నం
- ప్రాణాపాయస్థితిలో వెంటిలేటర్‌పై యువతి
- దిల్‌సుఖ్‌నగర్‌లోని ఓ లాడ్జిలో ఘటన





ప్రేమోన్మాది దాడిలో గాయపడ్డ మనస్వి, ఉస్మానియాలో చికిత్స పొందుతున్న వెంకటేష్

హైదరాబాద్

అనుమానం పెనుభూతమైంది. ప్రేమికుడు ఉన్మాదిలా మారాడు. ప్రేమికురాలిపై కక్ష గట్టాడు. నమ్మించి గొంతుకోశాడు. తానూ ఆత్మహత్యకు యత్నించాడు. ప్రేమికురాలు ప్రాణాపాయస్థితిలో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ ఘటన హైదరాబాద్ చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధి దిల్‌సుఖ్‌నగర్‌లో మంగళవారం చోటుచేసుకుంది. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన వేమూరి ఆనంద్‌బాబు, కమలకుమారి దంపతులు కొంతకాలంగా బడంగ్‌పేటలో నివసిస్తున్నారు. వీరి కూతురు మనస్వి(22) బీటెక్ పూర్తి చేసి బ్యాంకు ఉద్యోగాల కోసం దిల్‌సుఖ్‌నగర్‌లోని ఓ ఇన్‌స్టిట్యూట్‌లో పోటీ పరీక్షకు శిక్షణ పొందింది. నెల్లూరు జిల్లా నారాయణరెడ్డిపేటకు చెందిన జానా జనార్దన్ కుమారుడు వెంకటేశ్(23)తో అదే ఇన్‌స్టిట్యూట్‌లో ఆమెకు పరిచయం ఏర్పడింది. ఇద్దరూ నాలుగు నెలలుగా ప్రేమించుకుంటున్నారు.

### ఉదయమే నగరానికి వచ్చి...

నెల్లూరు నుంచి ఉదయమే నగరానికి వచ్చిన వెంకటేశ్ ఓయాప్ ద్వారా బృందావన్‌లో గది బుక్ చేశాడు. 10 గంటలకు రూంలో దిగి మనస్వికి ఫోన్ చేసి రప్పించాడు. 11.30 గంటల ప్రాంతంలో మనస్వి హోటల్‌కు చేరుకుంది. వేరే యువకుడితో సన్నిహితంగా ఉంటూ కొంతకాలంగా తనను నిర్లక్ష్యం చేస్తోందని మనస్విపై వెంకటేశ్ కోపం పెంచుకున్నాడు. హోటల్ గదిలో ఈ విషయమై ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. వెంట తెచ్చుకున్న కూరగాయల కత్తితో మనస్వి గొంతు కోసి, తన రెండు చేతులను కోసుకున్నాడు. హోటల్‌కు వచ్చిన కొద్దిసేపటికే మనస్వి తన సోదరుడు శ్రీతేజకు ఫోన్ చేసి బృందావన్ హోటల్‌లో ఉన్నానని, తనపై దాడి జరుగుతోందని చెప్పింది. ఫోన్‌లో ఆమె కేకలు కూడా వినిపించాయి. శ్రీతేజ, తల్లి కమలకుమారి హుటాహుటిన బైక్‌పై బయలుదేరారు. మొబైల్‌లో గూగుల్ నావిగేషన్(మ్యాప్) సహాయంతో హోటల్‌కు చేరుకున్నారు. హోటల్ సిబ్బందితో కలసి రూంలోకి వెళ్లి చూడగా ఇద్దరూ రక్తపుమడుగులో పడి ఉన్నారు. బెడ్, గది అంతా రక్తసిక్తమైంది. మెడ కోసి ఉండటంతో తీవ్రంగా గాయపడ్డ మనస్విని వెంటనే కొత్తపేటలోని ఓమ్ని ఆసుపత్రికి తరలించారు. చేతిపై గాయాలతో

మిగతా 2వ పేజీలో ▶

# 'నల్ల' గోల్డు.. లాభాలు బోల్డు!

బంగారం ఏ రంగులో ఉంటుందంటే..
పసుపుపచ్చ అని ఠక్కున చెబుతారు
కానీ ఇకపై మాత్రం బంగారం నల్లగా కూడా ఉండొచ్చు!
ఎందుకలా అంటే?
పసుపు పచ్చటి బంగారాన్ని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ శాస్త్రవేత్తలు నల్లగా మార్చేశారు మరి!
అయ్యో.. అంత విలువైన లోహాన్ని పనికి రాకుండా చేశారా అనుకోవద్దు! అసలు కంటే దానికి ఎక్కువ విలువను రాబడుతున్నారు కాబట్టి... ఫలితంగా భవిష్యత్తులో సముద్రపు నీరు చౌకగా తాగునీరైపోతుంది! సూర్యుడి ఎండతో ఉత్పత్తి అయ్యే విద్యుత్తు ఇబ్బడిముబ్బడి అవుతుంది కూడా!



నానో టెక్నాలజీ గురించి మనం చాలాసార్లు విని ఉంటాం. దుస్తులు, కాస్మోటిక్స్‌తోపాటు కొన్ని క్రీడా సామగ్రిలోనూ వాడుతున్నారు. కానీ నానో టెక్నాలజీతో సాధించగల అద్భుతాలతో పోలిస్తే ఇవి చాలా చిన్నస్థాయి ప్రయోజనాలని చెప్పక తప్పదు. అతిసూక్ష్మస్థాయిలో.. కచ్చితంగా చెప్పాలంటే ఒక మిల్లీమీటర్ కంటే 10 లక్షల రెట్లు తక్కువ సైజులో పదార్థాల ధర్మాలు చాలా భిన్నంగా ఉంటాయని నానో టెక్నాలజీ చెబుతుంది. బంగారాన్నే ఉదాహ రణగా తీసుకుందాం. సాధారణ స్థితిలో బంగారం రంగు పసుపుపచ్చగా ఉంటే.. సైజు తగ్గే కొద్దీ రకరకాల రంగుల్లో ఉంటుంది. ఈ నేపథ్యంలో టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ (టీఐఎఫ్ఆర్) శాస్త్రవేత్తలు మూడేళ్ల క్రితం కొన్ని ప్రయోగాలు చేపట్టారు. సూర్యరశ్మిని సమర్థంగా ఒడిసిపట్టుకునేందుకు ఉన్న అవకాశాలపై సాగిన ఈ ప్రయోగాల్లో బంగారాన్ని ఉపయోగించారు. నానోస్థాయి బంగారపు అణువుల పరిమాణాన్ని, అణువుల మధ్య ఉన్న అంతరాలను నియంత్రించారు. దీంతో బంగారం కాస్తా నల్లగా మారిపోయింది. మునుపు లేని అనేక లక్షణాలు ఒంటబట్టాయి.

## వెలుతురు మొత్తాన్నీ పీల్చేసుకుంటుంది..

నల్ల బంగారానికి అబ్బిన కొత్త లక్షణాల్లో ఒకటి కాంతిని పూర్తిగా శోషించుకోవడం. కాంతి కూడా ఒక రకమైన శక్తి అని, వేడిని పుట్టించవచ్చునని మనకు తెలుసు. నానోస్థాయి బంగారం కంటికి కనిపించే కాంతిలో కొంత భాగాన్ని మాత్రమే శోషించుకో గలిగితే టీఐఎఫ్ఆర్ శాస్త్రవేత్తలు తయారు చేసిన నానో బంగారం మాత్రం మొత్తం కాంతిని పీల్చేసుకోగలదు. ఇలా పీల్చేసుకున్న కాంతితో బంగారం బాగా వేడెక్కిపోతుందని, నీటిలో ఉంచితే ఆ వేడిని ఆవిరిగా మార్చి విద్యుదుత్పత్తి చేయవచ్చని ఈ పరిశోధనలకు నేతృత్వం వహించిన డాక్టర్ వివేక్ పొలిశెట్టివార్ 'సాక్షి'కి తెలిపారు. అంతేకాకుండా వాతావరణంలో ఏటికేడాది పెరిగిపోతున్న కార్బన్ డైఆక్సైడ్‌ను పీల్చేసుకునేందుకు, దానితో పెట్రోల్, డీజిల్ వంటి ఇంధనాలను తయారు చేసేందుకు కూడా ఈ నల్ల బంగారాన్ని వాడవచ్చని ఆయన చెప్పారు. మూడేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వ అణుశక్తి విభాగం ఇచ్చిన నిధులతో తాము ఈ ప్రయోగాలను ప్రారంభించామని డాక్టర్ వివేక్ తెలిపారు. నల్ల బంగారంతో ఉన్న మరో అద్భుతమైన ప్రయోజనం నిర్లవణీకరణ (సముద్రపు నీటిలోని లవణాలను తొలగించి మంచినీటిగా మార్చడం) అని తెలిపారు. నిర్లవణీకరణకు ప్రస్తుతం ఉపయోగిస్తున్న పద్ధతుల ఖర్చు బాగా ఎక్కువకాగా నల్ల బంగారంతో చౌకగానే ఉప్పు నీటిని మంచినీటిగా మార్చవచ్చని వివరించారు.

## పేటెంట్ కోసం ప్రయత్నాలు..

నల్ల బంగారం తయారీ విధానంపై పేటెంట్ సాధించేందుకు టీఐఎఫ్ఆర్ ప్రయత్నాలు చేస్తోంది. నిర్లవణీకరణ, సౌర విద్యుదుత్పత్తితోపాటు ఇంకా అనేక ఇతర ప్రయోజనాలు కూడా ఉన్నాయని డాక్టర్ వివేక్ తెలిపారు. అయితే ప్రస్తుతానికి దీన్ని వాణిజ్య స్థాయిలో వాడుకునేందుకు కొన్ని పరిమితులు ఉన్నాయని చెప్పారు. కార్బన్ డైఆక్సైడ్‌ను పీల్చేసుకున్న తరువాత నల్ల బంగారం ద్వారా ఉత్పత్తి అయ్యే మీథేన్ (సహజ వాయువు) మోతాదు తక్కువగా ఉండటం దీనికి ఒక కారణమని తెలిపారు. బంగారం లాంటి విలువైన పదార్థాన్ని కాకుండా రాగి, వెండి వంటి ఇతర లోహాలతో కూడా నల్ల బంగారాన్ని పోలిన పదార్థాలను తయారు చేసేందుకు ప్రస్తుతం తాము ప్రయత్నిస్తున్నామని తెలిపారు. అయితే ఈ లోహాలు బంగారం అంత స్థిరంగా ఉండవని చెప్పారు. మొక్కల మాదిరిగానే నల్ల బంగారం కూడా కార్బన్ డైఆక్సైడ్‌ను పీల్చేసుకొని ఉపయోగకరమైన ఇంధనాలుగా తయారు చేస్తుంది కాబట్టి ఈ టెక్నాలజీతో వాతావరణ మార్పులను సమర్థంగా ఎదుర్కోవచ్చని వివేక్ అంటున్నారు.



## ఎవరీ వివేక్ పొలిశెట్టివార్..?

మహారాష్ట్రలోని ఓ కుగ్రామంలో జన్మించిన వివేక్ బీఎస్సీ పూర్తి చేశారు. అమరావతి యూనివర్సిటీ నుంచి రసాయన శాస్త్రంలో పీజీ చేశాక శివాజీ విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ సాధించారు. ఆ తరువాత పోస్ట్ డాక్టోరల్ విద్య కోసం ఫ్రాన్స్‌లోని నేషనల్ సుపీరియర్ డీ చిమీ డి మోంట్‌పెల్లియర్‌లో చేరారు. ఆ తరువాత కొంతకాలం వేర్వేరు దేశాల్లో పనిచేసి మాతృదేశంపై మమకారంతో మళ్లీ భారత్ వచ్చేశారు. ముంబైలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్‌లో రీడర్‌గా చేరారు. వేర్వేరు సైంటిఫిక్ జర్నల్స్‌లో 80 వరకూ పరిశోధన పత్రాలు సమర్పించిన వివేక్ చెప్పే విజయ తారక మంత్రం ''కష్టపడండి.. భిన్నంగా ఆలోచించండి. పుస్తకాల్లో ఏం రాశారు? తాజా పబ్లికేషన్స్‌లో ఏమున్నదన్నది అప్రస్తుతం. వ్యక్తిగత స్థాయిలో విమర్శలకు కుంగిపోవద్దు. అన్ని విమర్శలను మిమ్మల్ని మీరు అభివృద్ధి పరుచుకునేందుకు ఉపయోగించుకోండి. నేను ఇదే చేస్తున్నా.''

*- సాక్షి నాలెడ్జ్ సెంటర్*

## నేడు ఓటర్ల జాబితా ముసాయిదా విడుదల



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 129 మున్సిపాలిటీలు, 3 కార్పొరేషన్లలో బుధవారం వార్డుల వారీగా ఫొటోలతో కూడిన ఓటర్ల జాబితా ముసాయిదాను విడుదల చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) ఆదేశాలిచ్చింది. ఈ అంశంపై అన్ని రాజకీయ పార్టీలతో గురువారం సమావేశం ఏర్పాటు చేసి పోలింగ్ కేంద్రాలను కూడా ఖరారు చేయాలని ఎస్ఈసీ కార్యదర్శి అశోక్ కుమార్ మంగళవారం విడుదల చేసిన షెడ్యూల్‌లో పేర్కొన్నారు. ఈ నెల 14న తుది ఓటర్ల జాబితాను వార్డుల్లోనూ, పోలింగ్ కేంద్రాల జాబితా ముసాయిదాను మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలోనూ అందుబాటులో ఉంచాలని సూచించింది. ఈ నెల 19న పోలింగ్ కేంద్రాల తుది జాబితాను ప్రచురించాలని ఆదేశించింది. ఈ నెల 17 సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలను స్వీకరించాలని, 18న పరిష్కరించి, అదే రోజున తుది జాబితాను జిల్లా కలెక్టర్లకు అందించాలని పేర్కొంది. ఈ నెల 19న జిల్లా కలెక్టర్లు అనుమతించిన తుది జాబితాను మున్సిపాలిటీల్లో విడుదల చేయాలని, ఈ నెల 19 కల్లా ఈ ప్రక్రియ ముగించేలా కరీంనగర్, నిజామాబాద్, పెద్దపల్లి జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

## నేడు, రేపు మోస్తరు వర్షాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో చాలా చోట్ల నేడు, రేపు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. తూర్పు ఉత్తరప్రదేశ్, దానిని ఆనుకుని బిహార్ ప్రాంతాల్లో తీవ్ర అల్పపీడనం కొనసాగుతుండటంతో, దీనికి అనుబంధముగా 7.6 కి.మీ ఎత్తు వరకు ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని వాతావరణ కేంద్రం పేర్కొంది.

**వివిధ ప్రాంతాల్లో నమోదైన వర్షపాతం**
అశ్వాపురం(భద్రాద్రి కొత్తగూడెం) 5 సెం.మీ, నల్లబెల్లి(వరంగల్ రూరల్) 5 సెం.మీ, దుమ్ముగూడెం(భద్రాద్రి కొత్తగూడెం) 4 సెం.మీ, భీమిని(మంచిర్యాల) 4 సెం.మీ, ఆసిఫాబాద్(కుమురం భీం) 4 సెం.మీ, సారంగపూర్(నిర్మల్) 4 సెం.మీ, ఉట్నూర్(ఆదిలాబాద్) 3 సెం.మీ, ఘన్‌పూర్(జనగాం) 3 సెం.మీ, కొత్తగూడెం(భద్రాద్రి కొత్తగూడెం)3 సెం.మీ, టేకులపల్లి 3 సెం.మీ, జైనూర్ 3 సెం.మీ, పాల్వంచ 3 సెం.మీ,.

## కన్వీనర్ కోటా జాబితా వెల్లడి నేడే

**2,865 ఎంబీబీఎస్ సీట్లకు 11 వేల మంది ఆప్షన్లు**



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లోని కన్వీనర్ కోటా ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లు పొందిన విద్యార్థుల జాబితాను బుధవారం కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం విడుదల చేయనుంది. మొదటి విడత కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా నీట్‌లో అర్హత పొందిన విద్యార్థులు ఆప్షన్లను ఎంపిక చేసుకున్నారు. ప్రభుత్వం, ప్రైవేటుసహా మైనారిటీ కాలేజీల్లోని కన్వీనర్ కోటాలో మొత్తం 2,865 ఎంబీబీఎస్ సీట్లున్నాయి. అలాగే 591 డెంటల్ సీట్లున్నాయి. వాటన్నింటికీ కలిపి మొత్తం 13,400 మంది దరఖాస్తు చేసుకోగా, మంగళవారం నాటికి 11 వేల మంది విద్యార్థులు తమ ఆప్షన్లు ఎంపిక చేసుకున్నారని విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ డాక్టర్ కరుణాకర్‌రెడ్డి 'సాక్షి'కి తెలిపారు. బుధవారం మధ్యాహ్నం వరకు కూడా ఆప్షన్ల కోసం సమయముందని, అనంతరం జాబితా విడుదల చేస్తామని పేర్కొన్నారు. ఇదిలావుండగా ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో కన్వీనర్ కోటా సీట్లల్లో అగ్రవర్ణ పేదలకు (ఈడబ్ల్యూఎస్) రిజర్వేషన్ల అమలు, సీట్ల పెంపుపై ఇప్పటికీ ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. 10 ప్రైవేట్ మెడికల్ కాలేజీలు అదనపు సీట్ల కోసం దరఖాస్తు చేసుకున్నా ఇప్పటికీ మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ) అనుమతివ్వలేదు. ఇస్తుందన్న నమ్మకం కూడా లేదని వైద్య విద్యా వర్గాలు చెబుతున్నాయి. ఎందుకైనా మంచిదని సీట్లు పెరుగుతాయన్న ఆశతో ఈడబ్ల్యూఎస్ కోటా సీట్లకు నోటిఫికేషన్ ఇవ్వకుండా విశ్వవిద్యాలయం ఆలస్యం చేస్తోంది.

## విభజన హామీలు నెరవేర్చండి

**లోక్‌సభలో ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం ద్వారా కేంద్రం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కాంగ్రెస్ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోరారు. మంగళవారం ఆయన లోక్‌సభ జీరో అవర్‌లో ఈ అంశంపై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారంలో స్టీల్ ప్లాంటు, తెలంగాణలో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుపై కేంద్రం హామీలు ఇచ్చిందని గుర్తుచేశారు. గడిచిన ఏడాది గిరిజన వర్సిటీకి కేవలం రూ. 1 కోటి మాత్రమే మంజూరు చేసిందని, ఈ ఏడాది కూడా అదే రీతిలో మంజూరు చేసిందన్నారు. 2 కోట్ల రూపాయలతో వర్సిటీ స్థాపించడం సాధ్యమేనా అని ఉత్తమ్ ప్రశ్నించారు.

**'జోగులాంబ'ను ప్రసాద్ స్కీమ్‌లోకి తీసుకురండి: బీబీ పాటిల్**
ఆలంపూర్‌లోని జోగులాంబ దేవాలయాన్ని 'ప్రసాద్'స్కీమ్‌లోకి తీసుకురావాలని టీఆర్ఎస్ ఎంపీ బీబీ పాటిల్ కేంద్రాన్ని కోరారు. మంగళవారం ఆయన లోక్‌సభ జీరో అవర్‌లో ఈ అంశంపై మాట్లాడారు.

## మిషన్ భగీరథకు నిధులివ్వండి: నామా

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రతిపాదించిన హర్ ఘర్ జల్ పథకాన్ని తెలంగాణలో ఇప్పటికే మిషన్ భగీరథ పథకం ద్వారా అమలు చేసి ఇంటింటికీ సురక్షిత నీటిని అందిస్తున్నామని, ఈ పథకానికి నీతి ఆయోగ్ సిఫారసు చేసిన మేరకు రూ.24 వేల కోట్లు కేటాయించాలని టీఆర్ఎస్ లోక్‌సభాపక్ష నేత నామా నాగేశ్వర రావు కేంద్రాన్ని కోరారు. బడ్జెట్‌పై మంగళవారం లోక్‌సభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. ఈ బడ్జెట్‌లో మిషన్ భగీరథకు నిధులు కేటాయిస్తారని ఎదురు చూసినప్పటికీ ఆశాభంగమే అయ్యిందన్నారు. హర్ ఘర్ జల్ పథకాన్ని ఇప్పటికే తెలంగాణలో అమలు చేసినందున ఆ పథకానికి వెచ్చించిన నిధులను కేంద్రం చెల్లించాలని కోరారు.

# సీబీఐకి బుక్కయిన బొల్లినేని గాంధీ

▶ మొదటి పేజీ తరువాయి

గాంధీ నివాసాలు, కార్యాలయంపై మంగళవారం ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిపి సోదాల్లో పలు కీలక డాక్యుమెంట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్, విజయవాడ, అమరావతిలలో తండ్రి నర్సింహారావు, భార్య శిరీషా, కుమార్తెల పేర్ల మీదనే కాక తన పేరు మీద కూడా గాంధీ భారీగా ఆస్తులు కూడబెట్టినట్లు సీబీఐ అధికారులు గుర్తించారు. మొత్తంగా గాంధీ 288 శాతం మేర ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినట్లు లెక్కలతో సహా తేల్చారు. రూ.3.74 కోట్ల ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఈ ఆస్తుల విలువ బహిరంగ మార్కెట్‌లో దాదాపు రూ.200 కోట్ల వరకు ఉంటుందని అంచనా. దీంతో ప్రస్తుతం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని కేంద్ర జీఎస్టీ పన్ను ఎగవేత విభాగం సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న శ్రీనివాస గాంధీపై సీబీఐ అధికారులు అవినీతి నిరోధక చట్టం, భారతీయ శిక్షా స్మృతి (ఐపీసీ) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఇందులో గాంధీ, ఆయన సతీమణి శిరీషాలను నిందితులుగా చేర్చారు. 2010 జనవరి 1 నుంచి 2019 జూన్ 27 వరకు ప్రభుత్వోద్యోగిగా గాంధీ ఉద్దేశపూర్వకంగా తన ఆస్తులను పెంచుకునేందుకు నేరపూరిత దుష్ప్రవర్తనకు పాల్పడ్డారని సీబీఐ అధికారులు తమ ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. బీఎస్ గాంధీపై ఐపీసీ సెక్షన్–109, ప్రివెన్షన్ ఆఫ్ కరప్షన్ యాక్ట్ 1988లోని 13 (2), 13(1)(బి) సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తు బాధ్యతలను సీబీఐ ఇన్‌స్పెక్టర్ (ఏసీబీ) వి.వివేకానందస్వామికి అప్పగిస్తూ సీబీఐ డీఐజీ వి.చంద్రశేఖర్ ప్రొసీడింగ్స్ జారీచేశారు.

**బాబుకు అత్యంత సన్నిహితుడు..**
బొల్లినేని శ్రీనివాస గాంధీ 1992 ఏప్రిల్ 27న సెంట్రల్ ఎక్సైజ్ శాఖలో ఇన్‌స్పెక్టర్‌గా చేరారు. 2002లో సూపరింటెండెంట్‌గా పదోన్నతి పొంది హైదరాబాద్ కమిషనరేట్–1లో పోస్టింగ్ పొందారు. 2003లో డిప్యుటేషన్‌పై డీఆర్ఐ (డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్)కి వెళ్లారు. అక్కడి నుంచి 2004లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కి వెళ్లి, 2017 వరకు అక్కడే ఉన్నారు. ఆ తరువాత జీఎస్టీకి బదిలీ అయ్యారు. ఈ బదిలీ కూడా నిబంధనలను పట్టించుకోకుండా జరిగినట్లు సమాచారం. అప్పట్లో అడిషనల్ డైరెక్టర్ హోదాలో ఉన్న ఓ అధికారి ప్రోద్బలంతో బీఎస్ గాంధీని నియమించారని ఆరోపణలు వెల్లువెత్తాయి. కాగా, ఆయన తొలి పే గ్రేడ్ రూ.5,400. సవరించిన వేతన స్కేల్ ప్రకారం ఆయన లెవెల్–9 జీతాన్ని అందుకుంటున్నారు. గాంధీ దాదాపు 13 ఏళ్లపాటు ఈడీలో పనిచేశారు. ఈ సమయంలో ఆయన అప్పటి సీఎం చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడిగా మారారు. టీడీపీ రాజకీయ ప్రయోజనాల కోసం గాంధీ పనిచేశారు.

**అప్పుడున్న ఆస్తులు రూ.21 లక్షలే..**
2010–2019 మధ్య కాలంలో గాంధీ తన పేరు మీద, తన కుటుంబ సభ్యుల పేరు మీద భారీగా స్థిర, చరాస్తులను కూడబెట్టినట్లు సీబీఐ అధికారులు గుర్తించారు. గాంధీ అక్రమాస్తుల లెక్కింపునకు సీబీఐ అధికారులు ఈ 2010–19 మధ్య కాలాన్ని చెక్ పీరియడ్‌గా పరిగణనలోకి తీసుకున్నారు. 2010 జనవరి 1 నాటికి ముందు గాంధీ స్థిర, చరాస్తుల విలువ రూ.21,00,845గా ఉన్నట్లు గుర్తించిన సీబీఐ అధికారులు.. జూన్ 27, 2019 నాటికి గాంధీ, ఆయన కుటుంబ సభ్యుల ఆస్తులు రూ. 2,74,14, 263కు చేరుకున్నట్లు తేల్చారు. అలాగే, 2010–19 మధ్య కాలంలో గాంధీ, ఆయన కుటుంబ సభ్యుల ఆదాయాన్ని రూ.1,30,07,800లుగా సీబీఐ అధికారులు తేల్చారు. 2011–14 మధ్య కాలంలో నారాయణ ఒలింపియాడ్‌లో కుమార్తె చదువు నిమిత్తం రూ.4 లక్షలు ఖర్చు చేసినట్లు గుర్తించారు. అంతేకాక, రామచంద్ర యూనివర్సిటీలో కుమార్తె ఎంబీబీఎస్ కోర్సు కోసం రూ.70 లక్షలు చెల్లించినట్లు తేల్చారు. కూకట్‌పల్లిలోని హైదర్‌నగర్‌లో ఇంటి నిర్మాణం కోసం గాంధీ ఏకంగా రూ.1.20 కోట్లు వెచ్చించినట్లు తెలుసుకుని ఆశ్చర్యపోయారు. ఈ ఇంటికి సంబంధించి రూ.27 లక్షల రుణాన్ని చెల్లించారు. ఆస్తులు, ఖర్చులను రూ.5.04 కోట్లుగా తేల్చిన అధికారులు, ఆదాయాన్ని మాత్రం రూ.1.30 కోట్లుగా గుర్తించారు. ఇలా ఆయన మొత్తం రూ.3,74,73,046 ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టినట్లు లెక్కలు తేల్చారు.

### సుజనా కేసులు దర్యాప్తు చేస్తోందీ ఇతనే..

కేంద్ర మాజీమంత్రి, చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడైన సుజనాచౌదరికి చెందిన గ్రూపు కంపెనీల మనీలాండరింగ్‌పై వచ్చిన ఫిర్యాదులను గాంధీ ఉద్దేశపూర్వకంగా బుట్ట దాఖలుచేశారు. పూర్తి ఆధారాలున్నా కూడా సుజనా కంపెనీలపై ఎటువంటి చర్యలు తీసుకోలేదన్న ఫిర్యాదులు గాంధీపై వెల్లువెత్తాయి. ఇదే రీతిలో పలు కంపెనీల విషయంలోనూ గాంధీ చూసీచూడనట్లు వ్యవహరించారని.. ఫైళ్లను తారుమారు చేశారని కేంద్ర ఆర్థిక శాఖకు గతంలోనే పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు అందాయి. చంద్రబాబు రాజకీయ ప్రయోజనాలను కాపాడిన నేపథ్యంలోనే గాంధీ ఇంత భారీస్థాయిలో అక్రమాస్తులను కూడబెట్టినట్లు సీబీఐ అధికారులు అనుమానిస్తున్నారు. తమ ప్రయోజనాల మేరకు గాంధీ పనిచేయడంతో అప్పటి అధికార పార్టీ వర్గాలు ఆయనకు రాజధాని అమరావతి ప్రాంతంలో భూమిని కట్టబెట్టినట్లు కూడా సీబీఐ వర్గాలు భావిస్తున్నాయి. కాగా, గాంధీ విజయవాడ చుట్టపక్కల ప్రాంతాల్లో భారీగా ఆస్తులు కూడబెట్టడంపై సీబీఐ వర్గాలు ప్రత్యేక దృష్టి పెట్టాయి. జీఎస్టీ పన్ను ఎగవేత విభాగం సూపరింటెండెంట్‌గా కూడా ఆయన పలు కంపెనీలను ఇబ్బందులకు గురిచేశారన్న ఆరోపణలున్నాయి. వీటిపై కూడా సీబీఐ దర్యాప్తు చేయనున్నట్లు తెలిసింది.

### సీబీఐ గుర్తించిన ఆస్తులివే..

- కృష్ణాజిల్లా కంకిపాడులో గాంధీ తండ్రి బి.నర్సింహారావు పేరు మీద 360 చదరపు గజాల స్థలం, ప్రొద్దుటూరులో తండ్రి పేరు మీద 266.66 చ.గ. స్థలం.
- కొండాపూర్, రాజరాజేశ్వరి నగర్‌లో తండ్రి పేరు మీద రూ.17.15 లక్షల విలువ చేసే 93,300 చ.గజాల స్థలం.
- కూకట్‌పల్లి, హైదర్‌నగర్‌లో గాంధీ పేరు మీద రూ.29.56 లక్షల విలువ చేసే 257.83 గ. స్థలం, రంగారెడ్డి జిల్లా మదీనాగూడలో 10 గుంటల స్థలం. ఇందులో గాంధీ భార్య శిరీషా వాటా రూ.12.31 లక్షలు.
- విజయవాడ ఎనికేపాడులో భార్య పేరు మీద రూ.28.71 లక్షల విలువ చేసే 0.43 సెంట్ల భూమి, తరిగొప్పుల గ్రామంలో కుమార్తె పేరు మీద రూ.15.67 లక్షల విలువ చేసే 2.96 ఎకరాల భూమి.
- గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం మందడం గ్రామంలో రూ.2.72 లక్షల విలువ చేసే 0.42 సెంట్ల భూమి.
- విజయవాడ, గుణదల వార్డు నెంబర్ 31లో రూ.72.87 లక్షల విలువ చేసే 327 చ.గజాల భూమి. ఇది గాంధీ తండ్రి, భార్య, మరొకరి పేరు మీద ఉంది.
- విజయవాడ శివారు పెదపులిపాక గ్రామంలో రూ.9.14 లక్షల విలువ చేసే 242 చ.గజాల స్థలం, కానూరులో తండ్రి, చిన్న కుమార్తె పేరు మీద రూ.45.15 లక్షల విలువ చేసే 400 గ.స్థలం.
- హైదరాబాద్ కూకట్‌పల్లి యాక్సిస్ బ్యాంకులో భార్య శిరీష పేరు మీద రూ.20 లక్షల బ్యాలెన్స్, తండ్రి పేరు మీద ఉన్న జాయింట్ ఖాతాలో రూ.10.12 లక్షల బ్యాలెన్స్, శిరీష పేరు మీద రూ.6.50 లక్షల విలువ చేసే ఫోక్స్ వ్యాగన్ పోలో కారు ఉన్నట్లు సీబీఐ అధికారులు గుర్తించారు.

# తెలంగాణ వచ్చినా ప్రజల లక్ష్యం నెరవేరలేదు

- కాళేశ్వరం ప్రాజెక్టుకు నిధులు కేటాయించండి
- ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వండి
- బడ్జెట్‌పై చర్చలో కోమటిరెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: పదకొండు వందల మంది విద్యార్థుల ఆత్మబలిదానం తరువాత కొత్త రాష్ట్రం ఏర్పడినా.. ప్రజల లక్ష్యం నెరవేరలేదని కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు. 4 దశాబ్దాల పోరాటం అనంతరం సోనియాగాంధీ, మన్మోహన్‌సింగ్‌ల నేతృత్వంలో, అప్పటి ప్రతిపక్షం బీజేపీ సహకారంతో తెలంగాణ ఏర్పడిందని, ఇప్పటికీ మేం అనుకున్న లక్ష్యం నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్‌పై మంగళవారం జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఓవర్ డ్రాఫ్ట్ సౌకర్యం కల్పించడం స్వాగతించదగిన పరిణామమేనని, సగటు మహిళ ఇష్టపడే బంగారంపై దిగుమతి సుంకం విధించడం అన్యాయమని పేర్కొన్నారు. పెట్రో ఉత్పత్తుల ధరలు పెంచి సామాన్యులపై ఆర్థిక భారం మోపారని ఆరోపించారు. ఇండియా ఫార్మా ఎగుమతుల్లో అగ్రశ్రేణిగా నిలిచిందని, కానీ ఈ రంగానికి కేంద్ర బడ్జెట్ మద్దతుగా నిలవలేదని, ఇది ఆ పరిశ్రమను తీవ్రంగా నిరుత్సాహపరచడమేనని అభిప్రాయపడ్డారు. 2022 నాటికల్లా రైతుల ఆదాయం ఏవిధంగా రెట్టింపు అవుతుందో బడ్జెట్లో చెప్పలేదన్నారు. రైతులకు కనీస మద్దతు ధర లభించడం లేదని, వారికి పెట్టుబడులు తిరిగిరావడంలేదని, దీంతో రైతులు పెద్ద సంఖ్యలో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**అప్పులు పెరిగిపోయాయి**
గడిచిన ఐదేళ్లలో తెలంగాణలో అప్పులు చాలా పెరిగిపోయాయని, రూ. 60 వేల కోట్ల అప్పు ఉండగా.. ఐదేళ్లలో రూ.1.59 లక్షల కోట్లకు పెరిగిందని కోమటిరెడ్డి వివరించారు. ఇంత అప్పు తెచ్చి కనీసం మౌలిక వసతులపై కూడా ఖర్చు చేయలేని పరిస్థితి నెలకొందన్నారు. ఇక తెలంగాణలో ఎయిమ్స్ ఏర్పాటుకు నిధులు కేటాయించలేదని, బడ్జెట్‌లో దీని ప్రస్తావనే లేదని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు రూ.లక్ష కోట్లతో రీడిజైనింగ్ చేసి మరీ నిర్మిస్తున్నారని, ఈ ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని ఆయన కోరారు. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీతోపాటుగా బయ్యారంలో ఉక్కు కర్మాగారాన్ని కూడా స్థాపించాలన్నారు. అలాగే విభజన హామీ మేరకు ఏపీకి కూడా ప్రత్యేక హోదా ఇవ్వాలని కోరారు.

**'అర్బన్'కు కొత్త ఇల్లు మంజూరు చేయండి**
తన నియోజకవర్గం పరిధిలోని అర్బన్ ప్రాంతాల్లో ఉన్న పేదలకు కొత్త ఇళ్లు మంజూరు చేయాలని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పురిని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం కేంద్ర మంత్రిని ఢిల్లీలో కలిసిన కోమటిరెడ్డి.. భువనగిరి, ఆలేరు, జనగాం, ఇబ్రహీంపట్నం ప్రాంతాలకు రెండు వేల చొప్పున ఇళ్లు మంజూరు చేయాలని విన్నవించారు.

# టీఆర్ఎస్ పేదల పొట్ట కొడుతోంది

- ఆయుష్మాన్‌భవ, ఫసల్ బీమా యోజన అందకుండా చేసింది
- బడ్జెట్‌పై చర్చలో బీజేపీ ఎంపీ బండి సంజయ్

సాక్షి, న్యూఢిల్లీ: టీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణలో పేద ప్రజల పొట్ట కొడుతోందని బీజేపీ ఎంపీ బండి సంజయ్ కుమార్ విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌పై మంగళవారం జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. 'సబ్ కా సాథ్ సబ్ కా వికాస్ సబ్ కా విశ్వాస్ లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది. ప్రధానమంత్రి ముందు నుంచి చెబుతున్నట్టుగా ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ దిశగా దేశం ముందుకు సాగుతోంది. మహిళా సాధికారతకు కేంద్రం కట్టుబడి ఉంది. స్వశక్తి మహిళా సంఘాలకు ఓవర్‌డ్రాఫ్ట్ సౌకర్యం కల్పించింది. అల్పాదాయ వర్గాలకు పెన్షన్ అందిస్తోంది. అన్ని రాష్ట్రాలకు భిన్నంగా తెలంగాణ ప్రభుత్వం వ్యవహరిస్తోంది. మంచి జరిగితే తాను క్లెయిం చేసుకుంటోంది... లేదంటే కేంద్రంపై బురదజల్లుతోంది. బడ్జెట్‌లో తెలంగాణకు ఒరిగిందేమీలేదని టీఆర్ఎస్ అంటోంది. పార్లమెంటు వేదికగా వాటిని ఖండిస్తున్నా. గిరిజన విశ్వవిద్యాలయానికి, ఓషియన్ స్టడీస్ సెంటర్‌కు, సాలార్‌జంగ్ మ్యూజియానికి, ఫిషరీస్ బోర్డుకు, హైదరాబాద్ ఐఐటీకి, ఔటర్‌రింగ్ రోడ్డు ప్రాజెక్టుకు కేంద్రం నిధులు కేటాయించింది. ఐదేళ్ల కింద తెలంగాణలో జాతీయ రహదారుల సగటు అట్టడుగున ఉంటే.. కేంద్రం రూ.60 వేల కోట్లు కేటాయించింది. ఈరోజు జాతీయ రహదారుల సగటులో అగ్రగామిగా నిలిచింది. రైతుబంధు కేవలం బడాబాబుల లబ్ధికే.. కానీ కిసాన్ సమ్మాన్ నిధి వ్యవసాయాన్ని నమ్ముకున్న రైతులకు ఉపయోగపడుతుంది. ఫసల్ బీమా యోజన, ఆయుష్మాన్‌భవ యోజన తెలంగాణ ప్రజలకు అందకుండా చేసింది. మిషన్ కాకతీయ ప్రాజెక్టుతో నిధులు దుర్వినియోగం చేసింది. తెలంగాణ రాష్ట్రానికి ఇంకా నిధులు కేటాయించేలా మా వంతు పాత్ర పోషిస్తాం..' అని పేర్కొన్నారు.

# నమ్మించి గొంతు కోశాడు

▶ మొదటి పేజీ తరువాయి

అపస్మారక స్థితిలో ఉన్న వెంకటేశ్‌ను పోలీసులు ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

**పథకం ప్రకారమే...**
సంఘటనాస్థలంలో దొరికిన చాకుతోపాటు వెంకటేశ్ బ్యాగ్‌లో మరో రెండు చాకులు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీన్ని బట్టి పథకం ప్రకారమే మనస్విపై దాడి చేసేందుకు వెంకటేశ్ వచ్చినట్లు తెలుస్తోంది. సంఘటనాస్థలాన్ని ఎల్బీనగర్ ఏసీపీ సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్లూస్ టీం సిబ్బంది ఆధారాలు సేకరించారు. ఆమె వేరే యువకుడితో సన్నిహితంగా ఉంటూ తనను నిర్లక్ష్యం చేస్తోందని వెంకటేశ్ కక్ష గట్టి దాడికి పాల్పడి ఉండ వచ్చని పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

**వెంటిలేటర్‌పై మనస్వి...**
మనస్వి కొత్తపేట ఓమ్ని ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. మెడ గాయానికి ఆపరేషన్ చేసినట్లు ఆసుపత్రి వైద్యులు శ్రీకర్ తెలిపారు. మనస్వి చేతివేళ్లు కూడా తెగాయని, రక్తం ఎక్కువగా పోయిందని, ప్రస్తుతం వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నామని తెలిపారు. మనస్వి పరిస్థితి విషమంగా ఉందని 48 గంటలు గడిస్తేగాని ఏమీ చెప్పలేమని వైద్యులు తెలిపారు.

### ఆ రూమే కావాలి...

దిల్‌సుఖ్‌నగర్ వచ్చిన వెంకటేశ్ ముందుగా ఓయో యాప్‌లో బుక్ చేసిన రూం కాకుండా 501 రూం కావాలని బృందావన్ హోటల్ సిబ్బందిని అడిగినట్లు సమాచారం. కుదరదన్నా పట్టుపట్టి అదే రూం కావాలని కోరాడు. దీంతో సిబ్బంది తప్పని పరిస్థితిలో వెంకటేశ్‌కు ఆ రూం కేటాయించారు. ఫ్లోర్‌లో 501 రూం చివరిగా ఉండటం, గొడవ జరిగినా ఎవరూ పసిగట్టలేరని భావించి ఉండవచ్చని అనుమానాలు కలుగుతున్నాయి. దీన్ని బట్టి మనస్విని అంతమొందించాలని పథకం ప్రకారమే రప్పించినట్లు భావిస్తున్నారు.

# కలెక్టర్లకు 'పుర' పవర్స్!

▶ మొదటి పేజీ తరువాయి

కట్టబెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులు అమలు చేయడమే కాకుండా పురపాలనను గాడిలో పెట్టే బాధ్యతను కూడా వారికే అప్పగించింది. మున్సిపాలిటీలను పర్యవేక్షించే బాధ్యతను ప్రభుత్వం కలెక్టర్ల ద్వారా చేపట్టనుంది. తద్వారా పురపాలక సంఘాలపై ప్రభుత్వ అజమాయిషీ కొనసాగనుంది. ఇందులో భాగంగా పన్నుల వసూళ్లు, హరితహారం, ప్రభుత్వ పథకాల అమలులో పాలకవర్గాలను బాధ్యులను చేయనుంది. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకునే అధికారం కలెక్టర్లకు కట్టబెట్టనుంది. ఇప్పటివరకు పాలకవర్గాల తీర్మానాలను మాత్రమే సమీక్షించే అధికారం కలెక్టర్లకు ఉండేది. కొత్త చట్టంలో అవసరమైతే ప్రజాప్రతినిధులపై వేటు వేసే విచక్షణాధికారం కూడా కలెక్టర్లకు ఇవ్వాలని ప్రభుత్వం యోచిస్తోంది. ప్రతి 15 రోజులకోసారి మున్సిపాలిటీలను తనిఖీ చేసేలా, పనితీరు సమీక్షించేలా జాబ్‌చార్ట్‌ను రూపొందిస్తోంది.

### ప్రజాప్రతినిధులపై సీఎం ఆసక్తికర వ్యాఖ్యలు

ఇటీవల జరిగిన ఓ మున్సిపల్ సమీక్ష సమావేశంలో సీఎం కేసీఆర్ ఆసక్తికర వ్యాఖ్య లు చేసినట్లు మున్సిపల్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. టౌన్ ప్లానింగ్ అంతా అవినీతిమయమైందని, ఈ వ్యవస్థ ప్రజలకు ఉప యోగపడట్లేదని సీఎం అభిప్రాయపడ్డట్లు సమాచారం. టౌన్ ప్లానింగ్‌తో పాటు ప్రజాప్రతినిధులపై కూడా ఆయన చేసిన కీలక వ్యాఖ్యల ఆధారంగానే కొత్త చట్టంలో కలెక్టర్లకు కీలక అధికారాలిస్తున్నారనే చర్చ జరుగుతోంది. తాము ఇటీవలే హైదరాబాద్‌లో సర్వే నిర్వహించామని, ఇందులో 90 శాతం మంది కార్పొరేటర్లు అవినీతిపరులనే అభిప్రాయం ప్రజల్లో ఉందని, వీరి వల్ల స్థానికంగా ఎలాంటి ఉపయోగం లేదని, వీరి కంటే ప్రత్యేకాధికారుల పాలనే మేలనే ఉద్దేశంతో ప్రజలున్నారని చెప్పిన కేసీఆర్ అవినీతి చేసినా, అంకిత భావంతో పనిచేయకపోయినా చైర్మన్లు, కౌన్సిలర్లను కూడా సస్పెండ్ చేసే అధికారాలుండాలని చెప్పారని ఉన్నతాధికారులు చెబుతున్నారు.

**అప్పిలేట్ ట్రిబ్యునల్..!**
ప్రజాప్రతినిధులపై తీసుకునే చర్యలను సమీక్షించేందుకు ప్రత్యేక అప్పిలేట్ ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేసే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. ప్రస్తుత చట్టం ప్రకారం ప్రజాప్రతినిధులపై చర్యలు తీసుకునే అధికారం ప్రభుత్వానికే ఉండేది. తాజాగా దీన్ని కలెక్టర్లకు కట్టబెడుతూ.. సమీక్షించేందుకు ప్రత్యేక ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయనుంది. దీనికి జిల్లా జడ్జి స్థాయి అధికారి అప్పిలేట్ అధికారిగా వ్యవహరించే అవకాశముంది.

## నేడు ఇంజనీరింగ్ సీట్ల కేటాయింపు

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్‌లో సీట్ల కేటాయింపు వివరాలను బుధవారం ప్రకటించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని ఎంసెట్ ప్రవేశాల కమిటీ కన్వీనర్ నవీన్ మిట్టల్ తెలిపారు. ఎంసెట్‌లో అర్హత సాధించిన వారిలో 53,934 మంది విద్యార్థులు సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరుకాగా అందులో 52,629 మంది వెబ్ ఆప్షన్లు ఇచ్చుకున్నారని వెల్లడించారు. మిగతా 1,305 మంది ఆప్షన్లు ఇవ్వలేదన్నారు. ఆప్షన్లు ఇచ్చుకున్న వారిలో ఒక విద్యార్థి అత్యధికంగా 770 ఆప్షన్లు ఇచ్చారని తెలిపారు. సీట్ల కేటాయింపు వివరాలను ఈనెల 10న https://tseamcet.nic.inలో ఉంచుతామని తెలిపారు. సీటు పొందిన విద్యార్థులు 10 నుంచి 15లోగా ఆన్‌లైన్ ద్వారా ఫీజు చెల్లించి, సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని సూచించారు.

## ఓయూ దూరవిద్య కోర్సులకు సెమిస్టర్ సిస్టమ్

హైదరాబాద్: ఓయూ దూరవిద్యలో వివిధ కోర్సులకు 2020–21 విద్యా సంవత్సరం నుంచి సెమిస్టర్ పరీక్ష విధానాన్ని ప్రవేశ పెట్టనున్నట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ చింత గణేశ్ తెలిపారు. మంగళవారం ఓయూలోని ప్రొఫెసర్ జి.రామిరెడ్డి దూరవిద్య కేంద్రంలో జరిగిన సలహా మండలి సమావేశంలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి డిగ్రీ, పీజీ, వివిధ డిప్లొమా కోర్సుల్లో సెమిస్టర్ విధానంలో పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించనట్లు తెలిపారు.













## కోమటిరెడ్డి ఆరోపణలు నిరాధారం: సుమన్



**సాక్షి, హైదరాబాద్:** టీఆర్‌ఎస్‌లో బలహీన వర్గాల నుంచి ఎదుగుతున్న వారిని లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ పార్టీ నేత, ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఎమ్మెల్యే బాల్క సుమన్ విమర్శించారు. ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుతో కలిసి మంగళవారం అసెంబ్లీ ఆవరణలోని టీఆర్‌ఎస్ శాసనసభా పక్ష కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ నాయకత్వంలో ఉద్యమకాలం నుంచి నోరు కట్టుకుని చిత్తశుద్ధితో ప్రజాసేవ చేస్తున్న తమపై కోమటిరెడ్డి ఆరోపణలు సరికాదన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై ప్రశ్నించలేని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్.. రాష్ట్ర ప్రభుత్వంపై అనవసరంగా గొంతు చించుకుంటున్నారన్నారు. టీఆర్‌ఎస్ ఎమ్మెల్సీపై చేసిన ఆరోపణలకు కోమటిరెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని వివేకానంద డిమాండ్ చేశారు. తనపై చేసిన ఆరోపణలకు కోమటిరెడ్డి క్షమాపణ చెప్పకుంటే పరువు నష్టం దావా వేస్తానని.. ఆరోపణలు రుజువు చేస్తే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తానని రాజు అన్నారు.

## కాంగ్రెస్ ఎంపీల తీరు.. ప్రశ్నార్థకం: బూర



**సాక్షి, హైదరాబాద్:** పార్లమెంటులో ప్రశ్నించే గొంతులు ఉండాలంటూ రాష్ట్రం నుంచి లోక్‌సభకు ఎన్నికైన కాంగ్రెస్ ఎంపీలు తమ గొంతును ప్రశ్నార్థకం చేసుకుంటున్నారని టీఆర్‌ఎస్ మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ విమర్శించారు. టీఆర్‌ఎస్ నేత క్యామ మల్లేశ్‌తో కలసి మంగళవారం తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. గల్లీలో లేవనెత్తాల్సిన అంశాలు ఢిల్లీలో, అక్కడ ప్రస్తావించాల్సిన అంశాలు రాష్ట్రంలో మాట్లాడుతున్నారన్నారు. ఎంపీ కోమటిరెడ్డి ఇప్పుడు కాంగ్రెస్.. రేపు ఏ పార్టీలో ఉంటారో తెలియని స్థితిలో ఉన్నారని ఎద్దేవా చేశారు. తమ భవిష్యత్‌పై స్పష్టత లేకపోవడంతో బీజేపీని ప్రశ్నించాల్సిన కాంగ్రెస్ ఎంపీలు.. టీఆర్‌ఎస్‌పై నిందలు మోపుతున్నారని విమర్శించారు.

## 'మా విద్యార్థుల స్కాలర్‌షిప్‌ల్లో కోత'



**సాక్షి, న్యూఢిల్లీ:** ఎన్డీయే ప్రభుత్వం ముస్లిం విద్యార్థుల స్కాలర్‌షిప్‌లకు కేటాయింపులు తగ్గించి అన్యాయం చేసిందని ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర బడ్జెట్‌పై మంగళవారం జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు, పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు, మెరిట్ కమ్ మీన్స్ స్కాలర్‌షిప్‌లు, విదేశీ విద్యను అభ్యసించేవారికి ఉద్దేశించిన ఆర్థికసాయం, హజ్రత్ మహల్ స్కాలర్‌షిప్.. ఇలా ముస్లిం విద్యార్థులకు ఉద్దేశించిన అన్ని పథకాల్లో బడ్జెట్ కేటాయింపులు తగ్గించారని ఆందోళన వ్యక్తంచేశారు. 'హజ్ సబ్సిడీ రూ. 500 కోట్ల నుంచి రూ. 89 కోట్లకు తగ్గించారు. మా పేరు మీద వచ్చే ఆ సొమ్ములో రూ. 400 కోట్లు తినేశారు..'అని ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వం నిర్మిస్తున్న కాళేశ్వరం, పాలమూరు ఎత్తిపోతల పథకాలకు నిధులు కేటాయించాలని విన్నవించారు.

## 'సంగారెడ్డి'కి తాగునీరివ్వండి: జగ్గారెడ్డి



**సాక్షి, హైదరాబాద్:** సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలు తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గోదావరి నీటిని సంగారెడ్డికి తరలించి నియోజకవర్గంలోని సమస్యను పరిష్కరించాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి సీఎం కేసీఆర్‌ను కోరారు. ఈ మేరకు ఆయన సీఎంకు లేఖ రాశారు. అసెంబ్లీ ప్రాంగణంలో జగ్గారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. 'మంజీరా, సింగూరు డ్యామ్‌లు ఇప్పుడు క్రికెట్ గ్రౌండ్‌లుగా మారిపోయాయి. ఏడాది నుంచి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నా. సంగారెడ్డిలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉంది'అని అన్నారు. హైదరాబాద్ నుంచి పఠాన్‌చెరువుకు వచ్చే గోదావరి నీళ్లనైనా సంగారెడ్డికి తీసుకురావాలన్నారు. సంగారెడ్డి నియోజకవర్గ ప్రజల నీటి కష్టాలను తీర్చే బాధ్యత ఈ ప్రాంత ఎంపీ ప్రభాకర్‌రెడ్డిపై కూడా ఉందన్నారు. కొట్లాడే పరిస్థితిలో తాము లేమని.. అడుక్కుని తాగాలి.. లేదంటే చావాలని వ్యాఖ్యానించిన జగ్గారెడ్డి ఈ విషయంలో సీఎం సానుకూలంగా స్పందించాలని కోరారు.

## గరిష్టంగా రెండు పేర్లే..: కాంగ్రెస్

**సాక్షి, హైదరాబాద్:** మున్సిపల్ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక పకడ్బందీగా చేపట్టాలని కాంగ్రెస్ నిర్ణయించింది. మున్సిపల్ కౌన్సిలర్లు, కార్పొరేషన్లలో కార్పొరేటర్లుగా పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్న వారిలో గరిష్టంగా ఇద్దరి పేర్లను మాత్రమే పరిగణనలోకి తీసుకుని, వారిలో ఒకరికి పోటీచేసే అవకాశమివ్వాలని టీపీసీసీ భావిస్తోంది. ఎక్కువ మంది అభ్యర్థుల పేర్లను పరిగణనలోకి తీసుకుంటే గజిబిజి ఏర్పడుతుందని, దీంతో సిఫారసులు ఎక్కువై అభ్యర్థుల ఎంపిక సరిగా జరిగే అవకాశం ఉండదని స్థానిక నాయకత్వానికి టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచించినట్లు సమాచారం. కాగా, మున్సిపల్ ఎన్నికలకు సన్నాహకంగా రాష్ట్రవ్యాప్తంగా మూడ్రోజుల పాటు కాంగ్రెస్ సమావేశాలు నిర్వహించనుంది. అన్ని మున్సిపల్ కేంద్రాల్లో ఈ సమావేశాలు ఈనెల 13,14,15 తేదీల్లో జరగనున్నాయి.

## వారిని రెగ్యులరైజ్ చేయాలి: ఆర్.కృష్ణయ్య



**సాక్షి, హైదరాబాద్:** బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లలో పనిచేసే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని మంగళవారం బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో వందలాది మంది వర్కర్లు బీసీ సంక్షేమ భవన్‌ను ముట్టడించారు. అనంతరం విలేకరుల సమావేశంలో కృష్ణయ్య మాట్లాడుతూ.. ప్రస్తుతం తెలంగాణలోని 272 బీసీ కాలేజీ హాస్టళ్లలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పని చేస్తున్నారని చెప్పారు. ప్రతి హాస్టల్‌లో ఔట్ సోర్సింగ్ కింద ముగ్గురు ఉద్యోగులు పనిచేస్తున్నారని.. వీరిని రెగ్యులరైజ్ చేయాలని మూడేళ్లుగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. విద్యుత్ శాఖ, ఇతర శాఖల్లో పనిచేసే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేశారని తెలిపారు. వీరి మాదిరిగానే హాస్టళ్లలోని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు.

## 'వర్షాభావంపై శ్వేతపత్రం విడుదల చేయాలి'



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో వర్షాలు లేక వందల మండలాల్లో దుర్భిక్షం నెలకొందని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లు ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ కనీస సమీక్ష చేయడం లేదని, అసలు రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా? అన్న అనుమానం కలుగుతోందన్నారు. వర్షాభావ పరిస్థితులు, కరువుపై ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కేటీఆర్ ఒక ఎమ్మెల్యేగా ఉంటూ ప్రిన్సిపల్ సెక్రటరీలతో సమీక్షలు నిర్వహిస్తున్నారని, ఏ అధికారంతో వాటిని నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. సమావేశంలో బీజేపీ మీడియా కన్వీనర్ సుధాకరశర్మ పాల్గొన్నారు.

## 'సచివాలయానికే రారు.. కొత్త భవనమా?'



**సాక్షి, హైదరాబాద్:** సచివాలయానికే రాని సీఎంకు కొత్త భవనం కట్టి ఏం ప్రయోజనమని సీపీఐ కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రజా సమస్యలను పక్క దారి పట్టించేందుకే కొత్త సచివాలయం, అసెంబ్లీ భవనాల నిర్మాణాలను రాష్ట్రప్రభుత్వం తెరపైకి తెచ్చిందని ఆరోపించారు. మఖ్దూంభవన్‌లో పార్టీ సహాయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డితో కలసి ఆయన మాట్లాడారు. ఈ నెల 12న రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ప్రభుత్వ విధానాలు, సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకుంటామన్నారు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనానికి ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సబ్‌కమిటీ నియమించి విలీన ప్రక్రియను వేగవంతం చేస్తే, రాష్ట్రంలో ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు.

## అసెంబ్లీని సందర్శించిన కేరళ స్పీకర్

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర శాసనసభను కేరళ అసెంబ్లీ స్పీకర్ శ్రీరామకృష్ణన్ మంగళవారం సందర్శించారు. రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆయనకు స్వాగతం పలికారు. సభాప్రాంగణంలో వారు కాసేపు శాసనసభ సమావేశాల నిర్వహణ, ఇతర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కేరళ స్పీకర్‌ను పోచారం సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు హన్మంత్‌షిండే, విఠల్‌రెడ్డి, అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు పాల్గొన్నారు.

# కృష్ణమ్మ కొరత 900 టీఎంసీలు!

- 1,300 టీఎంసీల ఇరు రాష్ట్రాల అవసరాల్లో ఎగువ నుంచి వచ్చేది 400 టీఎంసీలే
- ఈ లోటును గోదావరితో తీర్చే అంశంపై తెలంగాణ, ఏపీ ఇంజనీర్ల చర్చలు
- కృష్ణా ప్రాజెక్టులకు గోదావరి వరద తరలింపుపై కొన్ని ప్రతిపాదనలతో ముందుకు..
- ఈ నెల 13 లేదా 15న మళ్లీ భేటీ... అనంతరం అలైన్‌మెంట్‌లపై స్పష్టత



**సాక్షి, హైదరాబాద్:** కృష్ణా నదీ జలాలపై ఆధారపడి చేపట్టిన తెలుగు రాష్ట్రాల్లోని ప్రాజెక్టులకు ఏకంగా 900 టీఎంసీల మేర నీటి కొరత ఉంటుందని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఇంజనీర్లు తేల్చారు. ఇరు రాష్ట్రాలకు కలిపి కృష్ణా బేసిన్‌లో 1,300 టీఎంసీల మేర నీటి అవసరాలుండగా ఎగువ కర్ణాటకలోని ఆల్మట్టి ఎత్తు పెంచిన పక్షంలో దిగువన ఉన్న శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టులకు 400 టీఎంసీలకు మించి నీటి రాక కష్టమేనని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో సముద్రంలో వృథాగా కలుస్తున్న గోదావరి వరద జలాలను ఒడిసిపట్టడం ఒక్కటే శరణ్యమనే అభిప్రాయానికి వచ్చిన ఇరు రాష్ట్రాల ఇంజనీర్లు.. గోదావరి నదీ జలాలను కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులకు తరలించే విషయమై కొన్ని ప్రతిపాదనలు సిద్ధం చేసి వాటిపై చర్చలు ప్రారంభించారు. గోదావరి నీటిని కృష్ణా ప్రాజెక్టులకు తరలించేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు కె. చంద్రశేఖర్‌రావు, వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఇరు రాష్ట్రాల ఇంజనీర్లు మంగళవారం హైదరాబాద్‌లోని జలసౌధలో భేటీ అయ్యారు. ఈ భేటీకి తెలంగాణ తరఫున ఈఎన్‌సీ మురళీధర్, అంతర్రాష్ట్ర జల విభాగం సీఈ నరసింహారావు, సీఈలు ఖగేందర్, నరసింహ, సీఎం ఓఎస్‌డీ శ్రీధర్ దేశ్‌పాండే, డీసీఈ నరహరిబాబు, రిటైర్డ్ ఇంజనీర్లు శ్యాంప్రసాద్‌రెడ్డి, చంద్రమౌళి, సత్తిరెడ్డి, వెంకట రామారావు, భవానీ శంకర్, ఏపీ ఈఎన్‌సీ వెంకటేశ్వర్‌రావు, ఇతర ఇంజనీర్లు రహమాన్, సి.నారాయణరెడ్డి, రత్నకుమార్, రోశయ్య, ఆర్.ప్రభాకర్‌రెడ్డి, సుబ్బారావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇరు రాష్ట్రాల ఇంజనీర్లు తాము సిద్ధం చేసిన పలు ప్రతిపాదనలు, వాటి అలైన్‌మెంట్, ఇరు రాష్ట్రాల నీటి అవసరాలు, మళ్లింపు జలాలు, వరద ఉండే రోజులు, ట్రిబ్యునల్ తీర్పుల వంటి 9 అంశాల ఎజెండాపై చర్చలు జరిపారు.

**ప్రతిపాదనలపై మరోమారు చర్చలు..**

గోదావరి నీటిని కృష్ణా బేసిన్ ప్రాజెక్టులకు తరలించే విషయంలో ఇరు రాష్ట్రాలు కొన్ని ప్రతిపాదనలపై చర్చించాయి. తుపాకులగూడెం దిగువన ఉన్న రాంపూర్ ప్రాంతం నుంచి గోదావరి నీటిని లక్నవరం మీదుగా కాకతీయ కాల్వల ద్వారా మూసీకి, అటు నుంచి ఉదయ సముద్రం మీదుగా శ్రీశైలానికి తరలించాలని తెలంగాణ ప్రతిపాదించింది. దీనికోసం కాకతీయ కాల్వల సామర్థ్యాన్ని 8,500 క్యూసెక్కుల నుంచి 25 వేల క్యూసెక్కులకు పెంచాల్సి ఉంటుందని, రాంపూర్ నుంచి లక్నవరం మధ్యలో 40 నుంచి 50 కిలోమీటర్ల టన్నెల్, మూసీ తర్వాత శ్రీశైలానికి తరలించే క్రమంలో 90 కిలోమీటర్ల టన్నెల్ తవ్వాల్సి ఉంటుందని వివరించింది. ఈ ప్రతిపాదనకు 4 లిఫ్టులు ఏర్పాటు చేయాల్సి ఉంటుందని, రూ. 70 వేల కోట్ల నుంచి రూ. 80 వేల కోట్లు వ్యయం అవుతుందని లెక్కగట్టింది. మరోవైపు ఏపీ అధికారులు... గోదావరిలో ఇంద్రావతి కలిసిన అనంతరం తుపాకులగూడెం నుంచి అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ మీదుగా గ్రావిటీ కెనాల్, టన్నెళ్ల ద్వారా డిండి దిగువ ప్రాంతం నుంచి ఎర్రగుంట వాగు మీదుగా శ్రీశైలం తరలించేలా ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు. 370 కిలోమీటర్ల మేర నీటి తరలింపు కోసం 3 లిఫ్టులు, 85 కిలోమీటర్ల టన్నెల్, 290 కిలోమీటర్ల గ్రావిటీ కెనాల్‌ను ప్రతిపాదించారు. దీంతోపాటే దుమ్ముగూడెం నుంచి గోదావరి నీటిని హాలియా వాగుకు తరలించి అక్కడి నుంచి టన్నెల్, లిఫ్టుల ద్వారా అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు తరలించి, అటు నుంచి తుపాకులగూడెం ప్రతిపాదన మాదిరే నీటిని శ్రీశైలానికి తరలించే అంశాన్ని తెలంగాణకు వివరించింది. ఈ ప్రతిపాదనలపై మరింత లోతైన విశ్లేషణ, అధ్యయనం చేశాక మరోమారు పూర్తిస్థాయిలో చర్చించి ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల ముందు వీటిని పెట్టాలనే నిర్ణయానికి అధికారులు వచ్చారు. మరోమారు చర్చల కోసం ఈ నెల 13 లేదా 15న మళ్లీ భేటీ కావాలని నిర్ణయించారు.

### కృష్ణా బేసిన్ ఆయకట్టుకు జూలైలోనే గోదావరి జలాలు..

కృష్ణా బేసిన్ పరిధిలో ఇరు రాష్ట్రాల నీటి అవసరాలపై తెలంగాణ, ఏపీ ఇంజనీర్లు తొలుత చర్చించారు. ఇరు రాష్ట్రాల ప్రాజెక్టులకు కలిపి కృష్ణా బేసిన్‌లో మొత్తంగా 1,300 టీఎంసీల అవసరం ఉంటుందని ఇరు రాష్ట్రాలు తేల్చాయి. ఇందులో తెలంగాణ 450 నుంచి 500 టీఎంసీల అవసరం ఉంటుందని తెలపగా మిగతా నీళ్లు ఏపీకి అవసరం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమైంది. ప్రస్తుతం కృష్ణా బేసిన్‌లో 10, 15, 20 ఏళ్లలో దిగువకు వచ్చిన నీటి ప్రవాహాల సగటు 600 టీఎంసీల వరకుండగా ఎగువన ఆల్మట్టి ఎత్తు 519 మీటర్ల నుంచి 524 మీటర్లకు పెంచితే దిగువకు వచ్చే నీళ్లు 400 టీఎంసీలకు మించవని ఇరు రాష్ట్రాల ఇంజనీర్లు అభిప్రాయపడ్డారు. ఈ నీళ్లు సైతం దిగువకు వచ్చేందుకు ఆగస్టు, సెప్టెంబర్ పడుతుందని ధ్రువీకరించుకున్నారు. కృష్ణాలో నీటి లభ్యత తగ్గితే 900 టీఎంసీల లోటు ఉంటుందని, దీన్ని భర్తీ చేసేందుకు గోదావరి వరద తరలింపే భావ్యమని అవగాహనకు వచ్చారు. గోదావరిలో 25 ఏళ్ల సగటును చూస్తే 2,808 టీఎంసీల నీటి లభ్యత ఉందని, ఈ 25 ఏళ్లలో అత్యంత తక్కువగా 707 టీఎంసీల వరద రాగా, గరిష్టంగా 5,959 టీఎంసీల వరద వచ్చిందని తేల్చారు. ముఖ్యంగా జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో 70 రోజులపాటు గరిష్ట వరద ఉంటుందని, ఆ రోజుల్లోనే రోజుకు 4 టీఎంసీల చొప్పున 280 టీఎంసీలు తరలించాలని నిర్ణయించారు. ఈ నీటిని కృష్ణా బేసిన్ ప్రాజెక్టుల కింద ఉన్న ఆయకట్టుకు జూలై, ఆగస్టు నెలల్లోనే ఖరీఫ్ పంటలకు నీళ్లిచ్చేలా మళ్లించాలని నిర్ణయించారు. అవసరాన్ని బట్టి, సీఎంల సూచన మేరకు ఒక్కో ప్రతిపాదిత ప్రాంతం నుంచి 3 టీఎంసీల నీటిని తీసుకునేలా ప్రణాళిక వేసుకోవాలనే నిర్ణయానికి వచ్చారు. ఈ నీటిని తరలించే క్రమంలో తలెత్తే న్యాయ పరమైన చిక్కులపై మరోమారు చర్చించాలని నిర్ణయించారు.

### అవసరాలు, లభ్యత గుర్తించాం

ఇరు రాష్ట్రాల అవసరాలు, నీటి లభ్యతను సంయుక్త భేటీలో గుర్తించాం. గోదావరి నుంచి ఎంత నీటిని వాడుకోవాలి అనే అంశంపై సూత్రప్రాయంగా ఏకాభిప్రాయంతో ఉన్నాం. ఏ విధంగా నీటిని తరలించాలి, రూట్ అలైన్‌మెంట్ తదితర అంశాలపై తదుపరి సమావేశంలో చర్చిస్తాం. ప్రాథమికంగా గోదావరిలో వెయ్యి టీఎంసీలు అందుబాటులో ఉంటుందని తేల్చాం. వీటినే కృష్ణా అవసరాలకు మళ్లించాలనే భావనలో ఉన్నాం. వివిధ ప్రతిపాదనలు చర్చకు వచ్చాయి. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల భేటీకి ముందే మరోసారి సమావేశమై వారికి ఈ ప్రతిపాదనలపై ప్రాథమిక నివేదిక సమర్పిస్తాం

*– మురళీధర్, ఈఎన్‌సీ, తెలంగాణ*

### ఇబ్బందులపై తర్వాతి భేటీలో..

గోదావరి నుంచి కృష్ణాకు నీటిని తరలించేందుకు ఉన్న అవకాశాలపై చర్చించాం. రెండు రాష్ట్రాల అవసరాలకు 4 టీఎంసీలు మళ్లించాల్సి ఉంది. ఈ నీటిని ఎలా తీసుకెళ్లాలనే అంశంపై లోతుగా చర్చ జరిగింది. సమస్యలు, ఇబ్బందులన్నింటిపై తర్వాతి సమావేశంలో చర్చిస్తాం. ఇరు రాష్ట్రాలు కలసి గోదావరి నీటిని ఎలా వాడుకోవలన్నదే మా ఆలోచన.

*– వెంకటేశ్వరరావు, ఏపీ ఈఎన్‌సీ*

# 'ఎర్రమంజిల్' హెరిటేజ్ భవనం కాదు

- తెలంగాణ హెరిటేజ్ యాక్ట్ ప్రకారం అది వారసత్వ సంపద కాదు
- హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్ అఫిడవిట్
- ఇప్పుడున్న అసెంబ్లీ భవనం సురక్షితం కాదు
- అగ్నిప్రమాద నివారణ చర్యలకు అనుగుణంగా లేదు
- అందుకే కొత్త అసెంబ్లీ నిర్మాణం కోసం కేబినెట్ ఏకగ్రీవ నిర్ణయం
- ప్రభుత్వ విధాన నిర్ణయంలో కోర్టుల జోక్యం తగదు
- సచివాలయ భవనాల కూల్చివేత వద్దన్న వ్యాజ్యాలపైనా కౌంటర్
- నేడు విచారణ జరపనున్న ఉన్నత న్యాయస్థానం

**సాక్షి, హైదరాబాద్:** ఎర్రమంజిల్ భవనం వారసత్వ సంపద జాబితాలో లేదని, అక్కడ రాష్ట్ర శాసనసభ, శాసనమండలి సముదాయాల్ని నిర్మించాలని విధాన నిర్ణయం తీసుకున్నామని రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. ఈ మేరకు తన వాదనలతో కౌంటర్ వ్యాజ్యాన్ని దాఖలు చేసింది. ఈ విషయంలో ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వరరావు, సామాజిక కార్యకర్త లుబ్నా సారస్వత్, పూర్వ విద్యార్థి జె.శంకర్‌లు దాఖలు చేసిన పిల్స్‌ను కొట్టేయాలని కోరుతూ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి సునీల్‌శర్మ కౌంటర్‌లో హైకోర్టును కోరారు. అలాగే సచివాలయ భవనాల్ని కూల్చి తిరిగి అక్కడే కొత్తవి నిర్మించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వరరావు, కాంగ్రెస్ ఎంపీ ఎ.రేవంత్‌రెడ్డి వేసిన వేర్వేరు పిల్స్‌ను కూడా కొట్టేయాలని మరో కౌంటర్ దాఖలు చేశారు.

**ప్రభుత్వ విధాన నిర్ణయాల్లో కోర్టులు జోక్యం చేసుకోరాదు...**

'ఇప్పుడున్న భవనాలు చట్టసభలకు సరిపోవడం లేదు. అందుకే కొత్తగా నిర్మించాలని నిర్ణయించాం. ఈ సముదాయంలోనే మండలి చైర్మన్, వైస్ చైర్మన్, అసెంబీ స్పీకర్, డిప్యూటీ స్పీకర్‌ల నివాసాలను కూడా నిర్మించనున్నాం. ప్రభుత్వ విధాన నిర్ణయాల్ని న్యాయస్థానాల్లో సవాల్ చేసే అవకాశం రాజ్యాంగం కల్పించలేదు. విధాన నిర్ణయాల్ని సవాల్ చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాల విషయంలో హైకోర్టు జోక్యం చేసుకోరాదు. దీనిపై గతంలో పలు హైకోర్టులు, సుప్రీంకోర్టు సైతం తీర్పులు చెప్పాయి..' అని రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్‌లో పేర్కొంది.

**వారసత్వ జాబితాలో లేదు...**

ఎర్రమంజిల్ భవనాన్ని 1998లో హైదరాబాద్ పట్టణాభివృద్ధి సంస్థ (హుడా) రెగ్యులేషన్ నంబర్ 13 ప్రకారం హెరిటేజ్ జాబితాలో చేర్చింది. ఆ తర్వాత 2015లో సమీక్ష సందర్భంగా ఆ భవనాన్ని వారసత్వ సంపద జాబితా నుంచి రాష్ట్ర ప్రభుత్వం తొలగించిందని రోడ్లు, భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి సునీల్‌శర్మ కౌంటర్‌లో పేర్కొన్నారు. హెరిటేజ్ భవనం కానందునే దానికి సమీపంలోనే పలువురు నివాసాలు ఏర్పరచుకొని కూడా ఉంటున్నారన్నారు. 'తెలంగాణ హెరిటేజ్ యాక్ట్–2017 ప్రకారం ఎర్రమంజిల్ భవనం వారసత్వ సంపద కాదు. 2015 డిసెంబర్ 7న జీవో 183 ప్రకారం అది హెరిటేజ్ బిల్డింగ్ కాదు. హుడా చట్టం–1975 ప్రకారం కూడా హెరిటేజ్ బిల్డింగ్ కాదు'అని ఆయన స్పష్టం చేశారు.

**సచివాలయ సీ–బ్లాక్‌లో అగ్నిప్రమాదం జరిగితే...**

సచివాలయ భవనాల్ని కూల్చి తిరిగి కొత్తవి నిర్మించాలని ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేసిన ప్రజాహిత వ్యాజ్యాలపైనా కౌంటర్ వ్యాజ్యాలను దాఖలు చేసిన సర్కారు... అందులో కారణాలను వివరించింది. 'ప్రస్తుత సచివాలయ ప్రాంగణంలోని 25.5 ఎకరాల స్థలంలో హెలిప్యాడ్ రెండు ఎకరాల్లో, మిగిలిన భూమిలో ఎక్కడపడితే అక్కడ భవనాల నిర్మాణం జరిగింది. అగ్నిప్రమాదం జరిగితే అగ్నిమాపక వాహనం భవనాల చుట్టూ తిరిగేందుకు చోటు లేదు. ముఖ్యంగా సీఎం, సీఎస్, జీఏడీ వంటి కీలక కార్యాలయాలు ఉన్న సీ–బ్లాక్‌లో ఏదైనా జరగకూడనిది జరిగితే వారంతా బయటకు వెళ్లే దారి కూడా ఉండదు. పదేళ్ల కాలంలో విద్యుత్ సరఫరా లోపాల కారణంగా 34 అగ్నిప్రమాదాలు జరిగాయి. అగ్నిమాపక శాఖ ఎన్నోసార్లు హెచ్చరిస్తూ నివేదికలు ఇచ్చింది. ఇలాంటి పరిస్థితుల్లో కొత్త సచివాలయ భవనాల్ని నిర్మించాలని మంత్రివర్గ సమావేశం ఈ ఏడాది జూన్ 18న నిర్ణయించింది. అందువల్ల రాజకీయ దురుద్దేశంతో వేసిన పిల్స్‌ను కొట్టేయాలి..' అని ప్రభుత్వం కౌంటర్‌లో హైకోర్టును కోరింది.

### మరమ్మతులు చేసినా సురక్షితం కాదనే...

'అసెంబ్లీ భవనాన్ని పలుసార్లు మరమ్మతులు చేసినా ఆర్ అండ్ బీ అధికారులు 2017 ఆగస్టు 16న తనిఖీ చేసి అసెంబ్లీ, కౌన్సిల్ భవనాలు సురక్షితం కాదని తేల్చి అదే ఏడాది సెప్టెంబర్ 4న ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. వీటన్నింటిపై మంత్రివర్గం చర్చించాకే కొత్త అసెంబ్లీ భవన సముదాయాల్ని నిర్మించాలని ఏకగ్రీవంగా తీర్మానించింది. ఇప్పుడున్న అసెంబ్లీ భవనం సరిపోవడం లేదు. మంత్రులంతా ఒక హాల్లో ఉంటే అధికారులు కారిడార్‌లో వేచిఉండాల్సిన పరిస్థితులు ఉన్నాయి. రెండు సభలు జరిగితే నడిచేందుకు ఇరుకిరుకుగా ఉంటుంది. అసెంబ్లీ, కౌన్సిల్ భవనాలకు అగ్నిప్రమాద నివారణ చర్యలు తీసుకునేందుకు కూడా యోగ్యంగా లేవు. ఈ కారణాల రీత్యా కొత్తగా చట్ట సభల సముదాయాన్ని నిర్మించాల్సిన అవసరం ఏర్పడింది. ఈ కారణాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని ఎర్రమంజిల్‌లో శాసనసభ, శాసనమండలి భవన సముదాయాల నిర్మాణాలకు న్యాయపరమైన అడ్డంకులు లేకుండా ప్రజాహిత వ్యాజ్యాలన్నింటికీ తోసిపుచ్చాలి' అని ప్రభుత్వం కౌంటర్‌లో పేర్కొంది. ఈ పిల్స్‌పై బుధవారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం తిరిగి విచారణ జరపనుంది.

### కోర్టు కేసులు కొలిక్కి వచ్చాకే..

**సచివాలయ శాఖల తరలింపుపై ప్రభుత్వ యోచన**

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర సచివాలయ భవనాల కూల్చివేతకు వ్యతిరేకంగా హైకోర్టులో దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాలు కొలిక్కి వచ్చిన తర్వాతే సచివాలయ కార్యాలయాల తరలింపు ప్రక్రియను ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఎర్రమంజిల్ ప్యాలెస్‌ను కూల్చివేయరాదని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో, సచివాలయ కార్యాలయాల తరలింపు విషయంలో ప్రభుత్వం ఆచితూచి వ్యవహరిస్తోంది. కేసులు విచారణలో ఉన్న తరుణంలో సచివాలయ కార్యాలయాలను తరలిస్తే న్యాయస్థానానికి తప్పుడు సంకేతాలిచ్చినట్లు అవుతుందని ప్రభుత్వవర్గాలు భావిస్తున్నాయి. సచివాలయంలోని భవనాలన్నిటినీ కూల్చివేసి అక్కడే కొత్త సచివాలయ భవన సముదాయాన్ని నిర్మించేందుకు ప్రభుత్వం మొగ్గు చూపుతోంది. ఎర్రమంజిల్ ప్యాలెస్‌ను కూల్చివేసి కొత్త అసెంబ్లీ భవనాన్ని నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సచివాలయ భవనాలు, ఎర్రమంజిల్ ప్యాలెస్ కూల్చివేతకు వ్యతిరేకంగా దాఖలైన వ్యాజ్యాలను హై కోర్టు బుధవారం మరోసారి విచారించనుంది. కోర్టు నుంచి సానుకూల నిర్ణయం వచ్చిన తర్వాతే సచివాలయం కార్యాలయాల తరలింపును ప్రారంభిస్తామని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. అందుకే శాఖల తరలింపునకు సంబంధించి ఏ క్షణంలోనైనా తరలింపునకు సిద్ధమై ఉండాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే సచివాలయ శాఖల కార్యాలయాల తరలింపు బాధ్యతలను ప్రభుత్వం రవాణా శాఖకు అప్పగించింది. కార్యాలయాల్లోని ఫైళ్లు, సామగ్రిని కొత్త భవనాలకు తరలించే బాధ్యతను ఆ శాఖ పర్యవేక్షించనుంది.

# కిసాన్ సగం.. కేంద్రం సగం

- 'ప్రధానమంత్రి కిసాన్ మాన్‌ధన్ యోజన' మార్గదర్శకాలు విడుదల
- ఎల్‌ఐసీ సహకారంతో రైతులకు పింఛన్
- 18 నుంచి 40 ఏళ్లలోపున్న సన్న, చిన్నకారు రైతులే అర్హులు
- రాష్ట్రాలకు రైతు వాటాను చెల్లించుకునే వెసులుబాటు



**సాక్షి, హైదరాబాద్:** కేంద్ర బడ్జెట్–2019లో రైతుల పింఛన్ కోసం ప్రవేశపెట్టిన 'ప్రధాన మంత్రి కిసాన్ మాన్‌ధన్ యోజన'పథకం అమలుకు సంబంధించిన మార్గదర్శకాలను కేంద్ర ప్రభుత్వం మంగళవారం విడుదల చేసింది. ఎల్‌ఐసీ సహకారంతో రైతులకు ఈ పింఛన్ పథకాన్ని కేంద్రం ప్రారంభించింది. ఈ పథకానికి సంబంధించిన మార్గదర్శక వివరాలతో కూడిన లేఖను రాష్ట్రానికి పంపించింది. ఈ పథకానికి సొంతంగా ఐదెకరాలలోపున్న సన్న, చిన్నకారు రైతులు అర్హులని తేల్చి చెప్పింది. అలాగే ఈ పథకంలో 18 ఏళ్ల నుంచి 40 ఏళ్ల లోపున్న రైతులు మాత్రమే చేరేందుకు అర్హులుగా నిర్ధారించింది. ఈ పథకం కింద రైతులు 60 ఏళ్లు దాటిన తర్వాత నెలకు రూ.3 వేల చొప్పున పింఛన్ పొందుతారని స్పష్టం చేసింది. రైతు చెల్లించిన మొత్తానికి.. అంతే మొత్తంలో కేంద్ర ప్రభుత్వం ఎల్‌ఐసీకి చెల్లిస్తుంది. ఈ పథకం కింద 18 ఏళ్ల రైతు రూ.55 చెల్లిస్తే, కేంద్రం ఎల్‌ఐసీకి రూ.110 చెల్లిస్తుంది. లబ్ధిదారులు వారి అర్హత డిక్లరేషన్‌ను కూడా సమర్పించాల్సి ఉంటుంది. ఒకవేళ లబ్ధిదారుడు గ్రామంలో లేకపోతే వారి కుటుంబ సభ్యుల నుంచి డిక్లరేషన్ తీసుకుంటారు. ఒకవేళ స్వీయ డిక్లరేషన్ తప్పు అని తేలితే లబ్ధిదారుడు ఎలాంటి ఆర్థిక సాయం పొందకుండా అనర్హుడు అవుతాడు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఫిర్యాదుల పరిష్కారానికి ఒక యంత్రాగాన్ని ఏర్పాటు చేస్తారు. రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ, ఎల్‌ఐసీ, నోడల్ ఏజెన్సీ వ్యవసాయ శాఖ, జిల్లా స్థాయిలో డీఎల్‌బీసీ, ఎల్‌ఐసీ ప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులు ఇందులో ఉంటారు. ఈ పథకం కేంద్రం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నందున నిరంతర పర్యవేక్షణ ఉంటుందని రాష్ట్రానికి రాసిన లేఖలో పేర్కొంది.

**మార్గదర్శకాలు ఇవి..**

**ఈ రైతులు అర్హులు..**

- పింఛన్ ఫండ్ మేనేజర్‌గా వ్యవహరించడంతోపాటు పెన్షన్ అందించే బాధ్యత కూడా ఎల్‌ఐసీదే.
- రైతులు ఇష్టపూర్వకంగానే ఈ స్కీమ్‌లో చేరే వెసులుబాటు కల్పించారు. అలాగే కాంట్రిబ్యూషన్ ఆధారిత పింఛన్ పథకం ఇది.
- ఈ పథకం కింద అర్హులై, నమోదైన రైతుకు నెలకు రూ.3 వేల చొప్పున 60 ఏళ్లు వచ్చిన నాటి నుంచి అందిస్తారు.
- చిన్న, సన్న కారు రైతులు 18 ఏళ్ల నుంచి 40 ఏళ్ల లోపు వయసు ఉండి రెండు నుంచి ఐదెకరాల్లోపు భూమి ఉన్న రైతులు ఈ పథకానికి అర్హులు.
- రాష్ట్రాల వద్ద ఉన్న భూ రికార్డుల ఆధారంగా నమోదు ప్రక్రియ ఉంటుంది. కొన్ని ప్రమాణాల ఆధారంగా మినహాయింపు ఇచ్చే అవకాశం.
- ప్రస్తుతమున్న భూ యాజమాన్య వ్యవస్థ రికార్డుల ప్రకారమే లబ్ధిదారులను గుర్తిస్తారు.
- కొన్ని షరతులతో ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద అనుసరించిన మినహాయింపులనే ఈ పథకంలో చేర్చారు.
- రాష్ట్ర వ్యవసాయ శాఖలే ఈ పథకంలో లబ్ధిదారుల నమోదుకు భాగస్వామ్యం పంచుకుంటాయి.
- కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా 50 శాతం కంట్రిబ్యూట్ చేస్తుంది. ఉదాహరణకు 18 ఏళ్ల రైతు రూ.55 చెల్లిస్తే, అంతే మొత్తంలో కేంద్రం చెల్లిస్తుంది. దీని ప్రకారం ఎల్‌ఐసీకి రూ.110 చెల్లిస్తారు.
- మరో కేంద్ర పథకం పీఎం కిసాన్ నుంచి వచ్చే డబ్బు నుంచి నేరుగా పింఛన్ పథకానికి స్వచ్ఛందంగా చెల్లించుకోవడానికి అవకాశం కల్పిస్తారు.
- అర్హులైన రైతులకు భారం లేకుండా ఉండేందుకు వారి వాటాను రాష్ట్ర ప్రభుత్వాలు భరించే ఆప్షన్‌ను ఇచ్చారు.
- ఒకవేళ పెన్షన్ తీసుకునే సమయంలోనే రైతు చనిపోతే ఆయన భార్యకు కుటుంబ పెన్షన్ కింద 50 శాతం మొత్తాన్ని అందజేస్తారు. కేవలం జీవిత భాగస్వామికి మాత్రమే దీనిని వర్తింపజేస్తారు. ఒకవేళ జీవిత భాగస్వామి అప్పటికే ఈ పథకం కింద లబ్ధిదారులు కాకపోతేనే ఇది వర్తిస్తుంది.
- ఒకవేళ లబ్ధిదారుడు సమయానికి తన వాటా చెల్లించినప్పటికీ, దురదృష్టవశాత్తు 60 ఏళ్లలోపు చనిపోతే, రైతు భార్య లేదా భర్త ఈ పథకంలో భాగస్వామ్యం పొందే అవకాశం ఉంది. వారు వాటాను చెల్లించవచ్చు. లేదా పథకం నుంచి బయటకు వచ్చి విత్‌డ్రా చేసుకునే వెసులుబాటు కల్పించారు. విత్ డ్రా చేసుకుంటే ఆ సమయంలో ఉన్న బ్యాంకు వడ్డీ ప్రకారం మొత్తాన్ని ఇస్తారు.
- లబ్ధిదారులు స్వచ్ఛందంగా ఈ పథకం నుంచి తప్పుకునే వెసులుబాటు కూడా కల్పించారు. అయితే కచ్చితంగా ఐదేళ్లు రెగ్యులర్‌గా తన వాటాను చెల్లించాల్సి ఉంటుంది. తప్పుకునే సమయంలో తన వాటా మొత్తం ఎల్‌ఐసీ వడ్డీతో కలిపి చెల్లిస్తుంది.
- లబ్ధిదారుడు ఒకవేళ తన వాటా చెల్లింపులో ఎక్కడైనా డిఫాల్టర్ అయితే, ఒకేసారి అన్ని బకాయిలు కలిపి చెల్లించుకునే అవకాశం కల్పించారు. అయితే ఆ సమయానికి ఉన్న వడ్డీ కూడా కలుపుకుని చెల్లించాలి. )

### ఈ రైతులు అనర్హులు..

- చిన్న, సన్న కారు రైతులు చట్టబద్ధమైన సామాజిక భద్రత పథకాల్లో ఉన్న వారు. ఉదాహరణకు జాతీయ పింఛన్ పథకం (ఎన్‌పీఎస్), రాష్ట్ర ఉద్యోగ బీమా సంస్థ పథకం, ఎంప్లాయీస్ ఫండ్ ఆర్గనైజేషన్ స్కీమ్‌లో ఉన్నవారు...
- ప్రధాన మంత్రి శ్రమ్ యోగి మాంధాన్ యోజనలో ఉన్న రైతులు కూడా అనర్హులు
- సంస్థాగత భూములు కలిగిన వారు..
- రైతు కుటుంబంలో ఎవరైనా గతంలో లేదా ప్రస్తుతం ఏదైనా రాజ్యాంగ పదవుల్లో ఉన్నట్లయితే..
- మాజీ, ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర మంత్రులు, మాజీ, ప్రస్తుత ఎంపీలు, శాసనసభ, కౌన్సిల్‌లో సభ్యులు, మాజీ, ప్రస్తుత మేయర్లు, జిల్లా పంచాయతీ చైర్మన్‌లు అనర్హులు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన వారు (మల్టీ టాస్కింగ్, క్లాస్ 4, గ్రూప్ డీ ఉద్యోగులకు మినహాయింపు)
- రూ.10 వేలు పైన తీసుకునే రిటైర్డ్ పింఛన్‌దారులు
- ఆదాయపు పన్ను కట్టే వారంతా (గతేడాది ఆధారంగా)
- వృత్తి ఉద్యోగులు డాక్టర్లు, ఇంజనీర్లు, లాయర్లు, సీఏలు, రిజిస్టర్డ్ ఆర్కిటెక్ట్‌లు

## శంషాబాద్‌లో 150 కేజీల బంగారం స్వాధీనం

- 2 నెలల కిందటే పట్టుకున్న డీఆర్ఐ అధికారులు
- సరైన పత్రాలు లేకుండా జకర్తా నుంచి దిగుమతి
- ఆలస్యంగా వివరాలు వెల్లడించిన అధికారులు

**శంషాబాద్:** సరైన పత్రాలు లేకుండా భారీ ఎత్తున దిగుమతి చేసుకున్న 150 కేజీల బంగారాన్ని డీఆర్ఐ అధికారులు 2 నెలల కిందటే స్వాధీనం చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఆర్కే డిజిటల్ అనే సంస్థ పేరు మీద 2 కన్‌సైన్‌మెంట్‌ల ద్వారా బంగారాన్ని జకర్తా నుంచి మలేసియా ఎయిర్‌లైన్స్ ఎంఐ 472 విమానంలో సింగపూర్ మీదుగా వచ్చిన బంగారం మే 13న శంషాబాద్ విమానాశ్రయంలోని కార్గోలో దిగింది. దీనిపై సమాచారం అందుకున్న హైదరాబాద్ డీఆర్ఐ అధికారులు మే 15న శంషాబాద్ విమానాశ్రయంలో బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే సదరు సంస్థ పెద్ద మొత్తంలో ఈ బంగారాన్ని మధ్యవర్తి సంస్థ ద్వారా దిగుమతి చేసుకున్నట్లు అధికారులు గుర్తించారు. అనుమతులు లేకుండా సాగుతున్న దిగుమతులపై డీఆర్ఐ అధికారులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. అయితే దీనిపై అధికారికంగా ఎలాంటి వివరాలు వెల్లడించట్లేదు. దిగుమతి చేసుకున్న బంగారం మొత్తం కూడా రేణువుల రూపంలో ఉన్నట్లు సమాచారం.

## యునానీ మెడికల్ కాలేజీ గుర్తింపు రద్దు

### ఉత్తర్వులు జారీ చేసిన కాళోజీ యూనివర్సిటీ

**సాక్షి, హైదరాబాద్:** భారత ప్రభుత్వ ఆయుష్ శాఖ, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అల్ ఆరిఫ్ యునాని మెడికల్ కళాశాల గుర్తింపును రద్దు చేసినట్లు కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అల్ ఆరిఫ్ యునాని మెడికల్ కళాశాలకు జారీ చేసిన నిరభ్యంతర పత్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసిందని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆ కాలేజీలో చదువుతున్న విద్యార్థులను ప్రభుత్వ టిబ్బి కళాశాలలో సర్దుబాటు చేస్తామన్నారు. అందుకు ఈ నెల 13న ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌లో ఉదయం 10 గంటల నుంచి కౌన్సిలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. 2014–15, 2015–16, 2016–17, 2017–18 విద్యా సంవత్సరాల్లో చేరిన విద్యార్థులు కౌన్సిలింగ్‌కు హాజరు కావాలన్నారు. పూర్తి సమాచారం కోసం యూనివర్సిటీ వెబ్‌సైట్ www.knruhs.in ను చూడాలని తెలిపారు.

## ఆల్మట్టికి లక్ష క్యూసెక్కుల వరద

### తుంగభద్ర, ఉజ్జయినికి పెరిగిన వరద ప్రవాహాలు

**సాక్షి, హైదరాబాద్:** ఎగువ మహారాష్ట్రలో కురుస్తున్న కుంభవృష్టి వర్షాలతో దిగువన కర్ణాటకలోని ఆల్మట్టి ప్రాజెక్టు వరద ఉధృతి పెరిగింది. సోమవారం ప్రాజెక్టులోకి 60వేల క్యూసెక్కుల మేర వరద రాగా, మంగళవారం రాత్రికి అది ఏకంగా లక్ష క్యూసెక్కులకు పెరిగింది. ప్రస్తుతం ఆల్మట్టిలో 129 టీఎంసీల నీటి నిల్వలకుగాను 50 టీఎంసీల నిల్వలు చేరాయి. ఈ ఐదు రోజుల వ్యవధిలోనే ప్రాజెక్టులోకి ఏకంగా 32 టీఎంసీల మేర కొత్త నీరు వచ్చి చేరింది. వర్షాలు ఇలానే కురిస్తే వరద ఉధృతి మరింత పెరిగే అవకాశముందని నీటి పారుదల వర్గాలు చెబుతున్నాయి. తుంగభద్ర ప్రాజెక్టుకు వరద మొదలైంది. ప్రాజెక్టులో మంగళవారం 14,911 క్యూసెక్కుల మేర వరద కొనసాగుతుండటంతో ప్రాజెక్టులో ప్రస్తుతం 100 టీఎంసీల నిల్వలకు 4 టీఎంసీల నిల్వలున్నాయి. మహారాష్ట్రలోని ఉజ్జయినికి సైతం స్థిరంగా వరద కొనసాగుతోంది. ప్రాజెక్టుల్లోకి 19,408 క్యూసెక్కుల నీరు వస్తోంది. ప్రాజెక్టులో 117 టీఎంసీల నిల్వకు 36 టీఎంసీల నిల్వలున్నాయి. రాష్ట్ర పరిధిలోని ప్రాజెక్టుల్లో ఎక్కడా చెప్పుకోదగ్గ ప్రవాహాలు కనిపించట్లేదు.

## రూ.1000 కోట్లు ఇవ్వండి!

### ప్రభుత్వానికి ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్ రావు లేఖ

**సాక్షి, హైదరాబాద్:** విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లు విద్యుత్ కొనుగోళ్లకు ముందు తప్పనిసరిగా లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌సీ) సమర్పించాలని కేంద్రం తాజా నిబంధనతో తెలంగాణ డిస్కంలు చిక్కుల్లోపడ్డాయి. ఈ నిబంధన వల్ల ఎంత విద్యుత్ అవసరమో అంతమేర డబ్బులు చెల్లించేందుకు గ్యారెంటీ ఇస్తూ డిస్కంలు ముందస్తుగా ఎల్‌సీ జారీ చేయాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. రాష్ట్ర అవసరాలకు ప్రైవేటు విద్యుదుత్పత్తి కంపెనీల నుంచి విద్యుత్‌ను కొనుగోలు చేసేందుకు తమ వద్ద డబ్బుల్లేవని, తక్షణమే రూ.వెయ్యి కోట్లు విడుదల చేయాలని కోరుతూ తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు మంగళవారం ప్రభుత్వానికి లేఖ రాశారు.

## నిర్ణీతకాల పదోన్నతులు కల్పించండి

### మంత్రి ఈటలను కోరిన ప్రభుత్వ వైద్యుల సంఘం

**సాక్షి, హైదరాబాద్:** ప్రభుత్వ వైద్యులకు నిర్ణీతకాల పదోన్నతులు కల్పించాలని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం నూతన అధ్యక్షుడు లాలూప్రసాద్ రాథోడ్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్‌ను సచివాలయంలో కలిశారు. అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించాక లాలూ ప్రసాద్ ఈటలను కలిసి వైద్యుల సమస్యలను విన్నవించారు. అలాగే గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న డాక్టర్లకు స్పెషల్ అలయెన్స్‌లు ఇవ్వాలని విన్నవించారు. డాక్టర్‌గా నాలుగేళ్లు పూర్తయిన వారికి డిజిగ్నేటెడ్ డిప్యూటీ సివిల్ సర్జన్, ఏడేళ్లు పూర్తయిన డాక్టర్‌కు డిజిగ్నేటెడ్ సివిల్ సర్జన్ పదోన్నతి కల్పించాలని కోరారు. నాన్ టీచింగ్ డాక్టర్లకు నిర్ణీత కాల పదోన్నతులు కల్పిస్తామని ఈటల సంతకం చేశారని లాలూప్రసాద్ తెలిపారు. వైద్య విధాన పరిషత్ డాక్టర్లకు కొన్ని జీవోల వల్ల ఆలస్యమవుతున్న పదోన్నతులు కల్పించాలని కోరారు.

## 'తమకు సమాచారమిచ్చేలా ఆదేశాలివ్వండి'

**సాక్షి, హైదరాబాద్:** బీసీ కమిషన్‌కు తన అధ్యయనంలో భాగంగా వివిధ ప్రభుత్వ విభాగాలను కోరిన సమాచారాన్ని త్వరితగతిన అందించేలా ఆయా శాఖాధిపతులకు ఆదేశాలు జారీ చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషిని బీసీ కమిషన్ కోరింది. ఈ మేరకు మంగళవారం సచివాలయంలో బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు, సభ్యులు వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, ఆంజనేయగౌడ్, జూలూరి శంకర్‌లు మర్యాద పూర్వకంగా సీఎస్‌తో భేటీ అయ్యారు. పలు విధానపరమైన అంశాలపై చర్చించారు. బీసీ కమిషన్ తెలుగులోకి అనువదించిన పలు ప్రామాణికమైన నివేదికలను సీఎస్‌కు అందజేశారు.

## బీఎస్ఎన్ఎల్ వరల్డ్ కప్ ఆఫర్

**సాక్షి, హైదరాబాద్:** బీఎస్ఎన్ఎల్ వరల్డ్ కప్ ఆఫర్‌గా ప్రీపెయిడ్ ప్లాన్–899పై రూ.113లు డిస్కౌంట్ ప్రకటించింది. దీంతో కేవలం రూ.786కే ప్రీపెయిడ్ ప్లాన్–899 వస్తోంది. ఈ ఆఫర్ బుధవారం (నేటి) నుంచి ఈనెల 16వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందని తెలంగాణ టెలికాం సర్కిల్ సీజీఎం వి.సుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 1503 లేదా 18001801503 నంబర్లలో సంప్రదించవచ్చని సూచించారు.

తెలంగాణ ప్రభుత్వం
ఉన్నత విద్యా (UE) శాఖ
నోటిఫికేషన్
దిగువ తెలిపిన రాష్ట్ర యూనివర్సిటీల కొరకు వైస్–చాన్స్‌లర్ ఉద్యోగం కొరకు తెలంగాణ ప్రభుత్వం దరఖాస్తులు కోరుతోంది : యూనివర్సిటీ పేరు : 1) ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్, 2) పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ, హైదరాబాద్, 3) డా. B.R. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, హైదరాబాద్, 4) జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ (JNTU), హైదరాబాద్, 5) కాకతీయ యూనివర్సిటీ, వరంగల్, 6) మహాత్మాగాంధీ యూనివర్సిటీ, నల్గొండ, 7) శాతవాహన యూనివర్సిటీ, కరీంనగర్, 8) తెలంగాణ యూనివర్సిటీ, నిజామాబాద్, 9) పాలమూరు యూనివర్సిటీ, మహబూబ్‌నగర్. అర్హతా ప్రమాణాలు మొ॥ వివరాల కొరకు www.tsche.ac.in ను దర్శించండి. డాక్యుమెంట్ రుజువుతో సహా నిర్దిష్ట నమూనాలో బయో-డేటా వివరాలతో దరఖాస్తును దిగువ చిరునామాకు రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా **23.07.2019న సా.5.00గం.** లేదా ఆలోగా పంపవలెను. చిరునామా : ది సెక్రటరీ టు గవర్నమెంట్, హయ్యర్ ఎడ్యుకేషన్ (UE) డిపార్ట్‌మెంట్, రూమ్ నం.117-A, D- బ్లాక్, గ్రౌండ్ ఫ్లోర్, తెలంగాణ సెక్రటేరియట్, హైదరాబాద్ - 500022, ఫోన్ నం. +91-40-23459287, టెలి / ఫ్యాక్స్ నం. +91-40-23459297.
**తేది: 08.07.2019**
ప్రదేశం : హైదరాబాద్
సం/– డా.బి. జనార్ధన్ రెడ్డి, IAS,
సెక్రటరీ టు గవర్నమెంట్
DIPR RO. No.576-DP/CL/ADVT/1/2019-20, Dt: 9.7.2019

INDIAN INSTITUTE OF SCIENCE EDUCATION AND RESEARCH, TIRUPATI
(An Autonomous Institution of Ministry of HRD., Govt. of India)
"EXPRESSION OF INTEREST" (EoI) for Providing Dining Services – Students Mess, Catering & Allied Services at IISER TIRUPATI"
IISER Tirupati invites proposals for "Expression of Interest" (EoI) from reputed Agencies/firms, on the terms and conditions as per the EoI document.
For further information and complete eligibility criteria, terms and conditions, please visit our website www.iisertiruapti.ac.in/tenders/
Last date for receipt of proposals for "Expression of Interest" is 19.07.2019 at 15:00 hours
Sd/-
IISERT/Admin-Dining/07/2019 Registrar

# సుపారీ ఇచ్చింది సత్యమే..

**సాక్షి, హైదరాబాద్:** స్టీల్ వ్యాపారి తెలప్రోలు రాంప్రసాద్‌ను హత్య చేయించింది తానేనని పోలీసుల అదుపులో ఉన్న కోగంటి సత్యం అంగీకరించాడు. ఈ హత్యకు విజయవాడలోని కామాక్షి స్టీల్స్‌కు సంబంధించిన వివాదమే కారణమని తేలింది. ఈ వ్యవహారంలో టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు జోక్యం చేసుకోవడంతో మరింత ముదిరింది. సెటిల్‌మెంట్ చేసుకున్న డబ్బు ఇవ్వకపోవడం, టీడీపీ నేతల మద్దతుతో కేసులు పెట్టి వేధిస్తుండటంతో కోగంటి సత్యం విసిగిపోయారని తెలిసింది. దీంతో తన ప్రధాన అనుచరుడు శ్యామ్‌తోనే హత్యకు పథక రచన చేసినట్లు, ఖర్చులకు రూ.10 లక్షలు ఇచ్చినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ కేసులో ఇప్పటి వరకు సత్యం సహా ఐదుగురిని అదుపులోకి తీసుకు న్న వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. విజయవాడకు చెందిన కోగంటి సత్యం కామాక్షి స్టీల్ ట్రేడర్స్ పేరుతో వ్యాపారం నిర్వహించేవాడు. కొన్నేళ్ల క్రితం టీడీపీ నేత బోండా ఉమను వర్కింగ్ పార్ట్‌నర్‌గా చేర్చుకున్నాడు. పెట్టుబడి లేకపోయినా సంస్థలోనే ఉండి, దాని వ్యవహారాలు పర్యవేక్షించేందుకు 20 శాతం వాటాను బోండా ఉమకు ఇచ్చారు.



### పోలీసుల విచారణలో నేర అంగీకారం

- కామాక్షి స్టీల్స్ గొడవలే హత్యకు కారణం
- బోండా ఉమ జోక్యంతోనే ముదిరిన వివాదం
- రాంప్రసాద్ హత్య కోసం రూ.10 లక్షలిచ్చిన సత్యం
- సురేశ్‌తో కలసి పథకం అమలు చేసిన శ్యామ్

కోగంటి సత్యం

**20 శాతం వాటా విక్రయం..**

2014 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా బరిలోకి దిగాలని భావించిన ఉమ తన 20 శాతం వాటాను 2013లో రాంప్రసాద్‌తో పాటు ఆయన మేన బావమరిది ఊర శ్రీనివాస్‌కు విక్రయించారు. వర్కింగ్ పార్ట్‌నర్స్‌గా ఉన్న ఇద్దరిలో ఊర శ్రీనివాస్ విశాఖపట్నంలోని తన వ్యాపారాన్ని పర్యవేక్షిస్తుండగా, రాంప్రసాద్ మాత్రమే కామాక్షి స్టీల్స్ వ్యవహారాలు చూసేవారు. ఈ నేపథ్యంలోనే విజయవాడలోని వైశ్యా బ్యాంక్ నుంచి కామాక్షి స్టీల్స్ పేరు మీద భారీ మొత్తం రుణం తీసుకోవడం, దాని కిస్తీలు సక్రమంగా చెల్లించకపోవడం తదితర పరిణామాలు చోటు చేసుకున్నాయి. దీంతో 2014లో సెటిల్‌మెంట్ చేసుకున్న కోగంటి సత్యం, రాంప్రసాద్‌లు వ్యాపారం నుంచి వేరుపడ్డారు. ఆ సమయంలో తన వల్ల జరిగిన నష్టానికి, ఇతర అప్పులకు సంబంధించి రూ.25 కోట్లు చెల్లిస్తానంటూ రాంప్రసాద్ డీడ్ రాసి ఇచ్చారు.

**పథక రచన...**

రాంప్రసాద్‌ను హత్య చేయడానికి ఛోటు, రమేశ్‌తో కలసి శ్యామ్ రంగంలోకి దిగాడు. హత్యానంతరం పోలీసుస్టేషన్‌కు వెళ్లి లొంగిపోవాలని, ఎక్కడా సత్యం పేరు బయటకు రావొద్దని, పోలీసుల్ని తప్పుదోవ పట్టించేందుకు ఊర శ్రీనివాస్ పేరు చెప్పాలని పథకం వేశారు. ఈ నెల 2న విజయవాడ నుంచి కుటుంబంతో సహా తిరుపతి వెళ్లిన సత్యం అక్కడ నుంచి నేరుగా హైదరాబాద్ చేరుకున్నాడు. 5న విజయవాడ నుంచి ఓ వాహనంలో బయల్దేరిని శ్యామ్, సురేశ్, ఛోటు, రమేశ్ డ్రైవర్‌తో కలసి ఆనంద్ వద్దకు చేరుకుని బస చేశారు. 6వ తేదీ రాత్రి అదే వాహనంలో పంజగుట్టలోని వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్దకు వెళ్లారు. సురేష్ కాస్త దూరంలో ఆగిపోగా.. మిగిలిన ముగ్గురూ వెళ్లి రాంప్రసాద్‌పై విచక్షణారహితంగా దాడి చేశారు. ఆ సమయంలో సత్యం సోమాజిగూడలోని ఓ ప్రముఖ ఆసుపత్రి సమీపంలో ఎదురుచూస్తూ ఉన్నాడు. రాంప్రసాద్ తీవ్రంగా గాయపడ్డాడని తెలుసుకున్న సత్యం.. చికిత్స నిమిత్తం నిమ్స్ ఆస్పత్రికి తీసుకువస్తారనే ఉద్దేశంతో అక్కడకు చేరుకుని కొద్దిసేపు కాపుకాశాడు. తమ 'పని'పూర్తయిన తర్వాత పోలీసులకు లొంగిపోవాలని భావించిన శ్యామ్, ఛోటు, రమేష్ కంగారుపడి ఎవరికి వారుగా పారిపోయాయి.

**విచారణలో అసలు కథ బయటికి..**

పథకం ప్రకారం ముందు సత్యం, ఆ తర్వాత శ్యామ్, ఛోటు, రమేష్ మీడియా ముందుకు వచ్చి ఊర శ్రీనివాస్ పేరు చెప్పారు. అయితే వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసుల విచారణలో కథ మొత్తం బయటపడింది. పరారీలో ఉన్న ఆనంద్, సురేశ్‌ల కోసం పోలీసులు గాలిస్తున్నారు. నిందితుల నుంచి వాహనం, ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. విచారణలో సత్యం సైతం నేరం అంగీకరించాడు. ఇతర ఆధారాల కోసం ప్రయత్నిస్తున్న పోలీసులు ఒకట్రెండు రోజుల్లో నిందితుల అరెస్టు ప్రకటించే అవకాశం ఉంది. ఈ కేసును రాష్ట్ర డీజీపీ ఎం.మహేందర్‌రెడ్డితో పాటు నగర పోలీసు కమిషనర్ అంజనీకుమార్ సైతం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

### 2 నెలల క్రితమే...

దాదాపు 2 నెలల కిందే రాంప్రసాద్‌ను హత్య చేయించాలని నిర్ణయించుకున్న సత్యం ఈ పనిని తన అనుచరుడు, శ్యామ్‌కు అప్పగించాడు. రంగంలోకి దిగిన శ్యామ్ ఈ హత్య కోసం తన స్నేహితుడైన సురేశ్‌తో పాటు ఆనంద్, ఛోటు, రమేశ్‌ను తనతో కలుపుకున్నాడు. రాంప్రసాద్ ఆచూకీ కనిపెట్టాల్సిన బాధ్యతను ఆనంద్‌కు అప్పగించాడు. రాంప్రసాద్‌ను హత్య చేస్తామనే విషయం అతడికి చెప్పలేదు. త్వరలో ఓ కేసు పెట్టబోతున్నామని, పోలీసులకు పట్టించడానికే ఈ ఏర్పాటని చెప్పారు. తనకు భారీ మొత్తంలో స్టీలు కావాలంటూ రాంప్రసాద్‌కు ఆనంద్ ఫోన్ చేశాడు. దీంతో ఆయన పంజగుట్ట కార్యాలయానికి రావాలని చెప్పాడు. కొద్ది రోజుల పాటు రాంప్రసాద్ ఏం చేస్తున్నాడనే విషయాలపై రెక్కీ నిర్వహించి వివరాలను శ్యామ్‌కు చేరవేసేవాడు.

### రాంప్రసాద్‌కు బోండా మద్దతు...

బోండా ఉమ ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో సత్యం, రాంప్రసాద్ మధ్య స్పర్ధలు మరింత ముదిరాయి. సెటిల్‌మెంట్ డీడ్‌ను బేఖాతరు చేసిన రాంప్రసాద్‌కు బోండా మద్దతు పెరిగింది. తనకు ఇవ్వాల్సిన డబ్బు చెల్లించాలని సత్యం కోరినప్పుడల్లా మధ్యలోకి ఉమ వచ్చేవారు. తమ మధ్య జరిగిన వివాదాలకు, వ్యవహారాలకు సంబంధించి సత్యం విజయవాడలోని ఏ ఠాణాకు వెళ్లినా కేసు నమోదు అయ్యేది కాదు. రాంప్రసాద్ ఫిర్యాదు చేస్తే మాత్రం సత్యంపై వెంటనే చర్యలు ఉండేవి. ఈ చర్యలతో విసిగిపోయిన సత్యం అదును కోసం ఎదురుచూస్తూ ఉండిపోయాడు. 2017లో రాంప్రసాద్ తన కుటుంబంతో కలసి హైదరాబాద్‌కు వచ్చేశారు. నగరంలోని ఖాజాగూడలో ఉంటూ పరిగిలో అభిరాం స్టీల్స్ పేరుతో సంస్థను ఏర్పాటు చేశారు.

# బదిలీలు చేయండి మహాప్రభో!

- అంతర్ జిల్లా ఉపాధ్యాయ దంపతుల వినతి
- భార్యాభర్తలు ఒకే చోట పనిచేసేలా చూడాలని ప్రభుత్వానికి విన్నపం

**సాక్షి, హైదరాబాద్:** 'ప్రత్యేక తెలంగాణ రావాలని ఉద్యమాలు చేశాం. బంగారు తెలంగాణలో భార్యాభర్తలు ఒకే దగ్గర పనిచేసే అవకాశం వస్తుందని ఆశపడ్డాం. సీఎం కేసీఆర్ హామీ ఇవ్వగానే సంబరాలు చేసుకున్నాం. దేవుడు వరమిచ్చినా పూజారి వరం ఇవ్వనట్లుగా సీఎం కేసీఆర్ ఆదేశాలు జారీ చేసినా విద్యాశాఖ అధికారులు పట్టించుకోలేదు'అని అంతర్ జిల్లా ఉపాధ్యాయ దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయం మీడియా పాయింట్‌లో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఇప్పటివరకు అంతర్ జిల్లా భార్యాభర్తలు బదిలీల జీవో అమలు చేయకపోవడం శోచనీయమని అన్నారు. కేసీఆర్ ఇప్పటివరకు ఐదు సార్లు ప్రకటించినా అధికారులు పట్టించుకోలేదని తెలిపారు. దీంతో రెండు వేల కుటుంబాలు దయనీయ స్థితిలో ఉన్నాయని, భార్య ఒక జిల్లాలో భర్త మరొక జిల్లాలో విధులు నిర్వర్తించడం వల్ల పిల్లలు కుటుంబ పోషణకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో సీఎం ఆదేశాల మేరకు అప్పటి ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్‌ను చైర్మన్‌గా మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఉప సంఘం తీసుకున్న నిర్ణయాల్లో మొదటగా దీనికి సంబంధించిన ఉత్తర్వులు విడుదల చేయాలని నిర్ణయించారని చెప్పారు. నేటికి కూడా విద్యా శాఖలో అధికారుల బదిలీల జీవో నంబర్ 182కు అనుగుణంగా అంతర జిల్లా బదిలీల స్పౌజ్ మార్గదర్శకాలు విడుదల కాలేదన్నారు. వెంటనే జీవో 182ను ఉపాధ్యాయులకు వర్తింప చేయాలని, ఈ ఉత్తర్వులకు అనుగుణంగా విద్యాశాఖ తక్షణమే మార్గదర్శకాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బదిలీల షెడ్యూల్‌ను ఆన్‌లైన్‌లో పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ శ్రీకాంత్, కో కన్వీనర్ జైపాల్‌రెడ్డి, జ్యోతి, సుదర్శన్, ప్రశాంతి, చంద్రమౌళి, శంకర్ పాల్గొన్నారు.

**వందల మైళ్ల దూరంలో..**

గద్వాల జిల్లా నసానూర్ ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా రాజోలు మండలంలో పనిచేస్తున్నానని మహేశ్ అన్నారు. భార్య చెన్నూర్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తుందన్నారు. సిద్దిపేట జిల్లాలో పావని ఎస్జీటీగా పనిచేస్తే, భర్త మహబూబ్‌నగర్‌లో పనిచేస్తున్నారు. వీరంతా రోజూ చాలా దూరం ప్రయాణం చేయాల్సి వస్తోంది.

**పిల్లల పోషణకు దూరమయ్యా..: నగేశ్**

నల్లగొండ జిల్లాలో ఎస్జీటీ సెకండరీ ఉపాధ్యాయ మాల్ గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్నానని అంధ ఉపాధ్యాయుడు నగేశ్ అన్నారు. భార్య కె.మంజుల ఆఫీసు సబార్డినేటర్ రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తుందని తెలిపారు. పెద్ద కుమారుడు వినయ్ హృదయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడని, పిల్లల పోషణకు దూరమయ్యానని ఆవేదన వ్యక్తం చేశారు.

The Andhra Pradesh State Co-operative Bank Ltd.
APCOB
D No: 27-29-28, NTR Sahakara Bhavan, Governorpet, Vijayawada - 520 002
HRD Department, Email-id: hrd@apcob.org; Ph: 0866 - 2429011 / 012

RECRUITMENT NOTIFICATION

Applications are invited for filling up of the following vacancies by direct recruitment, through **IBPS**.

NO. OF POSTS :
a) STAFF ASSISTANT : 54
b) MANAGERS (Scale - I) : 23

| Particulars | Date |
|---|---|
| Opening Date for Registration | 10.07.2019 |
| Closing date for Registration and payment of Application fee | 28.07.2019 |
| Tentative date of online test | 25.08.2019 |

For full text of Notification and further details, please visit our website **www.apcob.org** from **10.07.2019** onwards. **The candidates are advised to take a print out of the complete notification and read carefully before making fee remittance and submitting the application on-line.**

Sd/-
Dated : 10.07.2019 GENERAL MANAGER (HRD)

# 9 వర్సిటీల్లో వీసీల భర్తీకి నోటిఫికేషన్

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో వివిధ విశ్వవిద్యాలయాల వైస్ చాన్స్‌లర్ల పదవీ కాలం ఈనెలలో ముగియనుండటంతో ప్రభుత్వం కొత్త వైస్ చాన్స్‌లర్ల నియామకంపై దృష్టి పెట్టింది. ఈ మేరకు మంగళవారం వైస్ చాన్స్‌లర్ల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసింది. ఆసక్తి కలిగిన వారు ఈనెల 23లోగా ఉన్నత విద్యాశాఖ కార్యదర్శికి దరఖాస్తు చేసుకోవాలని పేర్కొంది. దరఖాస్తు ఫారమ్‌తోపాటు బయోడేటా, అర్హతలకు సంబంధించిన ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. అర్హతలకు సంబంధించిన పూర్తి వివరాలను www.tsche.ac.in వెబ్‌సైట్లో పొందవచ్చని తెలిపింది. మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ అల్తాఫ్ హుస్సేన్ పదవీ కాలం గత నెల 30 తేదీతో ముగియనుండగా, ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొ. ఎస్. రామచంద్రం, జేఎన్‌టీయూ వైస్ చాన్స్‌లర్ ప్రొ.వేణుగోపాల్‌రెడ్డి, కాకతీయ వర్సిటీ వీసీ సాయన్న, పాలమూరు వర్సిటీ వీసీ రాజరత్నం, తెలంగాణ వర్సిటీ వీసీ సాంబయ్య, తెలుగు విశ్వవిద్యాలయం వీసీ సత్యనారాయణ, అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ వీసీ సీతారామరావు పదవీకాలం ఈనెల 25వ తేదీతో ముగియనుంది. ఆయా వర్సిటీలతోపాటు శాతవాహన యూనివర్సిటీకి వైస్ చాన్స్‌లర్‌ను నియమించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఉన్నత విద్యాశాఖ వెల్లడించింది. వీసీల నియామకాల దరఖాస్తులను ఆహ్వానించిన ప్రభుత్వం త్వరలోనే సర్చ్ కమిటీల ఏర్పాటుకూ నడుం బిగించింది. సర్చ్ కమిటీల్లో ఉండే నామినీ పేర్లను సూచించాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్‌కు, యూనివర్సిటీ నామినీ పేర్లను సూచించాలని యూనివర్సిటీలకు లేఖలు రాసింది. ప్రభుత్వ నామినీగా విద్యాశాఖ కార్యదర్శి ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది. దరఖాస్తుల స్వీకరణ పూర్తయ్యేలోగా ఈ వివరాలను తెప్పించుకుని సర్చ్ కమిటీల ఏర్పాటు పూర్తి చేసేందుకు సర్కార్ చర్యలు చేపట్టింది. ప్రతి విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ పోస్టుకు వచ్చిన దరఖాస్తుల్లో సర్చ్ కమిటీలు ముగ్గురి పేర్లను ప్రభుత్వానికి అందజేస్తాయి. ప్రభుత్వం వాటిని యూనివర్సిటీల చాన్స్‌లర్ అయిన గవర్నర్‌కు పంపించాల్సి ఉంటుంది. అందులో ఒకరి పేరును గవర్నర్ ఖరారు చేస్తారు. ఆ తర్వాత వారిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయనుంది. మొత్తానికి ప్రస్తుత వీసీల పదవీ కాలం ముగిసిన 15 రోజుల్లోపే కొత్త వీసీల నియామకాలు పూర్తయ్యేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

## తహసీల్దార్లకు ఊరట

- మున్సిపాలిటీల అదనపు బాధ్యతల నుంచి తొలగించిన ప్రభుత్వం
- వారి స్థానంలో స్థానిక ఎంపీడీవోలకు బాధ్యతలు..

**సాక్షి, హైదరాబాద్:** తహసీల్దార్లకు ప్రభుత్వం ఊరటనిచ్చింది. మున్సిపాలిటీల అదనపు బాధ్యతల నుంచి తప్పించింది. పని ఒత్తిడితో సతమతమవుతున్న తహసీల్దార్లకు తాజా నిర్ణయంతో ఉపశమనం కలగనుంది. ఈ మేరకు తహసీల్దార్ల స్థానే స్థానిక ఎంపీడీఓలకు ఇన్‌చార్జి కమిషనర్ల బాధ్యతలు అప్పగిస్తూ పురపాలక శాఖ డైరెక్టర్ టీకే శ్రీదేవి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు 11 జిల్లాల పరిధిలోని 18 పురపాలక సంఘాల కమిషనర్లుగా ఎంపీడీఓలను నియమించారు. అయితే, తహసీల్దార్ల ఉపసంహరణ వెనుక.. రెవెన్యూ సంఘాల ఆందోళన బాటే కారణమనే ప్రచారం జరుగుతోంది. గతేడాది సెప్టెంబర్‌లో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్థానచలనం కలిగించిన తహసీల్దార్లను తిరిగి పాత జిల్లాలకు బదిలీ చేయాలని డిమాండ్ చేస్తూ రెవెన్యూ సంఘాలు వర్క్ టు రూల్‌ను పాటిస్తున్న సంగతి తెలిసిందే. ప్రభుత్వం స్పందించకపోతే ఈ నెల 15 నుంచి సామూహిక సెలవులు పెట్టనున్నట్లు ప్రకటించాయి. ఈ నేపథ్యంలో ఒకవేళ తహసీల్దార్ల ఆందోళనకు ప్రభుత్వం దిగిరాకపోతే.. దాని ప్రభావం మున్సిపల్ ఎన్నికలపై పడుతుందని పురపాలకశాఖ అంచనా వేసిందని, అందులో భాగంగానే మున్సిపల్ కమిషనర్ల అదనపు బాధ్యతల నుంచి తప్పించిందని ప్రచారం జరుగుతోంది.

**ఎంపీడీవోలకు బాధ్యతలిచ్చిన మున్సిపాలిటీలివే..**

రాయికల్, ధర్మపురి, మక్తల్, భూత్పూర్, కోస్గి, మంచిర్యాల, తూంకుంట, నందికొండ, ఖానాపూర్, చిట్యాల, హాలియా, చండూరు, ఆమనగల్, నేరేడుచర్ల, తిరుమలగిరి, పోచంపల్లి, యాదగిరిగుట్ట, అమరచింత.



సాక్షి

బుధవారం, జూలై, 10

# మళ్లీ 'రాజద్రోహం'

అసమ్మతి స్వరాలను అణిచేయడానికి వినియోగపడుతున్నదని ముద్రపడిన రాజద్రోహ చట్టం 124ఏ గురించిన చర్చ మరోసారి ఎజెండాలోకి వచ్చింది. ఈ చట్టంకింద తమిళనాడుకు చెందిన ఎండీఎంకే నాయకుడు వైకోకు అక్కడి ప్రత్యేక న్యాయస్థానం ఏడాది జైలు, రూ. 10,000 జరిమానా విధించడం ప్రస్తుత చర్చకు సందర్భం. 'ఐ అక్యూజ్' పేరుతో ఆయన రచించిన గ్రంథాన్ని 2009 జూలై 15న ఆవిష్కరించినప్పుడు ఆయన చేసిన ప్రసంగం ఆధారంగా ఈ కేసు పెట్టారు. సరిగ్గా పదేళ్లక్రితం శ్రీలంకలో తమిళ టైగర్ల కార్యకలాపాలను సమర్థిస్తూ చేసిన ఆ ప్రసంగం హింసను రెచ్చగొట్టేదిగా ఉందని ప్రాసిక్యూషన్ అప్పట్లో ఆరోపించింది. లంకలో రాజపక్స ప్రభుత్వం సాగిస్తున్న యుద్ధంలో టైగర్లకేమైనా జరిగితే మన దేశం ఇప్పటిలా ఐక్యంగా ఉండే అవకాశం లేదని ఆయన హెచ్చరించారు. అప్పుడు కేంద్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం ఉంది. తమిళనాడులో డీఎంకే ప్రభుత్వం ఉంది. మొన్న జరిగిన లోక్‌సభ ఎన్నికల సందర్భంగా విడుదల చేసిన మేని ఫెస్టోలో తమకు అధికారం అప్పగిస్తే ఈ రాజద్రోహ చట్టాన్ని రద్దు చేస్తామని కాంగ్రెస్ వాగ్దానం చేసింది. డీఎంకే తన మిత్రపక్షమైన కాంగ్రెస్‌ను కాదని ఒక్క ఎమ్మెల్యే కూడా లేని వైకోకు ఈ నెల 18న జరిగే రాజ్యసభ ఎన్నికలకు టిక్కెట్టు ఇచ్చింది. అంటే గతంలో వైకోపై ఈ కేసు పెట్టిన డీఎంకే ఇప్పుడాయనకు సన్నిహితమైంది. రాజద్రోహ చట్టాన్ని అందరికన్నా ఎక్కువ దుర్వినియోగం చేసిన కాంగ్రెస్ దాన్ని రద్దు చేస్తామన్నది. ఇలా ఎవరికివారు అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరోలా మాట్లాడుతున్నారు గనుకే రాజద్రోహ చట్టం స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు గడుస్తున్నా కొనసాగుతోంది.

వైకోపై ఆ చట్టాన్ని ప్రయోగించినప్పుడు కనీసం దాన్ని సమర్థించుకోవడానికి ఆనాటి సర్కారుకు ఏదో సాకు చెప్పే అవకాశమైనా ఉంది. ఆ ప్రసంగంవల్ల ముమ్ముందు సమస్యలు రావొచ్చునని, హింస చోటుచేసుకునే అవకాశమున్నదని ప్రభుత్వం వాదించవచ్చు. కానీ పదేళ్లు గడిచాక వెనక్కి తిరిగి చూస్తే తమిళనాడులో వైకో వల్ల ఏ సమస్యా తలెత్తలేదు. హింసాత్మక ఉదంతం ఒక్కటైనా జరగలేదు. కనుక ఆనాటి ప్రభుత్వం చేసిన ఆరోపణలకు ఏ ప్రాతిపదికా లేదని అర్థమవుతుంది. న్యాయస్థానం మాత్రం ప్రభుత్వం అనుమానించినట్టు హింస జరిగిందా లేదా అన్నది అప్రస్తుతమని స్పష్టం చేసింది. వైకో ప్రసంగాన్ని విన్నవారెవరైనా ప్రభుత్వంపై విద్వేషాన్ని పెంచుకుంటారని అభిప్రాయపడింది. చట్టప్రకారం వైకో ప్రసంగం పర్యవసానంగా హింస జరిగితేనే శిక్ష విధించాలన్న నియమం లేదని తెలిపింది. హింసను సమర్థించడం ఆ ప్రసంగం సారాంశమని, అది శిక్షార్హమైన నేరమేనని స్పష్టం చేసింది. అయితే ఆయన్ను కనికరించి ఏడాది జైలు శిక్ష, రూ. 10,000 జరిమానా విధిస్తున్నామని ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి శాంతి తీర్పునిచ్చారు. శిక్ష అమలును ఉన్నత న్యాయస్థానంలో అప్పీల్‌కు వీలుగా నెలరోజులు నిలిపేస్తున్నట్టు ప్రకటించారు. అదృష్టవశాత్తూ ఎవరెవరు ప్రజాప్రతినిధులుగా పోటీకి అనర్హులో ఏకరువు పెట్టే ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్8(1)లోని జాబితాలో 'రాజద్రోహం' లేదు. అలా ఉంటే తాజా రాజ్యసభ ఎన్నికల్లో పోటీకి వైకో అనర్హులయ్యేవారు.

ఈ చట్టంలోని సెక్షన్ల పరిధి చాలా విస్తృతమైనది కావడం సమస్యలకు దారితీస్తోంది. ప్రభుత్వాలను విమర్శించినా, వాటిపై వ్యంగ్యచిత్రాలు గీసినా, ఛాయాచిత్రాలు ప్రదర్శించినా అవి 'రాజద్రోహ' చర్యలవుతున్నాయి. మహారాష్ట్రలో కాంగ్రెస్–ఎన్‌సీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు అవినీతిపై వ్యంగ్య చిత్రాన్ని గీసిన కాన్పూర్ కార్టూనిస్టు ఆసిమ్ త్రివేదీని ముంబై పోలీసులు రాజద్రోహం నేరం కింద అరెస్టు చేశారు. పటేల్ కులానికి రిజర్వేషన్లు కావాలంటూ ఉద్యమాలు నిర్వహించిన హార్దిక్ పటేల్‌ను కూడా ఈ చట్టం కిందే అరెస్టు చేశారు. ఇంకా బినాయక్ సేన్, అరుంధతీరాయ్, కన్హయ్యకుమార్ తదితరులపైనా ఈ కేసులు పెట్టారు. రాజ్యాంగంలోని 19(1)(ఏ) అధికరణ పౌరుల భావప్రకటనా స్వేచ్ఛకు, వ్యక్తీకరణకు హామీ ఇస్తోంది. అదే సమయంలో 19(2) దానికి కొన్ని పరిమితులు విధించింది. చాలా సందర్భాల్లో న్యాయస్థానాలు పౌరుల భావప్రకటనా స్వేచ్ఛకే ప్రాధాన్యమిచ్చినా రాజద్రోహ చట్టం రాజ్యాంగబద్ధమైనదేనని తేల్చిచెప్పాయి. 1958లో రాం నందన్ కేసులో అలహాబాద్ హైకోర్టు ఈ చట్టం రాజ్యాంగ విరుద్ధమని తీర్పునిచ్చింది. అయితే సుప్రీంకోర్టు మాత్రం దానికి రాజ్యాంగబద్ధత ఉన్నదని 1962లో కేదార్‌నాథ్ కేసులో తేల్చిచెప్పింది. ఏదైనా ప్రసంగం లేదా రచన ప్రజల్ని హింసకు ప్రేరేపించిందని, అందువల్ల పరిస్థితులు విషమించాయని నిరూపించగలిగినప్పుడే దీన్ని ప్రయోగించాలని సూచించింది. కానీ ప్రభుత్వాలకు ఇదేం పట్టడం లేదు. రచయితలు, కవులు, కళాకారులు, ఉద్యమకారులు ఎవరైనా ఈ చట్టం కింద నిందితులవుతున్నారు. శిక్ష మాట అలా ఉంచి ముందు ఆ చట్టంకింద అరెస్టయినవారికి, వారి కుటుంబాలకు ఏళ్లతరబడి మానసిక క్షోభ తప్పడం లేదు. జీవితంలో విలువైన సమయమంతా వారు కోర్టుల చుట్టూ తిరిగాక చివరకు నిర్దోషిగా బయటపడినా ఆ జీవితం వెనక్కి రాదు. ప్రభుత్వాల తీరెలా ఉంటున్నదో చెప్పడానికి వైకో కేసే ఉదాహరణ. ఆయనపై 2009లో నేరారోపణ చేస్తే 2017 వరకూ ఆయన్ను అరెస్టు చేయనేలేదు. నిజంగా అంత పెద్ద నేరం చేశారని ప్రభుత్వం భావించినప్పుడు ఎనిమిదేళ్లపాటు ఆయన్నెలా స్వేచ్ఛగా ఉండనిచ్చారో ఆశ్చర్యకరం. వైకో కేసులో అప్పీల్‌కు వెళ్లినప్పుడు ఉన్నత న్యాయస్థానాల్లో ఏం తేలుతుందో చూడాలి. ఈ చట్టాన్ని రద్దు చేయడమే ఉత్తమం. దీన్ని సమీక్షిస్తామని మూడేళ్ల క్రితం ఎన్‌డీఏ ప్రభుత్వం తెలిపింది. కనీసం ఆ ప్రక్రియ పూర్తయినా పరిధులు, పరిమితులు నిర్ధారణవుతాయి. అటు తర్వాత వాటిలోని లోటుపాట్లు చర్చించవచ్చు. ఇప్పటి మాదిరిగా చట్టంలో అస్పష్టతలుంటే వైకో మాదిరే ఎవరైనా 'నేరస్తుడి'గా మారే ప్రమాదం ఉంది.

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు ఆషాఢమాసం, తిథి శు.అష్టమి ఉ.7.09 వరకు, తదుపరి నవమి తె.5.15 వరకు (తెల్లవారితే గురువారం), నక్షత్రం చిత్త రా.8.18 వరకు, తదుపరి స్వాతి, వర్జ్యం రా.1.40 నుంచి 3.11 వరకు, దుర్ముహూర్తం ప.11.36 నుంచి 12.28 వరకు అమృతఘడియలు... ప.2.14 నుంచి 3.44 వరకు.

సూర్యోదయం : 5.35
సూర్యాస్తమయం: 6.32
రాహుకాలం : ప. 12.00 నుంచి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుంచి 9.00 వరకు

# కర్ణాటకలో అసంబద్ధ నాటకం!

విశ్లేషణ



సుగత శ్రీనివాసరాజు

**పార్టీ అధ్యక్ష స్థానం నుంచి రాహుల్ గాంధీ నిష్క్రమణతో కాంగ్రెస్ పార్టీ తన చరిత్రలో ఎన్నడూ లేనంత దుస్థితిలో కొట్టుమిట్టులాడుతుంటే కర్ణాటక కాంగ్రెస్ పార్టీ నేతలు ఈ అన్ని పరిణామాలకు తాము అతీతంగా ఉంటున్నట్లు కనిపిస్తున్నారు. డజనుకుపైగా పార్టీ ఎమ్మెల్యేలు రాజీనామాలు సమర్పించి ఫిరాయింపుల జూదంలో మునిగితేలుతుండటంతో సంకీర్ణ ప్రభుత్వ అస్తిత్వమే ప్రశ్నార్థకంగా మారింది. పార్టీ దుస్థితి పట్ల బాధలేదు. పశ్చాత్తాపం లేదు. ఇప్పుడేం చేయాలి అనే ఆందోళన లేదు. ఎవరెలా చస్తే మాకేం అన్న చందాన ఆ రాష్ట్ర కాంగ్రెస్ నేతలు వ్యవహరిస్తున్నారు. రాహుల్‌కి నమ్మినబంటులా వ్యవహరిస్తూవచ్చిన మాజీ సీఎం సిద్ధరామయ్య అనుయాయులే తిరుగుబాటు ప్రకటించడంతో బీజేపీ తదనంతర వారసుడిగా తాను రంగలోకి రానున్నారా అనే అనుమానాలు ప్రబలమవుతున్నాయి.**

కాంగ్రెస్ పార్టీ ప్రస్తుత పరిస్థితిని అస్తవ్యస్థత అనే ఒకే ఒక్క పదంతో వర్ణించవచ్చు. గాంధీల కుటుంబానికి చెందిన నాల్గవ తరం అధినేత ఏకంగా పార్టీ అధ్యక్ష పదవికే రాజీనామా సమర్పించి, తాను పార్టీలో ఒంటరినయ్యాను అని చేతులెత్తేశారు. తన రాజీనామా నిర్ణయానికి తిరుగులేదని రాహుల్ గాంధీ ఇప్పటికే స్పష్టం చేశారు. పార్టీ అధ్యక్ష పదవి కంటే రాహుల్ తదుపరి చర్య ఏమిటన్నది ఇంకా స్పష్టం కాలేదు. కాగా ఇటీవలి దశాబ్దాలలో కాంగ్రెస్ పార్టీ అదృష్ట చిహ్నంగా ఉంటూ వచ్చిన మన్మోహన్ సింగ్ తాను మరోసారి రాజ్యసభకు ఎన్నిక అవుతానా అన్నది అర్థం కాని స్థితిలో పడిపోయారు. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ ఇంతటి దుస్థితిలో కొట్టుమిట్టులాడుతుంటే, కర్ణాటకలోని కాంగ్రెస్ పార్టీ నేతలు ఈ అన్ని పరిణామాలకు తాము అతీతంగా ఉంటున్నట్లు కనిపిస్తున్నారు.

ఒకవైపు డజనుకుపైగా పార్టీ ఎమ్మెల్యేలు రాజీనామాలు సమర్పించి ఫిరాయింపుల జూదంలో మునిగితేలుతుండటంతో సంకీర్ణ ప్రభుత్వ అస్తిత్వమే ప్రశ్నార్థకంగా మారింది. కానీ ఆ రాష్ట్ర కాంగ్రెస్ నాయకులకు చీమకుట్టినట్లుగా కూడా లేదు. ఒకవైపు ఐఎంఏ కుంభకోణం పేరిట పాంజీ స్కీమ్ వేలాదిమంది పేద, మధ్యతరగతి ముస్లింలు తమ జీవిత కాలం దాచుకున్న పొదుపు మొత్తాలను ఎగరేసుకుపోయింది. కానీ సీనియర్ కాంగ్రెస్ నేత ఒకరు ఇటీవల నిర్వహించిన ఒక ఈవెంటులో పై కుంభకోణంలో పాత్ర ఉన్నట్లు ఆరోపణలకు గురైన పార్టీ సహచరులు హాజరై పండుగ చేసుకుంటున్న వార్తలు పత్రికలకెక్కాయి. పార్టీ అస్తిత్వమే సంక్షోభంలో పడిన ప్రస్తుత సందర్భంలోనూ కొందరు ఎమ్మెల్యేలు తమ రాజకీయ అవకాశవాదాన్నే పరమావధిగా భావించి తమ దారి తాము చూసుకోవడం గమనార్హం.

ఇన్ని గందరగోళాల మధ్య, జావకారిపోయిన పార్టీని పునర్నిర్మాణం చేయడం ఎలా అనే మీమాంస ఎవరికీ ఉన్నట్లు లేదు. పార్టీలో సంక్షోభం, ఐఎంఏ స్కామ్ నేపథ్యంలో ప్రజల్లో ఆగ్రహావేశం వంటివేవీ కర్ణాటక కాంగ్రెస్ నేతలకు కనబడటం లేదు. అప్రతిష్ఠాత్మకమైన ఈవెంట్లలో మునిగితేలుతూ ఫోటో పోజులకు దిగుతూ, సెలబ్రిటీలతో ట్వీట్లు పంచుకుంటూ ఆ పార్టీ నేతలు పొద్దుపుచ్చుతున్నారు. పార్టీ దుస్థితి పట్ల బాధలేదు. పశ్చాత్తాపం లేదు. ఇప్పుడేం చేయాలి అనే ఆందోళన లేదు. ఎవరెలా చస్తే మాకేం అన్న చందాన ఆ రాష్ట్ర కాంగ్రెస్ నేతలు వ్యవహరిస్తున్నారు.

జూలై 3న పార్టీకి రాసిన ఉత్తరంలో బహుశా రాహుల్ గాంధీ కీలక సమయాల్లో 'తాను ఒంటరినయి'నట్లు చెప్పినదానికి అర్థం ఇదేనేమో? పైగా కాంగ్రెస్ పనితీరు మౌలికంగానే పరివర్తన చెందాల్సిన అవసరముందని, రాహుల్ స్పష్టం చేశారు కూడా. కానీ వాస్తవానికి గడచిన దశాబ్దాలుగా కాంగ్రెస్ ఇలాగే కొనసాగుతోంది. యుద్ధం చేయడాన్ని, సమరంలో గెలుపొందడాన్ని కాంగ్రెస్ సేనలు మర్చిపోయాయి. ఈ దయనీయ నేపథ్యంలోనే కర్ణాటకలో ప్రస్తుత రాజకీయ సంక్షోభాన్ని మనం పరిశీలించాల్సి ఉంది. డజనుకుపైగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అక్కడి పార్టీ నుంచి నిష్క్రమించనున్నారు. లేక ప్రస్తుత సంక్షోభ పరిస్థితిని తమకు అనుకూలంగా మలుచుకుని మంచి స్థితికోసం బేరసారాలకు పాల్పడుతున్నారు. అంతే తప్ప, ఒక సంవత్సర కాలంలోనే సంకీర్ణ ప్రభుత్వం వందోసారి సంక్షోభంలో కూరుకుపోవడం పట్ల వీరెవరికీ ఎలాంటి ఆందోళనా కలగడం లేదు.



కానీ కర్ణాటకలో కాని దేశవ్యాప్తంగా కానీ కాంగ్రెస్ పరిస్థితి ఇంత కంటే భిన్నంగా మాత్రం లేదు. ప్రజలు ఇలాంటి వారిని, వీరి సిగ్గుమాలిన రాజకీయాలను చూస్తున్నారు. కానీ ప్రజల మనోభావాలను వీరు మాత్రం అర్థం చేసుకోవడం లేదు. ఇలాంటి కారణాలవల్లే రాష్ట్రంలో పార్టీ అధికారానికి దూరమై జనతాదళ (సెక్యులర్) సంకీర్ణ ప్రభుత్వానికి తావివ్వాల్సి వచ్చిందని, అది కూడా దారుణమైన అస్థిరత్వంతో కొనసాగుతోందని చాలా వ్యాఖ్యానాలు వచ్చాయి కూడా. రెండు పార్టీలకు మద్దతిస్తున్న ప్రజలు పరస్పరం అతివ్యాప్తమయ్యారు కాబట్టి వీరు కలిసి ఉండలేరనే వాదన కూడా ఉంది. ఇది నిజమే కావచ్చు. కానీ ప్రత్యేకించి పాత మైసూరు, దక్షిణ కర్ణాటక జిల్లాల్లో బలీయంగా ఉన్న భూస్వామ్య రాజకీయాలు, అధికార దాహం, ప్రాదేశిక నియంత్రణ, వ్యక్తిగత దురాశలు ఈ అస్తవ్యస్తతకు కారణమని కూడా కొందరి వాదన.

ఒక విషయంలో మనం నిజాయితీగా ఉందాం. సిద్ధరామయ్య వంటి అగ్రనేతలు కాంగ్రెస్ ప్రయోజనాలను పరిరక్షించడం కోసమే పోరాడుతున్నారని నమ్మవచ్చా? సిద్ధరామయ్య వంటి వ్యక్తులు దేవేగౌడ కుటుంబ నిరంకుశత్వానికి, అవమానాలకు గురై వ్యక్తిగతంగా కూడా చాలా ఇబ్బందులు పడ్డారు. అందుకే సిద్ధరామయ్య ప్రతిపక్షంలో కూర్చోవడానికైనా సిద్ధపడతారు తప్పితే కొద్దిమంది ఎమ్మెల్యేలను మాత్రమే కలిగిన గౌడ కుటుంబ సభ్యుడొకరు తనపై బాస్ లాగా పెత్తనం చలాయించడానికి అసలు ఒప్పుకోరు.

అందుకే తాజా సంక్షోభంలో సిద్ధరామయ్య అనుయాయులే తిరుగుబాటు పక్షంలో చేరిపోవడం చూస్తే ఆశ్చర్యమనిపించదు. పైగా తమ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యే తప్ప హెచ్ డి కుమారస్వామి కానేకాదని ఈ ఎమ్మెల్యేలు చాలాసార్లు బహిరంగంగానే ప్రకటించడం కూడా ఆశ్చర్యం కలిగించదు. కానీ కర్ణాటక మాజీ ముఖ్యమంత్రికి అర్థం కానిదల్లా ఏమిటంటే, మెజారిటీ మద్దతును కూడగట్టడంలో తాను విఫలమైనందుకే చివరకు సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడింది అన్నదే. అయిదేళ్ల తన పదవీకాలంలోనూ ఇదే ప్రతిబింబించింది. చివరకు 2018 అసెంబ్లీ ఎన్నికల్లో, 2019 పార్లమెంటు ఎన్నికల్లో తన చేతకానితనమే పార్టీ కొంప ముంచింది. అయితే వ్యూహరచనలో తనదే పైచేయి కాబట్టి ఈ పరాజయ బాధ్యతను ఆయన ఎన్నటికీ గుర్తించరు.

కాంగ్రెస్–జేడీఎస్ సంకీర్ణాన్ని ప్రతిఘటించాలంటే మరింత గౌరవనీయ మార్గాలున్నాయి. కానీ రాష్ట్రంలో పార్టీ విధ్వంసానికి సిద్ధరామయ్యే కారణమని మీడియాలో వార్తలొస్తున్నాయి. దురదృష్టవశాత్తూ వాస్తవం ఎలా ఉన్నప్పటికీ ఆయన వారసత్వం మొత్తంగా ఇలాగే ఉంటోందన్నంత అపకీర్తి మాత్రం మిగిలింది. గడచిన దశాబ్దాలలో ఆయన మృదు స్వభావం, ప్రగతిశీల సంభాషణలు ఒక ముసుగుగా మాత్రమే కనిపిస్తున్నాయి. ఇవన్నీ కలిసి ప్రస్తుత పరిస్థితిలో ఆయన తన పార్టీకి సహాయకారిగా లేరనే అర్థాన్ని కల్పిస్తున్నాయి.

సంకీర్ణ ప్రభుత్వాన్ని బలహీనపరిచే మరొక అంశం కూడా ఇక్కడ తోడైంది. 2013లో తాను రాష్ట్ర ముఖ్యమంత్రి కావడానికి ఏకైక కారకుడు రాహుల్ గాంధీయే అని సిద్ధరామయ్య ప్రగాఢ నమ్మకం. సోనియా గాంధీ ఏఐసీసీ ప్రెసిడెంటుగా ఉంటుండగా సీఎం కుర్చీకి చాలా పోటీ ఉన్నప్పుడు రాహుల్ తనవైపే మొగ్గ చూపారని ఆయన నమ్మిక. అయితే ఇప్పుడు రాహుల్ ఢిల్లీకి దూరమైపోయారు కాబట్టి సీజనల్ రాజకీయ నేత అయిన సిద్ధరామయ్య వెంటనే తన విశ్వాసాన్ని మార్చుకుని తనకు మరింత ప్రాధాన్యత లభించే చోటుకోసం వెతుక్కుంటున్నట్లు కనిపిస్తోంది. తాను సేవలిందించే పార్టీపైనే తిరుగుబాటు చేసే సుదీర్ఘ చరిత్ర సిద్ధరామయ్యకు ఉందని చాలామందికి తెలీదు.

అయితే కాంగ్రెస్ పతనానికి సిద్ధరామయ్య మాత్రమే కారకులని నిందించలేం. సీనియర్ కాంగ్రెస్ నేతలు చాలామంది ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల వలే పనిచేస్తూవచ్చారు. గత నాలుగు దశాబ్దాల కాంగ్రెస్ చరిత్రను పరిశీలిస్తే 1983లో రామకృష్ణ హెగ్డే నేతృత్వంలో తొలి కాంగ్రెసేతర ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుంచి నేటివరకు కాంగ్రెస్ వృద్ధిబాట పట్టలేకపోయింది. దాని సగటు వోటు వాటా 30.49 శాతం వద్దే నిలిచిపోయింది. జనతా పరివార్ కావచ్చు, సంఘ్ పరివార్ కావచ్చు వాటిలో చీలికలు వచ్చి బలహీనపడినప్పుడు మాత్రమే కాంగ్రెస్ అధికారంలోకి రాగలిగింది. 1989లో వీరేంద్రపాటిల్ ముఖ్యమంత్రిగా పనిచేసిన కొద్ది కాలం మినహాయిస్తే, ఇతర ఏ కాంగ్రెస్ ప్రభుత్వ విజయాలు కూడా సానుకూల ఓటుతో వచ్చినవి కాదు. అధికారం నిలుపుకోవడానికి ఒక కొత్త ఆలోచనవైపు కానీ, ఒక కొత్త సామాజిక బృందం వైపు కానీ కాంగ్రెస్ నేతలు ఎన్నడూ నడిచిన పాపాన పోలేదు.

ప్రస్తుత నేపథ్యంలో బీజేపీ ఏం చేయాలనుకుంటోందన్నది ఆసక్తికరంగా ఉంటుంది. వారు అధికారంపై మాత్రమే దృష్టి పెట్టడంలేదు. బీఎస్ ఎడ్యూరప్పను మళ్లీ సీఎంగా నిలుపడానికి వారు ఏమాత్రం తొందరపడలేదు. ఆయన తదనంతర వారసుడికోసం తగిన మార్గాల కోసం వారు అన్వేషిస్తున్నారు. సిద్ధరామయ్య వంటివారు తమ పార్టీలోకి రావడం ఖరారైతే నూతన నాయకత్వానికి పట్టం కట్టడం కూడా వారు ఎడ్యూరప్ప ద్వారానే చేస్తారు కూడా. బీజేపీ నిజమైన ఉద్దేశం దక్షిణ కర్ణాటకలో బలంగా పాదుకోవడమే. ఉత్తర కర్ణాటకనుంచి ఒక లింగాయత్‌ను పదే పదే నాయకుడిగా నిలుపడం ద్వారా బీజేపీ అలసిపోయినట్లుంది. ఇప్పుడు వొక్కళిగ కమ్యూనిటీ నుంచి నాయకత్వాన్ని రూపొందించడం దాని లక్ష్యం. అందుకేవారు కాంగ్రెస్ విస్మృత నేత ఎస్ఎమ్ కృష్ణను వారు తమలో చేర్చుకున్నారు. ఈ ప్రాంతంలో ఆయన అస్తిత్వ రాజకీయాలకు బలమైన చిహ్నంగా నిలబడ్డారు. ఈ నేపథ్యంలోనే ఈ రీజియన్‌లో తాజా లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వారికి చాలా ప్రోత్సాహకరంగా మారాయి. మొత్తంమీద చూస్తే రాజకీయంగా కర్ణాటకలో బీజేపీ భవిష్యత్తు మాత్రం నిరాశా నిస్పృహలతో కొనసాగదన్నది వాస్తవం.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్టు, రచయిత

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



## సోషల్ మీడియా

### పద్మశ్రీ



"కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో మా నాన్న కైఫీ ఆజ్మీ తన పద్మశ్రీని తిరిగి ఇచ్చేశారనే విషయాన్ని ఇప్పుడొకసారి అందరికీ గుర్తు చేయాలనుకుంటున్నా. ఉర్దూకు ద్వితీయ భాష స్థాయి కల్పించాలన్న వారి ముఖాలకు మసిపూసి, గాడిద మీద ఊరేగించాలని ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ మంత్రి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఆయన తన పురస్కారాన్ని తిరస్కరించారు"

– షబానా ఆజ్మీ, నటి

### అంకెలు



"ఈ మధ్య ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ నుంచి సుమారు 1.7 లక్షల కోట్లు మాయమైపోయాయట. ఇదే సంఘటన ఏదైనా కంపెనీలో జరిగితే వెంటనే సీఎఫ్‌ఓను ఉద్యోగం నుంచి పీకేస్తారు. ఇది నిజమే అయితే సీరియస్ గా మోసం జరిగినట్టే. బడ్జెట్ పేరు చెప్పి అంకెలతో పరిహాసాలు ఆడుతున్నారు. ప్రభుత్వం చెప్పే ప్రతి విషయాన్నీ ప్రజలు ఎలా నమ్ముతారు. దీనిపై స్పష్టత ఇవ్వడం ద్వారా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తన బాధ్యతను నిరూపించుకోవాలి"

– అంజలీ భరద్వాజ్, ఆర్టీఐ కార్యకర్త

### నాలుగో స్తంభం



"ప్రింట్ మీడియా ఆదాయం పడిపోతోంది. ప్రజాస్వామ్యానికి మీడియా నాలుగో స్తంభం లాంటిది. దానిని పరిరక్షించాల్సిన అవసరం ఉంది. పదిశాతం కస్టమ్స్ డ్యూటీ పెంచితే దానిపై మరింత భారంపడి మనుగడ కష్టమవుతుంది. మీడియాను భయపెట్టి, దారిలో పెట్టుకోవడానికి ఇది ఉద్దేశపూర్వకంగా తీసుకున్న చర్య కాదు కదా?"

– షమా మహమద్, కాంగ్రెస్ నేత

### పోషణ



"అధికారంలో ఉంచడానికీ, దించడానికీ, నేతలను పెంచిపోషించడానికి ముకేశ్ అంబానీకి గానీ, రిలయన్స్ ఇండస్ట్రీస్‌కుగానీ అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ సహకారం అవసరంలేదు. పార్టీలతో ప్రమేయం లేకుండా రాజకీయనేతలంతా దేశంలోని అత్యంత ధనవంతుడికి సాగిలపడటానికి ఎవరి స్థాయిలో వారు ప్రయత్నిస్తూనే ఉంటారు"

– రోహిణీ సింగ్, జర్నలిస్ట్

### మ్యాచ్



"శస్త్రచికిత్స నిమిత్తం ఆపరేషన్ థియేటర్ లోకి వెళుతూ కూడా ఒకవేళ భారత్ టాస్ గెలిస్తే మనవాళ్ల బ్యాటింగ్ చూసే అవకాశం మిస్సయిపోతానని విక్రం తెగ కంగారుపడ్డారు. టీం ఇండియా చేసేది బ్యాటింగ్ అయినా, బౌలింగ్ అయినా.. మీరు ముందువస్తే భారత్ ఫైనల్స్‌కు వెళుతుందని డాక్టర్ ఆయనకు హామీ ఇచ్చారు"

– ప్రియాంక చతుర్వేది, శివసేన నేత

# బడ్జెట్‌లో పసుపుబోర్డ్ ప్రస్తావన ఏది?

భౌగోళిక పరిస్థితులు, నేలల అనుకూలం వలన నిజామాబాద్ జిల్లాలో దేశంలోనే అత్యధికంగా పసుపును పండిస్తున్నారు. కొన్నేళ్లుగా జిల్లాలోని పసుపు, ఎర్రజొన్న రైతులు ఆందోళనకు దిగుతూ తమ డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచుతున్నారు. ముఖ్యంగా ఈ పంటలను కనీస మద్దతు ధర పరిధిలోకి తీసుకురాకపోవడం, దళారుల చేతుల్లో మోసపోయి గిట్టుబాటు ధర రాకపోవడం, అధిక వర్షపాతం వలన పంట నష్టపోవడంతో పరిహారం లేకపోవడం లాంటి అనేక సమస్యల వలన రైతులు న్యాయం కోసం తరచు రోడ్ల మీదికి వచ్చి ఆందోళనకు దిగుతున్నారు. పసుపు పంట వాణిజ్య పంట కావడంతో అది కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి వస్తుందని, మద్దతు ధర కల్పించాలంటే పసుపుబోర్డు మాత్రమే పరిష్కారం అని నేతలు తప్పించుకోవడం, అలాగే, ప్రజా ప్రతినిధులు చట్టసభల్లో సరైన విధంగా ప్రశ్నించకపోవడంతో ఆ రైతుల సమస్యల పరిష్కారం కాకపోగా, క్రమంగా రాజకీయ సమస్యగా మారింది. దీంతో నిజామాబాద్ ప్రాంతంలోని 176మంది రైతులు నిరసనగా నామినేషన్లు దాఖలు చేయడంతో పాటు వారణాసి నియోజకవర్గంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీకి వ్యతిరేకంగా 25 మంది రైతులు నామినేషన్లు దాఖలు చేయడం దేశ దృష్టిని ఆకర్షించింది. మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో నిజామాబాద్ రైతు ఆందోళన దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. పసుపు ధర క్వింటాలుకు రూ.15 వేల వరకు మరియు ఎర్ర జొన్నలు క్వింటాలుకు రూ.4 వేలు ఉండే విధంగా మద్దతు ధరను ప్రకటించాలని అనేక డిమాండ్లను వ్యక్తం చేసినప్పటికీ గత వారం భారత ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్లో ప్రవేశపెట్టిన బడ్జెట్లో పసుపు బోర్డు పై ఎలాంటి ప్రస్తావన లేకుండా సాదాసీదాగా ముగించడం బాధాకరమైనది.

గత కొన్ని దశాబ్దాల కాలం నుండి వ్యవసాయం రంగం తీవ్ర సంక్షోభంలో పడిన నేపథ్యంలో దేశానికి వెన్నుముకగా పిలుస్తున్న రైతు ఆత్మహత్యలతో సతమతమవుతున్నాడు. కాబట్టి రాజకీయాలకతీతంగా పసుపు, ఎర్రజొన్న రైతులకు ఆదుకోవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కేంద్ర ప్రభుత్వం తక్షణం స్పందించి ఈ రైతులు పండిస్తున్న పసుపు, ఎర్రజొన్నకు తగిన గిట్టుబాటు ధర అందిస్తూ ప్రోత్సాహాన్ని కల్పించవలసి ఉంది. రైతుకు ఆర్థిక సామాజిక భద్రతను కల్పిస్తూ నవతరం వ్యవసాయ రంగంలోకి వచ్చే విధంగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది.

సంపతి రమేష్ మహారాజ్,
జన విజ్ఞాన వేదిక ఉపాధ్యక్షుడు
రాజన్న సిరిసిల్ల జిల్లా
మొబైల్ : 9959556367

# మాతృభాషలో పరీక్షలే మేలు

సందర్భం



డా॥ అప్పిరెడ్డి హరినాథరెడ్డి

జాతీయ స్థాయిలో ఉద్యోగాలకోసం పరీక్షలు దాదాపుగా హిందీ, ఇంగ్లిష్ భాషలలో ఉండటం వలన చాలామంది ప్రాంతీయ భాషలలో చదువుకున్నవారు ఉద్యోగాలలో ఎంపిక కావడం కష్టమైపోతోంది. అఖిల భారత సర్వీసు వంటి కీలక పరీక్షలలో కూడా ప్రాంతీయ భాషలలో రాసే అవకాశం ఉంది. ఇంగ్లిష్, ప్రాంతీయ భాషల పరిజ్ఞానం అంచనావేయడానికి పదవతరగతి స్థాయిలో ప్రత్యేక పరీక్ష ఉంటుంది. అర్హత కోసమే తప్ప, ఈ మార్కులకు ఉద్యోగం ఎంపికకు ముడిపెట్టరు. ఇతర కేంద్ర ఉద్యోగాలలో చాలా చిన్న ఉద్యోగాలకు సైతం ప్రాంతీయ భాషలలో రాసే అవకాశం లేకుండా ఇన్నాళ్ళు కొనసాగుతూ వస్తుంది. దేశంలోని చాలా రాష్ట్రాల నుండి ముఖ్యంగా దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాల నుండి కేంద్రం నిర్వహించే పరీక్షలు ప్రాంతీయ భాషలలో కూడా ఉండాలని కేంద్ర ప్రభుత్వాల్ని చాలా ఏళ్లుగా డిమాండ్ చేస్తూ వచ్చాయి. చాలా కేంద్ర ఉద్యోగ పరీక్షలకు దక్షిణాది వారు దరఖాస్తు కూడా చేసేవారు కాదు. ఉత్తరాది వారి ఆధిపత్యమే కేంద్ర ఉద్యోగాలలో సాగేది. ప్రజలనుండి వస్తున్న విజ్ఞప్తులపై ఇటీవల కేంద్రం స్పందించింది. కేంద్ర ఆర్థిక శాఖామంత్రి నిర్మలా సీతారామన్ బ్యాంకుల పరీక్షలను ప్రాంతీయ భాషలలో నిర్వహిస్తామని ప్రకటించారు.

దేశవ్యాప్తంగా కామన్ రిక్రూట్‌మెంట్ ప్రాసెస్‌లో బ్యాంకులకు సంబంధించిన స్కేల్ 1, 2, 3 అధికారులను, ఇతర కింది స్థాయి సిబ్బందిని నియామకం చేస్తారు. ఈ ప్రాంతీయ బ్యాంకుల పరీక్షలను కూడా కేవలం ఇంగ్లిష్, హిందీ భాషలలో నిర్వహించే వారు. ఇప్పటి నుండి తెలుగు, కన్నడ, తమిళం, మళయాళం, అస్సామీ, బెంగాలీ, గుజరాతీ, మరాఠీ, ఒడియా, కొంకణి, పంజాబీ, మణిపురి, ఉర్దూ తదితర పదమూడు ప్రాంతీయ భాషలలో కూడా పరీక్షలు నిర్వహిస్తామని మంత్రి ప్రకటించారు. వివిధ గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఇది ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

ప్రాథమిక, ఉన్నత స్థాయిలలో మాతృభాషలలో విద్యను అభ్యసించిన వారు తాము చదువుకొన్న భాషలో భావనలు వ్యక్తం చేయడం సౌకర్యంగా ఉంటుంది. చాలా రాష్ట్రాలలో విద్యార్థులు తమ మాతృభాషా మాధ్యమంలోనే విద్య అభ్యసిస్తారు. ఇంగ్లిష్, హిందీ భాషలను కేవలం ఒక అంశంగా మాత్రమే చదువుతారు. తాము పొందిన జ్ఞానం, భావనలు ఇతర భాషలలో అనువదించుకొని, పదజాలాన్ని అవగాహన చేసుకొని పరీక్షలలో పోటి పడి ఉద్యోగం సాధించడం సులువుకాదు. ఈ కారణంగా ఎంతో మంది మాతృభాషలలో వివిధ విషయాలపట్ల పరిజ్ఞానం, అవగాహన ఉండి కూడా అవకాశాలను అందుకోలేకపోయారు.

ఒక ఉద్యోగి ఇతర రాష్ట్రాలలో ఉద్యోగం చేయవలసిన సందర్భాలలో హిందీ, ఇంగ్లిష్ పరిజ్ఞానం అవసరమే అవుతుంది. అందుకు ఇంగ్లిష్, హిందీ భాషలలో ప్రాథమిక పరిజ్ఞానం పరిశీలించడానికి ప్రత్యేక పరీక్షలు నిర్వహించుకోవచ్చు. ఉద్యోగాల ఎంపికలో మొత్తం జ్ఞానం అంతా పరాయి భాషలోనే సామర్థ్యం ఉండాలనుకోవడం అశాస్త్రీయం అవుతుంది. స్వరాష్ట్రాలలో పని చేసే కేంద్ర ఉద్యోగులకు హిందీ, ఇంగ్లిష్‌లో సాధారణ పరిజ్ఞానం ఉన్నా సరిపోతుంది. కేంద్రప్రభుత్వం వివిధ శాఖలలో నిర్వహించే పరీక్షలను ప్రాంతీయ భాషలలో కూడా రాసే విధంగా అవకాశం కల్పించే విషయమై తక్షణం ఒక నిపుణుల కమిటీ నియమించాలి. రైల్వే, పోస్టల్, రక్షణ, స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ తదితర ఉద్యోగుల ఎంపికలోను ప్రాంతీయ భాషలలో అవకాశాలు ఉండాలి. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా నిర్వహించే నెట్ జనరల్ స్టడీస్ పరీక్ష ఆయా ప్రాంతీయ భాషలలో నిర్వహించాలి. రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు అన్ని ఉద్యోగాలకు పరీక్షలను ఇంగ్లిష్, తెలుగు భాషలో నిర్వహించాలి. కొన్నిసార్లు నిర్లక్ష్యంగా తెలుగులో అనువాదం చేయడం వలన పరీక్షలలో నష్టపోయినవారు ఉన్నారు.

ఇప్పటికే ఉద్యోగంలో ఉంటూ శాఖాపరమైన పదోన్నతులకోసం రాసే పరీక్షలను పూర్తిగా ఇంగ్లిష్‌లో నిర్వహిస్తున్నారు. ఇలాంటి పరీక్షలను అన్ని రాష్ట్రాలలో వారి మాతృభాషలలో నిర్వహిస్తున్నారు. కానీ మనవాళ్లు మాత్రం ఆంగ్లంలో అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. పదోతరగతి అర్హతతో ఉద్యోగంలోకి ప్రవేశించిన వారు సైతం శాఖాపరమైన పదోన్నతి పరీక్షలు ఇంగ్లిష్‌లోనే రాయాలనడం అసమంజసమైన విషయం. కష్టపడి తమ మాతృభాషలో జ్ఞానం పొందిన ఉద్యోగార్థులను, పరాయి భాషల ద్వారా పెత్తనం చేసే కృతక చర్యలతో మానసికంగా బలహీనం చేయడం అంటే వారి అవకాశాలను, హక్కులను భంగం చేయడమే అవుతుంది.

వ్యాసకర్త కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత, అనంతపురం
మొబైల్ : 99639 17187

# బాల్య స్నేహం

మనిషి జీవితంలో స్నేహం చాలా అపురూపమైనది. అందులో బాల్య స్నేహం ఇంకా మనోజ్ఞం. చదువుల కారణంగానో, ఉద్యోగ రీత్యానో, వివాహానంతర కుటుంబ ఒత్తిడులతోనో, బాల్య స్నేహితులతో ఎడం ఏర్పడినా ఆ బాల్య జ్ఞాపకాలు మనలో అవ్యక్త మాధుర్యాన్ని నింపుతాయి. పెద్ద వారయ్యాక బాల్య స్నేహితులు కలవటం తటస్థిస్తే ఆ ఆనందం వర్ణనాతీతం. తన మనసులోని బాధను చెప్పకుండానే గ్రహించి సహాయం చేసేవాడు మనసె రిగిన స్నేహితుడు. తన అవసరంలో ఆదుకున్న స్నేహితుని ఎప్పటికీ వదిలి పెట్టకుండా కాపాడుకోగలిగేవాడు మంచి స్నేహితుడు.

మహా భారతం మనకు 'ఇలా ఉండాలి' అని బోధిస్తుంది. 'ఇలా ఉండకూడదు' అని కూడా ప్రబోధిస్తుంది. కృష్ణ, కుచేలుల మైత్రి జగద్విఖ్యాతం. అపూర్వమైన, ఆదర్శమైత్రి అది. వీరిద్దరూ సాందీపుని గురువు వద్ద విద్యాభ్యాసం చేస్తున్నప్పటి నుంచి బాల్య స్నేహితులు. కుచేలుడు అభిమానధనుడు. ఇంట్లో పేదరికం తాండవిస్తున్నా దీనంగా ఎవరినీ యాచించడు. పిల్లల ఆకలి చూడలేక భార్య సలహాతో, చిరిగిన వస్త్రపు కొంగులో అటుకులు మూటగట్టుకుని కృష్ణుని కలవటా నికి వెళతాడు. బాల్య



జ్యోతిర్మయం

స్నేహితులు పెద్ద వారయ్యాక కలిస్తే ఎలా ఉంటుంది ఆ భావోద్వేగం. కుచేలుని చూడగానే కృష్ణుడు గబగబ పాన్పుదిగి ఎదురు వెళతాడు. కౌగిలించుకుని పక్కనే కూర్చోబెట్టుకుంటాడు. అక్కడ సంపద, అంతస్తుల తారతమ్యాలు లేవు. ఉన్నదొకటే స్నేహం. ఎన్నో ఏళ్ల తర్వాత కలిసిన మిత్రులకు కాలం తెలుస్తుందా? తాము గురుకుల వాసం చేసిన రోజులలో జరిగిన విశేషాలను కృష్ణుడు గుర్తు చేశాడు. గంటలసేపు మాట్లాడుకున్నారు ఇద్దరూ. గుండెలనిండా సంతోషంతో ఇంటికి వెళ్లాడు కుచేలుడు. తనకు ధన సహాయం కావాలని అడగలేడు కుచేలుడు. కృష్ణుడు సహాయం చేస్తానని చెప్పలేదు. కుచేలుడు ఇంటికి వెళ్లేటప్పటికి మణిమయ సౌధం సిరిసంపదలతో దర్శనమిచ్చింది. అడగకుండానే కుచేలుని ఆపదలో ఆదుకున్న మనసున్న స్నేహితుడు కృష్ణుడు. స్నేహంలో ఎటువంటి అంతరాలు ఉండకూడదని, స్నేహమంటే ఇలా ఉండాలి అని చాటి చెప్పింది కృష్ణ కుచేలుల స్నేహం.

మరి ద్రుపద, ద్రోణులు భరద్వాజాశ్రమంలో కలిసి విద్యలు నేర్చిన బాల్య మిత్రులు. పెద్దవారయ్యాక ద్రోణుడు పేదరికంతో బాధపడుతూ బాల్య స్నేహం గుర్తుకు వచ్చి ద్రుపదుని కలుస్తాడు. ద్రుపదుడు సమానమైన విద్య, సంపద, స్వభావం కలవాళ్లకే స్నేహం ఏర్పడుతుంది కానీ, తమకు కాదని అవమానిస్తాడు. ద్రోణుడు కలత చెందుతాడు. స్నేహానికి అంతస్తులు, సంపద అడ్డు కాకూడదని వీరి కథ చెబుతుంది. బాల్య స్నేహంలోని తీపి గుర్తులు మానసికారోగ్యానికి పరమౌషధాలు.

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 270 1083



జర్నలిస్టును కావాలనుకున్నా
- లోపలి పేజీలో

సాక్షి
ఫ్యామిలీ
నల్లగొండ ॥ బుధవారం
10-7-2019

డబ్బుల్ పెట్టలేదు
- సినిమా పేజీలో






# గుడ్డీగా ఫాలో అవుదామా!

ఆదివాసీ బాలికలతో సోనాల్

**గుడ్ టచ్... బ్యాడ్ టచ్**
**గుడ్ పీపుల్... బ్యాడ్ పీపుల్**
**గుడ్ రిలేషన్... బ్యాడ్ రిలేషన్**
**ఇవన్నీ మన అమ్మాయిలకు**
**కొంత ఉజ్జాయింపుగా తెలుసు.**
**మనలో చైతన్యం ఉంది... కాబట్టి...**
**మన ఆడపిల్లలకు ఈ విషయాలు చెప్పి**
**జాగ్రత్త పడుతున్నాం.**
**ఆదివాసీ ఆడపిల్లలకు ఈ విషయాలు**
**ఎవరు చెబుతారు?**
**మన ప్రపంచంలోనే మగవాడి**
**ఆటవిక రాజ్యం ఏవగింపు కలిగిస్తోంది.**
**మరి... అడవిలో మగాడి పంజా నుంచి**
**ఆడపిల్లలను ఎవరు కాపాడతారు?**
**అందుకే... వాళ్లు గుడ్డీని ఫాలో అవుతున్నారు.**



కల్పిత పాత్ర: గుడ్డీ

ఓ పన్నెండేళ్ల అమ్మాయి, పేరు గుడ్డీ. ఆమెకో గ్యాంగ్ ఉంటుంది. ఆ గ్యాంగ్‌లో అందరూ అమ్మాయిలే. వాళ్లు సమాజంలో ఎదురయ్యే అరాచకాలను ఎదిరిస్తుంటారు. ఆడవాళ్ల మీద దాష్టీకానికి పాల్పడిన మగవాళ్ల పీచమణుస్తుంటారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి చైతన్యపరుస్తుంటారు. మగవాళ్ల నుంచి ఊహించని విపత్తులు సంభవించినప్పుడు బెంబేలు పడకుండా ధైర్యంగా నిలబడి వాటిని ఎదుర్కోవడమెలాగో తోటి ఆడపిల్లలకు, మహిళలకు చెప్తారు. వేధింపులు, అత్యాచారాల ప్రమాదాన్ని ఊహించి జాగ్రత్తపడమెలాగో కూడా నేర్పిస్తారు. ఈ గడుగ్గాయిల బృందానికి నాయిక గుడ్డీ. ఓ ప్రవక్త మాదిరిగా మహిళలకు ఎన్నో కబుర్లు చెప్తుంటుంది. మహిళలను, బాలికలను ఇంతగా ఆకట్టుకున్న గుడ్డీ... ఒక కల్పిత పాత్ర. ఆ పాత్ర ఆధారంగా అల్లిన అనేక కథనాలతో ఆదివాసీ సమాజాన్ని చైతన్యపరుస్తోంది సోనాల్ రోచానీ.

**ఆ గర్భిణి... కళ్లలో మెదిలేది**

సోనాల్ రోచానీది గుజరాత్, జునాఘడ్ పట్టణంలో స్థిరపడిన సింధీ కుటుంబం. ఆమె స్థానిక వార్తాపత్రికలో జర్నలిస్టుగా క్రైమ్ న్యూస్ రిపోర్ట్ చేసేది. ప్రతి నేరం వెనుక ఒక కాఠిన్యం ఉంటుంది, నేర పరిశోధన లోతుల్లోకి వెళ్లే కొద్దీ మనసును కదిలించే అగాధాలు బయటపడేవి. సూరత్‌లో 2005లో ఒక మహిళ కిరోసిన్‌తో తడిసిన దుస్తులతో రక్షించమని కేకలు పెడుతూ పరుగెత్తుకొచ్చింది. ఆ వార్త పూర్వాపరాల్లోకి వెళ్లే కొద్దీ మనసును పిండేసే నిజాలు బయటపడ్డాయి. కిరోసిన్‌తో తడిసిన ఆ మహిళ గర్భిణి, 'ఆమె కడుపులో పెరుగుతున్న బిడ్డ ఆడశిశువు' అని తెలుసుకున్న ఆమె అత్త, బంధువులు ఆ గర్భిణిని చంపేయడానికి ప్రయత్నించారు. ఆమె నిద్రలో ఉండగా ఆమె ధరించిన దుస్తులను కిరోసిన్‌తో తడిపేశారు. ఒంటికి తేమ తగలడంతో మెలకువ వచ్చిందామెకు. తనకు ఎదురైన ప్రమాదాన్ని క్షణాల్లోనే గ్రహించి కాపాడమని ఇంటి బయటకు పరుగెత్తుకొచ్చింది. ఈ సంఘటన సోనాల్‌ను విపరీతంగా కదిలించి వేసింది. అప్పటి వరకు సోనాల్ రిపోర్ట్ చేసిన క్రైమ్ న్యూస్ ఒక ఎత్తు. ఈ గర్భిణికి ఎదురైన పరిస్థితి ఒక ఎత్తు. ఈ ఘటన ఆమెను నిద్రలో కూడా వదిలేది కాదు. ఇలాంటి మహిళల కోసం తాను ఏమైనా చేయగలనా అని ఆలోచించడానికి దారి తీసిన సంఘటన అది.



**'శక్తి' పుట్టింది**

సోనాల్ జర్నలిజాన్ని వదిలేసి ఆదివాసీల జీవితాలను ఉద్ధరించడానికి పూనుకునేటట్లు దారి తీసిన పరిస్థితి మరొకటుంది. సెంట్రల్ గవర్నమెంట్ అధికారిక డాక్యుమెంట్‌లను స్థానిక భాషలోకి అనువదించే ప్రాజెక్టులో పని చేస్తున్నప్పటి సంగతి ఇది. నిరుపేదలకు ప్రభుత్వం రూపొందించిన పథకాలు, వాటి అమలుకు సంబంధించిన డాక్యుమెంట్లను చదువుతుంటే ప్రభుత్వ ధనం అర్హులకు చేరకుండా మధ్యలో ఎంత దుర్వినియోగమవుతోందో తెలిసింది. ఆదివాసీల కోసం రూపొందిన పథకాల గురించి వాళ్లకు కనీసంగా కూడా తెలియకపోవడం దారుణం అని కూడా అనిపించింది. 'ఈ పరిస్థితిని సరిదిద్దడానికి ఏదో ఒకటి చేయాలి. తమ జీవితాలను బాగుచేసుకోవాలనే ఆలోచన ఆదివాసీల్లో రేకెత్తించగలిగితే చాలు. ఆ తర్వాత ప్రభుత్వ పథకాలను తమ ముంగిట్లోకి తెచ్చుకునే పని వాళ్లే చేసుకుంటారు' అనుకున్నది సోనాల్. ఉద్యోగం చేస్తూ ఇవన్నీ చేయాలంటే కుదిరేపని కాదు. జర్నలిస్ట్‌గా తన వృత్తి ఎలా ఉంటుందంటే... ఒక న్యూస్ కవర్ చేసినప్పుడు కదిలిపోయిన మనసు, పరిష్కారం కోసం వెతుకుతూనే ఉంటుంది. అయితే మరునాడు మరో సంఘటనను రిపోర్ట్ చేసినప్పుడు మొదటిది పక్కకు పోయి మరొక అంశం వచ్చి చేరుతుంటుంది. ఆ రెండవది కూడా ఆ మరుసటి రోజు వరకే. మూడవ రోజు మరొక అంశం చుట్టూ తిరుగుతుంటుంది తన ఉద్యోగం. ఇందులో కొనసాగుతూ పూర్తి చేయగలిగిన ప్రాజెక్టు కాదు ఆమె చేపట్టబోతున్నది. ఈ పనిని విజయవంతం చేయాలంటే పూర్తి సమయాన్ని కేటాయించాలి, పూర్తిగా ఆ ప్రాజెక్టు కోసమే పని చేయాలనుకుంది. నిర్ణయానికి వచ్చిన తర్వాత జర్నలిస్టు ఉద్యోగాన్ని వదిలేసింది. 2011 ఆగస్టులో 'శక్తి ఫౌండేషన్' స్థాపించింది.



గుడ్డీ యానిమేషన్ ఫిల్మ్స్ ద్వారా ఆదివాసీ మహిళలను చైతన్యపరుస్తోన్న సోనాలీ రోచానీ

> ## కారణాలే వేరు... కష్టాలొకటే
>
> ఒకరోజు డ్యూటీలో భాగంగా గవర్నమెంట్ హాస్పిటల్‌కెళ్లాను. ఓ గర్భిణి నా దగ్గరకు వచ్చి సహాయం చేయమని కోరింది. కడుపులో ఉన్నది ఆడశిశువు అని తెలిసి అత్తింటి వారు అబార్షన్ చేయిస్తున్నారని చెప్పి ఏడ్చింది. తాను అబార్షన్ చేయించుకోనని, బిడ్డను కని తానే పెంచుకుంటానని, అత్తింటి మీద ఆధార పడకుండా బతకడానికి దారి చూపించమని వేడుకుంది. ఇలా ఏ ఒక్కరో కాదు, సమాజంలో ఇలాంటి దుస్థితిలో ఎంతోమంది ఉన్నారు. మైదాన ప్రాంతాల్లో మహిళ పరిస్థితి ఇలా ఉంటే, ఆదివాసీలది మరొక రకమైన దురవస్థ. భర్త సారాకు బానిసై మరణించడంతో ఆడవాళ్ల జీవితం అగమ్యగోచరమవుతోంది. కారణాలు ఏవైనా మహిళల కష్టాలన్నీ దాదాపుగా ఒకేరకంగా ఉంటున్నాయి. పెళ్లి పేరుతో ఒక మగవాడు వాళ్ల జీవితాల్లోకి వస్తున్నాడు కానీ, ఆ మహిళలకు భర్త ఉన్నాడనే భరోసా ఉండడం లేదు. దాంతో ఆడవాళ్లు తమను తాము పోషించుకోవడంతోపాటు పిల్లల పోషణ బాధ్యతను కూడా మోయాల్సి వస్తోంది. వాళ్లకు ఒక వేదిక కల్పించాలనే ఉద్దేశంతో శక్తి ఫౌండేషన్ స్థాపించాను. కష్టాల కూడలిలో నిలబడి జీవిత పయనానికి ఎటు వైపు సాగాలో తెలియక చేష్టలుడిగి నిస్సహాయంగా నిలబడిన ఆడవాళ్లకు ధైర్యం చెప్పడానికి, మహిళలు శక్తిహీనులు కాదని, మనసును ఆవరించిన నిస్సహాయతను తొలగించుకుని ముందుకు సాగాలని చెప్పడానికే నా ఫౌండేషన్‌కి శక్తి ఫౌండేషన్ అని పేరు పెట్టాను.
>
> **– సోనాల్ రోచానీ,**
> **శక్తి ఫౌండేషన్ నిర్వాహకురాలు**

**బడికి బాట వేసింది**

గుజరాత్ తూర్పు తీరాన ఎనిమిది జిల్లాల్లో ఆదివాసీలు ఎక్కువ. వారిలో నిరక్షరాస్యత, నిరుద్యోగం, పోషకాహార లోపం, మద్యసేవనం, బాల్య వివాహాలు, స్త్రీల పట్ల వివక్ష... అడుగడుగునా కనిపిస్తుండేవి. ప్రభుత్వం అనేది ఒకటి ఉంటుందని కూడా వాళ్లకు తెలియదు. ముఖ్యంగా హర్పతి, కోత్‌వాలియా ఆదివాసీ తెగల జీవనశైలి అయితే మరీ విచిత్రంగా ఉంటుంది. మగవాళ్లు సారా తాగి తాగి 35–40 ఏళ్లకే చనిపోతుంటారు. ఆడవాళ్లు పిల్లలను పెంచుకుంటూ కుటుంబాలను పోషించుకోవడానికి తంటాలు పడుతుంటారు. బతుకు తెరువు కోసం సంచార జీవనం సాగిస్తుంటారు. ఎంత కష్టపడినా రోజుకు వంద రూపాయలకు మించి సంపాదించే మార్గాల్లేవక్కడ. ఆ తల్లుల శక్తి బిడ్డలకు కడుపు నిండా తిండి పెట్టడానికే సరిపోదు, ఇక వాళ్లకు చదువు చెప్పించాలనే తలంపు ఎక్కడ నుంచి వస్తుంది? సోనాల్ తన పనిని అక్కడే మొదలు పెట్టింది. ఆ ఎనిమిది జిల్లాల్లో కలిపి 44 ఆశ్రమ పాఠశాలలను పెట్టించింది. ఇవన్నీ ప్రభుత్వ నిధుల ద్వారానే. నిర్వహణ మాత్రం శక్తి ఫౌండేషన్ చూసుకుంటుంది. ఆశ్రమ పాఠశాలల్లో మంచి భోజనం పెట్టిస్తూ ఆదివాసీ పిల్లల్లో పోషకాహార లోపాన్ని నివారించగలిగింది సోనాల్. పిల్లలకు భోజనం పెట్టి చదువు చెప్పే పని ప్రభుత్వం చూసుకుంటోంది. కాబట్టి తల్లులకు ఒక బరువు తగ్గినట్లయింది. సోనాల్ ప్రోగ్రామ్ షీట్‌లో రెండవ స్థానంలో ఉన్న అంశం... ఆడపిల్లలకు వ్యక్తిగత పరిశుభ్రత నేర్పించడం. అదే సమయంలో ఆడవాళ్లకు బతుకుదెరువుకు భరోసా కల్పించాల్సిన అవసరమూ ఉంది. ఈ రెండింటికీ కలిపి సానిటరీ నాప్‌కిన్‌లు తయారు చేసే యూనిట్‌లను పెట్టించింది సోనాల్. స్వయం సహాయక బృందాలను ఏర్పాటు చేసి చిన్న చిన్న యూనిట్‌లు పెట్టించి, వాటి వాడకం గురించి వారి చేతనే ప్రచారం చేయించింది. ఇక చివరగా చేయాల్సింది వారిలో సామాజిక చైతన్యం తీసుకురావడం. గుడ్డీ పాత్రతో ఆ పని చేస్తోంది సోనాల్. కామిక్ పాత్రతో రూపొందించిన షార్ట్ ఫిల్మ్ స్క్రీనింగ్, అదే గుడ్డీ పాత్ర కథనాలను బొమ్మలతో ప్రచురించి, ఆ పుస్తకాలను స్కూళ్లలో పంచుతోంది. అలా గుడ్డీ పాత్ర గుజరాత్ గ్రామాల్లో చదువుకుంటున్న బాలికలతోపాటు నిరక్షరాస్యులకు కూడా దగ్గరైంది.



వ్యక్తిగత పరిశుభ్రత అవగాహన కార్యక్రమంలో...

ఇంగ్లిష్‌లో పీహెచ్‌డీ, మాస్ మీడియాలో ఎనిమిదేళ్లు ఉద్యోగం చేసిన సోనాల్ గుజరాత్ రాష్ట్రమంతటా పర్యటించింది. కొండల్లో ఆదివాసీ సంచార జీవితాలను అధ్యయనం చేసింది. మైదానాల్లో నివసించే ఆధునిక మానవుడి జీవితాన్నీ గమనించింది. మహిళలు తాము మహిళలుగా పుట్టిన కారణంగా ఎదుర్కొంటున్న కష్టాలకు మైదానానికీ పర్వత ప్రాంతాలకు పెద్దగా తేడాలేదని గ్రహించిందామె. కారణాలు వేరుగా ఉంటున్నప్పటికీ మహిళ భుజాల మీదకు వచ్చి పడుతున్న భారంలో తేడా లేదు. ఆ పరిస్థితి నుంచి మహిళలను చైతన్యవంతం చేయడానికి ఆమె చేస్తున్న ప్రయత్నాలివి. సోనాల్ ప్రయత్నాలతో గుజరాత్‌లోని ఆదివాసీ మహిళలు సొంతంగా సంపాదించుకుంటున్నారు. వారిలో ఆరోగ్య స్పృహ పెరిగింది. తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ పెంచుకుంటున్నారు.

**– మంజీర**

---

**చెట్టు నీడ**

## గజేంద్రుడిలా గ్రహించాలి

గజేంద్రుడు మహా బలవంతుడు. ఎందరో భార్యలు, మరెందరో పరివారం. ఓ రోజున తన రాణులు, బంధుమిత్ర పరివార జనంతో కలసి తన పరివారంతో మోహంతో ఒక పెద్ద కొలనులో ఒడలు మరచి జలక్రీడలు సాగిస్తున్నాడు గజేంద్రుడు. సరిగ్గా అదే సమయంలో ఆకలిగొని ఉన్న ఓ మకరేంద్రుడి బారిన పడ్డాడు. ఎంత ఏనుగైనా, దాని బలం అడవిలో ఉన్నంతవరకే లేదా నేలమీద ఉన్నప్పుడే... అదే నీటిలో అడుగుపెడితే దాని బలం ఒక మామూలు మొసలి ముందు ఎందుకూ కొరగాదు మరి. మొసలినోట చిక్కిన కాలిని బలంగా గింజుకుంటున్న కొద్దీ మకరేంద్రుడి పట్టు బిగిసిపోతూ ఉంది. ఆత్మరక్షణ కోసం చేయవలసిన అన్ని ప్రయత్నాలూ చేశాడు గజేంద్రుడు. చివరికి ఇక తన వల్ల కాదనుకున్నాడు. భక్తితో విష్ణుమూర్తిని శరణు వేడాడు. వెంటనే పలకలేదని నిందాస్తుతి చేశాడు. ఆ తర్వాత విష్ణువు శరవేగంతో విచ్చేయడంతో



భక్తి ప్రపత్తులతో స్తుతించాడు. సంసార సాగరంలో ప్రాపంచిక పరివారంతో మనస్సుతో కూడి కదలాడుతున్న మానవునికి దర్పణం. గజేంద్రుడు మకరేంద్రుడి బారిన పడిన రీతిలో భవసాగరంలో క్రీడిస్తున్న మానవుడు ఆంతర్యామినే మరచి 'అహం' అనే మకరం నోటిలో చిక్కుకొని దుఃఖితుడవుతున్నాడు. గజేంద్రుడు తనని తాను రక్షించుకోవడానికి ప్రయత్నం ప్రారంభించినట్లుగానే మానవుడు కూడా అహం అన్న భావం నుండి బయటపడడానికి సాధన అనే ప్రయత్నం చేయాలి. నీటిలో మొసలికి బలం ఎక్కువ. సంసారంలో భోగలాలసత్వాన్ని అలవర్చుకున్న అహానికి కూడా పట్టు ఎక్కువే. ఈ అహం నుండి విడివడాలంటే మన సాధనాబలం మాత్రమే చాలదు. దైవానుగ్రహం కూడా కావాలని గజేంద్రునిలాగా గ్రహించి త్రికరణశుద్ధిగా ప్రార్థించాలి. అర్థించాలి. అప్పుడే మనం మనగలం.

**– డి.వి.ఆర్.**

---

**బ్యూటిప్**

### మెడమీద ముడతలు తగ్గాలంటే...

ప్రతిరోజూ రాత్రి పడుకునే ముందు క్లెన్సింగ్ మిల్క్‌లో ముంచిన కాటన్‌తో మెడను తుడిచి, ఆ తర్వాత టీ స్పూన్ కీరా దోసకాయ రసంలో టీ స్పూన్ ఆపిల్ వెనిగర్ కలిపిన మిశ్రమాన్ని మెడకు పట్టించాలి. ఉదయం చన్నీటితో కడిగేయాలి. ఇలా కనీసం మూడు వారాల పాటు చేస్తే క్రమంగా మెడ మీద నలుపు వదులుతుంది. ఆపిల్ వెనిగర్ చర్మాన్ని టైట్ చేస్తుంది, కీరదోస చర్మాన్ని కోమలంగా మారుస్తుంది.

---

## పరిసరాలను ముంచెత్తేసిన పెళ్లి!

ఎంత ఘనంగా పెళ్లి చేశారన్నది కాదు... విందు ఎంత గొప్పగా ఉందన్నదీ కాదు... విందు ఇచ్చిన పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా లేకపోతే మాత్రం భారీ పరిహారం చెల్లించక తప్పకపోవచ్చు ఇకపైన. ఇటీవల ఉత్తరాఖండ్ రాష్ట్రం ఔలీ ప్రాంతంలో ఓ అపర కుబేరుడి వివాహ వేడుక జరిగింది. భారీ ఖర్చుతో అంగరంగ వైభవంగా జరిగిన ఈ వేడుకలో చెత్త కూడా అంతే మొత్తంలో పోగవడమే అటు పెళ్లి వాళ్లకీ, ఇటు మునిసిపాలిటీ సిబ్బందికీ కూడా చిక్కులు తెచ్చిపెట్టింది. ప్రస్తుతం ఈ చెత్తను తొలగించలేక మున్సిపాలిటీ సిబ్బంది తల పట్టుకుంటున్నారు.







భారతదేశానికి చెందిన గుప్తా కుటుంబం కొన్ని దశాబ్దాలుగా దక్షిణాఫ్రికాలో స్థిరపడింది. రకరకాల వ్యాపారాలు చేస్తూ సంపన్న కుటుంబంగా ఎదిగింది. ఈ ఏడాది గుప్తాల ఇంట్లో రెండు పెళ్లిళ్లు జరిగాయి. ముందుగా ఉత్తరాఖండ్‌లోని ఔలీ ప్రాంతంలో శతకోటీశ్వరుడు అజయ్ గుప్తా కుమారుడు సూర్యకాంత్ వివాహం జరిగింది. కొద్దిరోజుల వ్యవధిలోనే అజయ్ సోదరుడు అతుల్ గుప్తా కుమారుడు శశాంక్ పెళ్లి జరిగింది. అత్యంత ఆడంబరంగా నిర్వహించిన ఈ వివాహ వేడుకలకు పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, బాలీవుడ్ నటులు, యోగా గురు బాబా రాందేవ్ సహా ఎందరో పెద్దలు, ప్రముఖులు హాజరయ్యారు.

పెళ్లి వేడుకల కోసం గుప్తా కుటుంబం ఔలీలోని హోటళ్లు, రిసార్టులను బుక్ చేసుకుంది. అయితే ఈ వేడుకల తర్వాత ఔలీలో ఎక్కడ చూసినా చెత్తే కన్పిస్తోందట. ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు ఎక్కడపడితే అక్కడ పడేశారట. వీరి వివాహం వల్ల దాదాపు 40 క్వింటాళ్ల చెత్త పోగైందని, ఈ చెత్తను శుభ్రం చేసేందుకు 20 మందితో ఓ బృందాన్ని నియమించామనీ అయినా సరే ఎక్కడపడితే అక్కడ ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు కన్పిస్తున్నాయనీ మున్సిపల్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. పెళ్లివారికి భారీ మొత్తంలో జరిమానా విధించాలని కూడా ఆలోచిస్తున్నారట.

మనలో మన మాట... ఇలాంటి వేడుకలు జరిగినప్పుడు ఈ విషయాన్ని గుర్తుంచుకుంటే కనీసం మనమైనా జాగ్రత్తగా ఉంటాం...

---

**జ్ఞాపకాల గది**

## అర్బన్ నోస్టాల్జిస్ట్‌లు

పాత మేడ.. ఇల్లు.. ఏదైనా సరే.. ఓ జ్ఞాపకం. మన పెద్దల కష్టానికి, మన బాల్యానికి, కుటుంబ అనుబంధాలకు! ఆలాంటి ఆస్తి చెమ్మపట్టి మెత్తగా జారిపోతుంటే.. పాడి రాలి చూరు కూలిపోతుంటే.. ప్రాణం పోయినంత పనవుతుంది. దాని కోసమే అమ్మానాన్నతో గొడవలు.. అన్నదమ్ములతో యుద్ధాలు.. అక్కాచెల్లెళ్లతో మాటపట్టింపులూ జాస్తే. అది వేరే విషయం. పట్టణాల్లో ఉన్న అలాంటి ప్రాపర్టీని రియల్ ఎస్టేట్ డెవలపర్స్‌కు ఇచ్చి అపార్ట్‌మెంట్స్‌లా మార్చకుండా.. కమర్షియల్ కాంపెక్స్‌లు కట్టకుండా.. ఆ పాత ఇంటి శోభ పెరిగేలా.. జ్ఞాపకాల ఊటను పదిలంగా కాపాడే మార్గం ఏమైనా ఉంటే? ఆ తలుపు తట్టకుండా ఉంటామా? వెంటనే చిరునామా వెదకమూ! అయితే కోల్‌కత్తాలోని అర్బన్ నోస్టాల్జిస్ట్‌ల గురించి తెలుసుకోవాల్సిందే! కోల్‌కత్తాలోని ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, ఆర్కిటెక్ట్స్, సౌందర్యాభిరుచి ఉన్న వ్యక్తులు కొందరు.. దాదాపు నలభై మంది కలిసి ఈ పని చేస్తున్నారు. ఇదిగో ఈ ఫోటోలే రుజువులు. బ్రిటిష్ విక్టోరియన్ నిర్మాణ శైలికి లోకల్ ఈస్తటిక్స్‌ను మేళవించి కట్టిన, అమ్మకానికి ఉన్న వందేళ్ల నాటి భవంతులు, ఇళ్లను ఈ అర్బన్ నోస్టాల్జిస్ట్‌లు తీసుకుంటున్నారు. పెద్ద హాళ్లు.. విశాలమైన వరండాలు.. ఎత్తయిన పైకప్పులు.. పొడుగు కిటికీలు.. మొజాయిక్ ఫ్లోరింగ్‌లు.. ఇలా ఆ భవనాల యాంటిక్, యూనిక్‌నెస్‌లను అంగుళం కూడా డిస్టర్బ్ చేయకుండా.. వాటిని అలాగే ఉపయోగించుకుని కొత్తగా మారుస్తున్నారు. ఆ ఇళ్ల ప్రత్యేకతను బట్టి బోటిక్ కమ్ హోటల్స్‌గా, ఆర్ట్ స్టూడియో, గ్యాలరీస్‌గా, రెస్టారెంట్ కమ్ లైబ్రరీగా, మీటింగ్ ప్లేసెస్‌గా, డ్రామా థియేటర్స్‌గా.. అంటే కొత్త ఆసామి ఆస్తకులు, అభిరుచులకు అనుగుణంగా తీర్చిదిద్దుతున్నారు. ''కొందరేమో అమ్మకుండా.. ఆధునిక హంగులను జోడిస్తూ రెనోవేషన్ కోరుకుంటున్నార''ని చెప్పారు ఈ నలభై మందిలో ఒకరైన మాళవికా బెనర్జీ. మొత్తానికి కోల్‌కత్తా నగరానికి ప్రత్యేకమైన ఆర్కిటెక్చర్‌ను కాపాడుకోవాలనుకునే యజమానులు రియల్ ఎస్టేట్ వ్యాపారుల దగ్గరకు వెళ్లకుండా ఈ అర్బన్ నోస్టాల్జిస్ట్‌లనే సంప్రదిస్తున్నారట.. ఆస్తిని అమ్ముకున్నా.. అదొక జ్ఞాపకంలా మదిలో మాత్రమే మిగలకుండా.. కంటిముందూ కనబడుతూండడంతో ఒకింత తృప్తి.. ఇంకెంతో నిశ్చింత అనుకుంటూ! ప్రస్తుతం కోల్‌కత్తాలో ఇలాంటి వాటికే డిమాండ్ పెరిగి. ఓ ట్రెండ్‌లా సాగుతోంది.. అర్బన్ నోస్టాల్‌జిస్ట్స్ అనే కొత్త పేరూ యాడ్ అయింది. వాళ్ల వెబ్‌సైట్స్‌కు ట్రాఫిక్ ఎక్కువైంది. ఇది కోల్‌కత్తా తీరం వెంట వైజాగ్‌కూ చేరి.. వయా విజయవాడ హైదరాబాద్‌కు రావడానికి ఇంకెంతో కాలం పట్టకపోవచ్చేమో! మంచిదే.. శుభ పరిణామమే!










సాక్షి ఫ్యామిలీ సినిమా
నల్లగొండ ॥ బుధవారం
10-7-2019

## లవ్ డాక్టర్ — నన్నడగొద్దు ప్లీజ్



ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ అన్నయ్యా! నేనొక అబ్బాయిని తొమ్మిదేళ్లుగా ప్రేమిస్తున్నాను. తనకీ నేనంటే ప్రాణం. కలిసి చదువుకున్నాం. అప్పటినుంచి ఎక్కడికైనా కలిసి వెళ్లేవాళ్లం. ఏ పనైనా కలిసి చేసేవాళ్లం. కలవకుండా ఒక్క రోజు కూడా ఉండలేం. చదువు అయిపోయింది. 25 సంవత్సరాలు వచ్చాయి. అందరి ఆశీర్వాదంతో ఆనందంగా పెళ్లి చేసుకుందామనుకున్నాం. వాళ్ళ ఇంట్లో, మా ఇంట్లో కూడా మా ప్రేమ విషయం చెప్పాం. వాళ్ళ అక్కబావలతో పాటు పెద్దలు కూడా వచ్చి.. మా పెళ్లి గురించి మా ఇంట్లో మాట్లాడారు. అమ్మానాన్నలు ఆనందంగా ఒప్పుకున్నారు. తర్వాత నాలుగు రోజులకు వాళ్ళ బావ వచ్చి మా అమ్మానాన్నలతో ''ఈ పెళ్లి జరగదు.. అబ్బాయి వాళ్ళ అమ్మకీ, మేనత్తకీ ఇష్టం లేదు (నేపథ్యాలు వేరు), మీ అమ్మాయిని మీరు ఒక మూడు నెలలు మరిపించండి, అబ్బాయిని మేము మార్చుకుంటాం.. అయినా అబ్బాయికి ఆస్తి లేదు. మీ అమ్మాయికి గొప్ప సంబంధాలు వస్తాయి'' అని చెప్పి వెళ్లిపోయారు. నేపథ్యాల పేరుతో మా ఇద్దరి జీవితాలు నాశనం చేయాలని చూస్తున్నారు. నాకూ, మా ఫ్యామిలీకీ ఆస్తి వద్దు, నేపథ్యాలు వద్దు.. ప్రేమ కావాలి.. మా భవిష్యత్ బాగుండాలి. మేము ఇద్దరం ఒకరిని వదిలి ఇంకొకరం ఉండలేం. మేము ఎక్కడికైనా వెళ్లి పెళ్లి చేసుకుంటే.. పరువు పోతుందని ఏం చెయ్యాలో తెలియక, దూరంగా ఉండలేక చాలా డిప్రెషన్‌లో ఉంటున్నాం. నన్ను పెళ్ళి చేసుకుంటే వాళ్ళ అమ్మ 'ఇంట్లోకి రానివ్వను' అని భయపెడుతోంది. తనకి వేరే సంబంధాలు చూస్తున్నారు. మా పెళ్లికి వాళ్ళ అమ్మ ఒప్పుకునేలా చెయ్యాలంటే ఏం చేయాలి? ఎలా అయినా మా పెళ్లి జరిగేలా సలహా చెప్పండి అన్నయ్యా ప్లీజ్!

– సుకన్య

చేసేసుకోండి!

*'సార్.. గొడవలు అయిపోతాయి సార్.. అనవసరంగా మీరు ఎమోషనల్ అయిపోయి ఇలాంటి స్ట్రాంగ్ అడ్వైజ్‌లు ఇస్తే.. వాళ్లందరూ వచ్చి మన క్లినిక్ పగలగొట్టి.. మీ మీద కూడా జులుం చేసి.. మీ మీసాలు పీకీ.. లాగి.. పీక మీద కత్తి పెట్టి.... సార్... మీకేమైనా అయితే నేను తట్టుకోలేను సార్.. నాకు ఇంకో లవ్ డాక్టర్ దొరికే దాకా అయినా ఇలాంటి బీభత్సమైన అడ్వైజ్‌లు ఇవ్వడం మానండి సార్!'*

సరే.. నీలూ.. నా మీసం కోసం కాకపోయినా.. నీ కోసం ఇంకో సాఫ్ట్ అడ్వైజ్ ఇచ్చి సుకన్యకు మంచి అన్నయ్యననిపించుకుంటాను నీలూ!

*'మీలో నాకు బాగా నచ్చే విషయం ఇదే సార్.. వెంటనే ఒపీనియన్ మార్చేసుకుంటారు. దేన్నీ గొప్పగా నమ్మరు. పెద్ద కమిట్‌మెంట్ కూడా చూపరు. చాలా ఈజీ గోయింగ్ టైప్ సార్ మీరు!'*

తిట్టడం ఆపు.. అక్కడ సుకన్య వెయిటింగ్.. చెల్లెమ్మా! ఇద్దరూ మనస్ఫూర్తిగా ప్రేమించుకుంటుంటే.. ఫ్యూచర్‌లో అబ్బాయి నీకు తోడుంటాడని నమ్మకం ఉంటే..

*'ఎందుకు సార్ మీకేమైనా అబ్బాయి విషయంలో డౌట్ అనిపిస్తుందా సార్? అదే వాళ్ల పేరెంట్స్‌తో 'చేసుకుంటే సుకన్యనే చేసుకుంటాను' అని గట్టిగా చెప్పి ఒప్పించడం లేదని.. కొంచెం డౌటా సార్..??'*

నువ్వు చెప్పిందీ నిజమే.. ప్రేమించడానికి వచ్చిన ధైర్యం.. ఇప్పుడెందుకు తోక ముడిచింది అన్న డౌట్ నా మైండ్‌లో కూడా మెదులుతోంది నీలూ.. అందుకే...

*'కరెక్ట్ సార్..! ఒక ఫ్రెండ్లీ లాయర్‌ని వెంట పెట్టుకుని పోలీస్ స్టేషన్‌కి పోయి విషయం ఇద్దరూ వివరిస్తే.. వాళ్లే ఇటు వీళ్లిద్దరికీ.. అటు ఇద్దరి పేరెంట్స్‌కీ కౌన్సెలింగ్ ఇచ్చి కరెక్ట్ డెసిషన్ తీసుకుంటారు కదా సార్?'*

నువ్వు.. నువ్వు.. నువ్వు.. నువ్వే నీలూ!!

**ప్రేమ, ఆకర్షణ, టీనేజ్ అనుబంధాల్లోని అయోమయం మిమ్మల్ని గందరగోళ పరుస్తుంటే ప్లీజ్ ఈ అడ్రస్‌కు మాత్రం అస్సలు రాయకండి. లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34.**
lovedoctorram@sakshi.com



మహేశ్‌బాబు

## సూపర్ ఆఫీసర్



సెట్లో మహేశ్

ఎంత కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినప్పటికీ షూటింగ్ లొకేషన్‌లోని ఫొటోలు బయటకు రాకుండా చిత్రబృందం ఆపలేకపోతోంది. అధికారికంగా విడుదల చేయకముందే హీరోల లుక్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారడం ఆయా చిత్రబృందాలను కలవరపెడుతోంది. తాజాగా మహేశ్‌బాబు హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందుతున్న 'సరిలేరు నీకెవ్వరు'కి సంబంధించిన ఓ ఫొటో బయటికొచ్చింది. ఈ సినిమాలో ఆర్మీ ఆఫీసర్‌గా నటిస్తున్నారు మహేశ్‌బాబు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ కశ్మీర్‌లో జరుగుతోంది. అక్కడి లొకేషన్ లోంచి బయటకు వచ్చిన ఫొటోను చూసి మహేశ్ ఫ్యాన్స్ సూపర్ ఆఫీసర్ అని సంబరపడుతున్నారు. ఈ కశ్మీర్ షెడ్యూల్ ముగిసిన తర్వాత హైదరాబాద్‌లో ఓ షెడ్యూల్‌ను ప్లాన్ చేశారు టీమ్. విజయశాంతి, రాజేంద్రప్రసాద్ తదితరులు నటిస్తున్న ఈ సినిమాకు దేవిశ్రీప్రసాద్ స్వరకర్త. 'దిల్' రాజు, రామబ్రహ్మం సుంకర, మహేశ్‌బాబు కలిసి నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల కానుంది.

## లవ్ ఫెయిల్యూర్స్ తట్టుకోలేవ్!



నాగార్జున, రకుల్

అవంతిక... పేరు చాలా సంప్రదాయబద్ధంగా ఉన్నప్పటికీ అమ్మాయి మాత్రం వేరేలా అన్నమాట. మొహమాటం లేకుండా సిగరెట్ కాల్చేస్తుంది. అలాంటి అవంతిక పద్ధతి గల అమ్మాయిలా కలరింగ్ ఇవ్వాల్సి వస్తుంది. కానీ అవంతిక అసలు రంగును మన్మథుడు ఇట్టే పసిగడతాడు? ఎలా? అనే అంశాలను వెండితెరపై చూసి తెలుసుకోవాలి. నాగార్జున, రకుల్‌ప్రీత్ సింగ్ హీరో హీరోయిన్లుగా రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా 'మన్మథుడు 2'. ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. ఇటీవల ఈ సినిమాలోని నాగార్జున క్యారెక్టర్‌కు సంబంధించిన టీజర్‌ను విడుదల చేశారు. తాజాగా రకుల్‌ప్రీత్ చేసిన అవంతిక పాత్రకు చెందిన టీజర్ విడుదలైంది. ఈ టీజర్‌లో 'ఇప్పటిదాకా యు – సర్టిఫికేట్‌ను ప్రయత్నించాను. ఇప్పుడు ఏ సర్టిఫికెట్ చూపిస్తా', 'ఈ వయసులో నువ్వు లవ్ ఫెయిల్యూర్స్ తట్టుకోలేవ్' అని రకుల్ పలికిన డైలాగ్స్ ఆడియన్స్‌కు కిక్ ఇస్తున్నాయ్. త్వరలో పాటలను విడుదల చేయాలనుకుంటున్నారు. నాగార్జున, పి. కిరణ్ నిర్మించిన ఈ సినిమా ఆగస్టు 9న విడుదల కానుంది.

## రాజీ లేదు



ఎన్టీఆర్

యాక్టింగ్ విషయంలోనే కాదు వర్కౌట్స్ పరంగానూ రాజీ పడేలా లేరు ఎన్టీఆర్. 'ఆర్ఆర్ఆర్' సినిమా కోసం ఫిట్‌గా ఉండడానికి జిమ్‌లో తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మిస్తున్న సినిమా 'ఆర్ఆర్ఆర్'. స్వాతంత్ర్య సమరయోధులు కొమురం భీం పాత్రలో ఎన్టీఆర్, అల్లూరి సీతారామరాజు పాత్రలో రామ్‌చరణ్ నటిస్తున్నారు. రామ్‌చరణ్ సరసన ఆలియా భట్ కథానాయికగా నటిస్తున్నారు. ఎన్టీఆర్ సరసన హీరోయిన్ ఇంకా ఫైనలైజ్ కాలేదు. ఈ సినిమా చిత్రీకరణ దాదాపు 40 శాతం పూర్తయిందని సమాచారం. నెక్ట్స్ షెడ్యూల్ పుణే, అహ్మదాబాద్ ప్రాంతాల్లో ప్రారంభం కానుంది. ఈలోపు జిమ్‌లో తీవ్రమైన కసరత్తులు చేస్తున్నారు ఎన్టీఆర్. ఈ విషయాన్ని ఎన్టీఆర్ జిమ్ ట్రైనర్ స్టీవెన్ లాయిడ్స్ సోషల్ మీడియా ద్వారా తెలియజేశారు. 'అరవిందసమేత వీర రాఘవ' సినిమా సమయంలోనూ ఎన్టీఆర్‌కి ట్రైనర్‌గా స్టీవెన్ వ్యవహరించిన విషయం గుర్తుండే ఉంటుంది.

## డబ్బుల్ పెట్టలేదు

ఇండస్ట్రీలో మంచి ఫామ్‌లో ఉన్న టాప్ లిస్ట్ హీరోయిన్ తమన్నా ఇటీవల ముంబైలో ఓ ఫ్లాట్ కొనుగోలు చేశారు. తమన్నా ముంబైలో ఇల్లు కొన్నారన్న వార్త కన్నా.. ఆమె ఆ ఫ్లాట్‌ను అక్కడ ఉన్న సాధారణ ఖరీదు కన్నా రెట్టింపు ధర చెల్లించి కొన్నారనే వార్త హాట్ టాపిక్‌గా మారింది. ఈ బ్యూటీ కొన్న ఫ్లాట్‌లోని ఏ వ్యూ నుంచి చూసినా సముద్రం కనిపిస్తుందట. అందుకే తమన్నా ఆ అపార్ట్‌మెంట్ కోసం అంత ఖర్చు చేశారన్నది బీ టౌన్ టాక్. ఈ విషయంపై తమన్నా స్పందిస్తూ – ''నేను ముంబైలో కొత్త ఫ్లాట్ కొన్నమాట వాస్తవమే. కానీ ప్రచారంలో ఉన్నట్లు డబుల్ అమౌంట్ మాత్రం పెట్టలేదు. ఇదే విషయమై మా హిందీ టీచర్ నాకు మొబైల్‌లో మెసేజ్ చేశారు. కాస్త ఆశ్చర్యానికి గురయ్యాను'' అని వాపోయారు తమన్నా. ఇంకా కొత్త ఇంటి విశేషాలను చెబుతూ– ''ప్రస్తుతం ఫ్లాట్ లోపలి వర్క్ జరుగుతోంది. పూర్తి కాగానే గృహప్రవేశం చేస్తాం. నార్మల్ లైఫ్‌ని లీడ్ చేయడానికే నేను ఇష్టపడతాను'' అని చెప్పుకొచ్చారు.



తమన్నా

## లీడర్ వర్సెస్ క్యాడర్

"ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం మన భారతదేశం. అలాంటి మన దేశం ఈ రోజు ప్రజాస్వామ్యంతో మనగలుగుతుందా? అనే ప్రశ్న మనకు మనం వేసుకుంటే లేదనే చెప్పాలి. ఎందుకంటే ఈ రోజు నోటుకు ఓటు అన్నట్లు అయింది. ఈ రకంగా చేయటం వల్ల విత్తు ముందా చెట్టు ముందా అన్నట్టుగా నాయకుల తప్పా, ప్రజల తప్పా? అనే ప్రశ్న తలెత్తుతోంది" అన్నారు ఆర్. నారాయణమూర్తి. స్నేహచిత్ర పతాకంపై స్వీయ దర్శకత్వంలో ఆర్. నారాయణమూర్తి నటించి, రూపొందించిన చిత్రం 'మార్కెట్లో ప్రజాస్వామ్యం' ఈ శుక్రవారం విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆర్. నారాయణమూర్తి చెప్పిన విశేషాలు.

– గతంలో ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా మంచి నాయకుడిని తమకు అండదండలుగా ఉండే నాయకుడిని ఎన్నుకొనేవారు. తర్వాతి కాలంలో ఆ వాతావరణాన్ని పూర్తిగా నాశనం చేశారు ఈ రోజు వచ్చిన నాయకులు. ఎందుకు ఆ మాట అంటున్నానంటే ఈ రోజు ఎవరైతే నాయకుడు ఎన్నికల్లో పోటీ చేస్తున్నాడో అతనికి తను పోటీచేసే నియోజకవర్గం ఎల్లలు కూడా తెలియటం లేదు. కారణం వారు ఏదో ఒక వ్యాపారంలో కోట్లు గడించి రాజకీయాల్లోకి వస్తున్నారు. పోటీ చేస్తున్నవారు లోకల్ వాళ్లు కాకపోతే అక్కడి ప్రజలకు ఏ సమస్యలు ఉన్నాయో వారికెలా తెలుస్తుంది. రాజకీయం అనేది సర్వీస్ మోటో, అది కాస్తా ఇప్పుడు బిజినెస్ మోటోగా మారిపోయింది. కోట్లు ఖర్చు పెట్టి మరీ రాజకీయాల్లోకి వస్తున్నారు. వారు పెట్టిన డబ్బును తిరిగి సంపాదించటానికి తప్పుదోవలో ప్రయాణిస్తున్నారు. అప్పుడు ఇది ప్రజాస్వామ్యం ఎట్లా అవుతుంది. ధనస్వామ్యం అవుతుంది కానీ... అలా కాకూడదు అని చెప్పేదే నా ఈ 'మార్కెట్‌లో ప్రజాస్వామ్యం'.

– ఈ సినిమాని ప్రేక్షకులు ఎందుకు చూడాలి అంటే కారణం ఉంది. ఆ రోజుల్లో మొదటగా రాచరికం ఉండేది, తర్వాత నియంతృత్వం వచ్చింది. ఆ దశ నుండి మిలటరీ రూల్, అక్కడినుండి కమ్యూనిస్ట్ రూల్ (కొంతమంది కలిసి పరిపాలించటం) తర్వాత వచ్చిందే ప్రజాస్వామ్యం. అన్నింటిలోకి గొప్పది గవర్నమెంట్ పరిపాలించే బెస్ట్ రూల్ ప్రజాస్వామ్యం. అది అత్యంత శాంతియుతమైనది.



ఆర్. నారాయణమూర్తి

### హ్యాట్సాఫ్ టు వై.ఎస్. జగన్

నేను ఈ రోజు మన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్. జగన్ మోహన్ రెడ్డి గారిని అభినందిస్తున్నాను. చాలామంది నాయకులు మీ పార్టీలోకి వస్తామంటే ఆయన 'ముందుగా మీరు మీ పదవులకు రాజీనామాలు చేయండి. అప్పుడు పార్టీలో చేరండి. అంతేగానీ ఫిరాయింపులు మాత్రం వద్దు' అని తేల్చి చెప్పారు. నా సినిమా కూడా ఫిరాయింపులకు వ్యతిరేకంగా తీసిన సినిమానే. అందుకే హ్యాట్సాఫ్ టు జగన్‌మోహన్‌రెడ్డి గారు. అదేవిధంగా కె.సి.ఆర్ గారు కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ప్రారంభించిన రోజున ఎగువన ఉన్న మహారాష్ట్ర సీయంను దిగువన ఉన్న ఆంధ్రప్రదేశ్ సీయంను ఆహ్వానించి ఇరు రాష్ట్రాల సీయంలతో పాటు శంకుస్థాపన చేయటం రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు మహదానందకరమైన విషయం. అలాగే కె.సి.ఆర్‌గారు, జగన్‌గారు కూర్చొని రెండు రాష్ట్రాల్లో నీరు వృథాగా పోకుండా ఎక్కడెక్కడ డ్యామ్‌లు నిర్మించవచ్చో చర్చించినందుకు హ్యాట్సాఫ్ టూ బోత్ చీఫ్ మినిస్టర్స్.

చదువుకున్నవాడు, చదువు లేనివాడు, ఉన్నవాడు, లేనివాడు.. అందరికీ ఒకేరకమైన హక్కు మన ప్రజాస్వామ్యం మనకు కలిగించింది. అందరి ఓటు విలువ ఒక్కటే. 100 కోట్లు పెట్టగలిగే వారు భారతదేశంలో 10 శాతం మాత్రమే. 90 శాతం మందికి అంత స్తోమత లేదు. ఆ కారణంగా ఈ పదిశాతం మందే మనల్ని పాలిస్తామంటే కుదరదు. 10 శాతం ఉన్నవాళ్లు పరిపాలించే దౌర్భాగ్య స్థితి నుంచి 90 శాతం ప్రజలు పరిపాలించే రోజు వస్తేనే ఇది ప్రజాస్వామ్యం అవుతుంది. ఈ విషయాన్నే సినిమాలో చూపించాను.

– ఈ సినిమాలో నా పాత్ర పేరు అంజిబాబు. ఓ రాజకీయ పార్టీకి క్యాడర్లో 40 సంవత్సరాలుగా సపోర్ట్ చేసే నాయకునిగా ఉండే పాత్ర నాది. ఈ సినిమాలో ఇసుక మాఫియాని అరికట్టే ప్రయత్నంలో లీడర్‌నే ఎదిరించే పాత్రను చేశాను. సినిమా కథ ఒక్క మాటలో చెప్పాలంటే లీడర్ వర్సెస్ కేడర్. ఓ రకంగా ఇది రామాంజనేయ యుద్ధం లాంటి కథ ఇది. మంచి డ్రామా ఉంటుంది. సినిమాలో మొత్తం ఆరు పాటలు ఉన్నాయి. 4 పాటలు పెద్ద హిట్ అయ్యాయి. గద్దర్ అన్న రాసిన పాటను విమలక్క పాడారు. సుద్దాల అశోక్ తేజ గారు ఓ పాట రాశారు. ఆ పాటను మనో పాడారు. గణికంటి రాజలింగం ఓ పాట రాశారు. ఆ పాటను 'వందేమాతరం' శ్రీనివాస్ పాడారు. గోరేటి వెంకన్న రెండు పాటలు రాశారు, అందులో ఓ పాటను ఆయనే పాడారు.

## అన్న దొరకడంలేదు.. తమ్ముడు కావాలన్నారు



ఆనంద్ దేవరకొండ

"మా అన్న (విజయ్ దేవరకొండ) చాలా ఇబ్బందులు చూశాడు. కానీ, తనకు వచ్చిన సక్సెస్ నాకు ధైర్యాన్నిచ్చింది. ప్రతిభ ఉంటే విజయం సాధించొచ్చనే నమ్మకం కలిగింది" అని ఆనంద్ దేవరకొండ అన్నారు. కె.వి.ఆర్ మహేంద్ర దర్శకుడిగా పరిచయమవుతున్న చిత్రం 'దొరసాని'. ఆనంద్ దేవరకొండ, శివాత్మిక జంటగా నటించారు. డి.సురేశ్‌బాబు సమర్పణలో 'మధుర' శ్రీధర్ రెడ్డి, యశ్ రంగినేని నిర్మించిన ఈ సినిమా ఈ నెల 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆనంద్ దేవరకొండ చెప్పిన విశేషాలు.

- అన్న చేసిన 'అర్జున్ రెడ్డి' తర్వాత కొంతమంది మా నాన్నకి ఫోన్ చేసి, మీ పెదబాబు డేట్స్ దొరకడం లేదు.. చినబాబు దొరుకుతాడా? అని అడిగారు. అప్పుడు నేను అమెరికాలో ఉన్నా. వారి మాటలను అప్పుడు సీరియస్‌గా తీసుకోలేదు. అన్నయ్య వ్యాపారాలను సపోర్ట్ చేద్దామని ఉద్యోగం వదిలి ఇండియాకి వచ్చాను.
- నేను అమెరికాకు వెళ్లక ముందు థియేటర్స్ చేశాను. నటనలో అనుభవం ఉంది కానీ కెమెరా ముందు లేదు. ఆ టైమ్‌లో మహేంద్రను కలిశాక నటనపై ఉన్న భయాలు పోయాయి. ఆయన 5 గంటలు కథ చెప్పాడు. 'దొరసాని' సినిమా చేసినందుకు గర్వంగా ఉంది.
- 1980లో జరిగే ఒక పీరియాడిక్ లవ్ స్టోరీ ఇది. రాజు, దొరసాని మధ్య జరిగిన ప్రేమకథ. కథలోని స్వచ్ఛత, నిజాయతీ ఈ ప్రేమకథను ముందుకు నడిపిస్తాయి. అన్నీ రియల్ లొకేషన్స్‌లో షూట్ చేశాం.
- విజయ్ దేవరకొండ తమ్ముడు ఆనంద్ ఉన్నాడని సినిమా సర్కిల్‌లో తెలుసు. ఈ కథ కోసం ఆర్టిస్టులను వెతుకుతున్నప్పుడు నన్ను ట్రై చేద్దామనుకున్నారు. నేను, శివాత్మిక ఆడిషన్స్ చేశాం. ఆ పాత్రలకు సరిపోతాం అనే నమ్మకం దర్శక, నిర్మాతలకు వచ్చాకే మమ్మల్ని తీసుకున్నారు.
- ఇందులో నా పాత్ర నిజ జీవితానికి దగ్గరగా ఉంటుంది. ధనవంతురాలైన దొరసానిని ప్రేమించిన పేదవాడైన రాజు చాలా సహజంగా అనిపిస్తాడు. ఈ సినిమాలో యాక్షన్, యాంగర్, లిప్‌లాక్‌లు లాంటివి ఏమీ ఉండవు.
- అన్నకు, నాకు సినిమాలంటే చాలా పిచ్చి. నాన్న టీవీ షోలు, సీరియల్స్ డైరెక్ట్ చేసేవారు. స్కూల్ డేస్ నుంచే అన్న స్టోరీలు రాసేవాడు. తను యాక్టర్ కాకపోతే డైరెక్టర్ అయ్యే వాడేమో బహుశా!
- 'దొరసాని' కథను ఓకే చేశాక నిర్మాతలు పూర్తి ఫ్రీడమ్ ఇచ్చి మా బాధ్యతను మరింత పెంచారు.
- నా తర్వాతి సినిమా కోసం రెండు కథలు విన్నాను. వాటిల్లో వినోద్ ఆనంద్ దర్శకత్వంలో ఒకటి. ఆగస్టులో ఈ సినిమా ప్రారంభించాలనుకుంటున్నాం. నాకు ఏదైనా పాత్ర కరెక్టుగా సరిపోతుందని అన్నయ్యకి అనిపించి, నన్ను చేయమని సలహా ఇస్తే తప్పకుండా చేస్తా.







సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
బుధవారం ॥ 10-7-2019

# జర్నలిస్ట్ కావాలనుకున్నా

**ఎనిమిదవ తరగతిలోనే టీవీ సీరియల్స్‌కు పరిచయం అయిన సాధన బుల్లితెర ప్రేక్షకులను తన నటనతో ఆకట్టుకుంటోంది. జీ తెలుగులో 'ప్రేమ,' జెమినీ టీవీలో 'రెండు రెళ్ల ఆరు' సీరియల్స్‌లో నటిస్తున్న సాధన చదువులోనూ రాణిస్తోంది. వర్క్ గ్యాప్‌లో చదువుకుంటూ ఇటు నటనని, అటు చదువునూ బ్యాలెన్స్ చేసుకుంటూ ముందుకు సాగుతున్న సాధన చెబుతున్న ముచ్చట్లివి.**





సీరియల్

**● ఇండస్ట్రీతో పరిచయం?**

మా అమ్మ టీవీ ఆర్టిస్ట్. నేను చిన్నగా ఉన్నప్పుడు అమ్మతో పాటు లొకేషన్స్‌కి వచ్చేదాన్ని. అలా ఒకరోజు టీవీ వాళ్లు నా ఆడిషన్స్ తీసుకున్నారు. అలా ఈ ఫీల్డ్‌కి స్కూల్ డేస్‌లోనే నేనూ పరిచయం అయ్యాను. పుట్టింది ఖమ్మం. చదువు అంతా సాగింది హైదరాబాద్‌లోనే. చిన్నప్పుడు డ్యాన్స్ అంటే విపరీతమైన ఇష్టం ఉండేది. చాలా బాగా డ్యాన్స్ చేసేదాన్ని. దీంతో ఏదో ఒక రోజు ఫేమ్ వస్తుంది, మానొద్దు అని ఇంట్లో ఎంకరేజ్ చేస్తుండేవారు. అనుకోకుండా ఒక అవకాశం రావడంతో ఇలా మీ అందరి ముందుకు వచ్చే అదృష్టం దక్కింది. సీరియల్ వర్క్స్‌తో పాటు ఎంబీఏ సెకండియర్ చేస్తున్నాను.

**● ఫీల్డ్‌లో ప్లస్‌లు మైనస్‌లు?**

ఏ కెరియర్ తీసుకున్నా ప్లస్‌లూ మైనస్‌లు అంతటా ఉంటాయి. అన్నింటా మన వ్యక్తిత్వమే మెయిన్. ఇక్కడ నా వర్క్ విషయానికి వస్తే ఉదయం 6:30 గంటలకు లొకేషన్‌లో ఉంటాను. మళ్లీ రాత్రి 9 గంటలకు ప్యాకప్ చెప్పేంతవరకు అక్కడే ఉంటాను. నెలలో ఇరవై రెండు రోజులు ఇలాగే వర్క్ ఉంటుంది. నిద్ర ఉండదు. రోజులో నాలుగైదు గంటలు పడుకుంటాను. కానీ, ఇదే నా ప్రపంచం. ఈ వర్క్ లేకపోతే నన్ను నేను ఊహించుకోలేను. నెలల తరబడి ఒక సీరియల్‌కి వర్క్ చేస్తాం. రేటింగ్ బట్టి ఒక్కో సీరియల్ ఐదేళ్లు కూడా పడుతుంది. సీరియల్ టీమ్ అంతా కొన్ని రోజుల్లోనే ఫ్యామిలీ మెంబర్స్ అయిపోతాం.. డ్రైవర్ నుంచి మేకప్ మ్యాన్, లైట్ బోయ్ వరకూ.. అంతా ఒకే కుటుంబం. చివరగా సీరియల్ పూర్తయ్యి గుమ్మడికాయ కొట్టిన రోజు మాత్రం చాలా బాధగా అనిపిస్తుంది. అలాంటి టైమ్‌లో రెండు–మూడు సార్లు ఏడ్చేశాను కూడా. ప్రతిరోజూ లొకేషన్‌లో ఫన్నీ థింగ్స్ ఉంటూనే ఉంటాయి. కొన్ని చిన్న చిన్న గొడవలుంటాయి. మా రోల్స్‌ని మిగతావాళ్లు ఇమిటేట్ చేసి ఉడికిస్తుంటారు. సీనియర్స్ కూడా మమ్మల్ని ఇమిటేట్ చేస్తుంటారు. చాలా సరదాగా గడిచిపోతుంది.

**● రియల్ లైఫ్‌లో ప్లస్‌లు మైనస్‌లు?**

నా చిన్నప్పుడే అమ్మానాన్న విడిపోయారు. మొదట అక్క పుట్టినప్పుడే 'ఆడపిల్ల' అని నాన్న చాలా ఫీలయ్యారంట. నేనూ ఆడపిల్లను అనేసరికి నాన్న మమ్మల్ని వదిలి వెళ్లిపోయాడు. అయినా అమ్మ బాధపడలేదు. మా అమ్మే నాన్న అయి మమ్మల్ని పెంచింది. అక్కను డాక్టర్ని చేసింది. నేను యాక్టర్‌ని అయ్యాను. మా భవిష్యత్తు గురించి అమ్మ పడే తపన వల్లే మేమీ రోజుకు ఇలా ఉన్నాం. మా జీవితంలో అమ్మ పెద్ద ప్లస్. అమ్మ లేకపోతే మేం లేం.

**● ఇన్నేళ్ల కెరియర్‌లో బాగా నచ్చిన పాత్ర?**

'రెండు రెళ్ల ఆరు' సీరియల్‌లో కృష్ణ పాత్ర అంటే నాకు చాలా ఇష్టం. కృష్ణ ఒక జర్నలిస్ట్ క్యారెక్టర్. ఆ పాత్ర చాలా పవర్‌ఫుల్. డైనమిక్. ఒక అమ్మాయి ధైర్యవంతురాలిగా ఎలా ఉండాలో చూపుతుంది. అన్యాయం జరిగితే తట్టుకోదు. ఎవరైనా తప్పు చేస్తే ఊరుకోదు. అస్సలు రాజీ పడదు. నేనూ రియల్ లైఫ్‌లో జర్నలిస్ట్ అయితే బాగుంటుంది అని చాలా సార్లు అనుకునేదాన్ని. ఎన్నో స్టోరీస్ కవర్ చేయచ్చు, ప్రజలకు సాయంగా ఉండచ్చు అనిపించేది. ఆ ఇష్టం ఇప్పుడీ పాత్ర ద్వారా తీరింది. యాక్టింగ్ ఫీల్డ్‌లో ఉన్న అడ్వాంటేజీ ఏంటంటే రియల్ లైఫ్‌లో ఉన్న డ్రీమ్స్‌ని ఇలా కొద్దిగానైనా సాటిస్‌పై చేసుకోవచ్చు.

**● కన్నడ హీరోయిన్స్‌కే ఇక్కడ అవకాశాలు ఎక్కువ?**

నిజమే, తెలుగు వారికి తెలుగులో అవకాశాలు లేకుండా పోయాయి. ఇక్కడ వాళ్లలో ఏం తక్కువైందో తెలియడం లేదు. వేరేవాళ్లను ఎందుకు ఎంకరేజ్ చేస్తున్నారో తెలియదు. లేదంటే, మనవాళ్లు కూడా చాలా మంది భయపడి ఈ ఇండస్ట్రీకి రావట్లేదేమో అనిపిస్తుంది.

**● షూటింగ్ లేకపోతే..?**

ఫుల్‌గా నిద్రపోతాను. కాస్త తీరిక అనిపిస్తే వంట చేస్తాను. బాగా వండుతాను. అమ్మ, అక్క నా వంటను చాలా ఎంజాయ్ చేస్తారు. ఆ తర్వాత నాకు నచ్చిన డ్యాన్స్ ఉండనే ఉంది. అక్కతో కలిసి షటిల్ ఆడటం చాలా బాగుంటుంది. అమ్మ, నేను, అక్క కూర్చుంటే కబుర్లతో సమయమే తెలియదు.

– నిర్మలారెడ్డి

గ్రేట్ ఇండియన్ సీరియల్స్-24



● రజని

# వినియోగదారుల అక్కయ్య

**80ల కాలంలో వినియోగదారులకు ఒక అక్కలా మార్గం చూపించిన పాత్ర రజని. తూనికల్లో, కొలతల్లో ఆటో చార్జీలలో, స్కూలు ఫీజుల్లో మధ్య తరగతివాడు ఎలా మోసపోతున్నాడో, నష్టపోతున్నాడో చూపించి, మేల్కొల్పిన పాత్ర రజని. వినియోగదారుల ఉద్యమం దేశంలో ఉవ్వెత్తున ఎగిసేలా చేసిన ఈ పాత్ర, పోషించిన నటి ప్రియా టెండూల్కర్ ఎప్పటికీ గుర్తుండిపోతారు.**

'రజని' సీరియల్ అనగానే గంజిపెట్టిన చిన్న అంచు కాటన్ చీరలు, ముడివేసిన కొప్పు, నుదుటన పెద్దబొట్టు..' నాటి ప్రేక్షకుల మదిలో ఓ మధ్యతరగతి గృహిణి ఇమేజ్ అలాగే కళ్లముందు నిలిచిపోయింది. అలాగే, మొదటిసారి వినియోగదారుల హక్కుల విషయంలో అవగాహన కలిగించడానికి 'రజని' సీరియల్‌తో పెద్ద సాహసమే చేసింది దూరదర్శన్.

## సామాన్యుని పెన్నిధి 'రజని'

దూరదర్శన్‌లో వచ్చే సీరియల్స్ నాడు విభిన్న తరహా కాన్సెప్ట్‌తో ప్రేక్షకులను అలరిస్తూ ఉండేవి. అలాంటి సమయంలో ముంబయ్ చిత్ర దర్శకుడు బసు ఛటర్జీకి ఒక ఆలోచన వచ్చింది. రచయిత కరన్ రజ్దాన్, అనిల్ చౌదరీలు ఛటర్జీ ఆలోచనను పంచుకున్నారు. సామాన్య మానవుడు ఎదుర్కొనే కష్టనష్టాలను రాసుకున్నారు. పిల్లాడికి స్కూల్లో అడ్మిషన్ కావాలన్నా, ఇంటికి సమయానికి గ్యాస్ సిలిండర్ రావాలన్నా, నిత్యావసర సరుకుల కొనుగోలులో మోసాలున్నా, ఆటో–రిక్షా డ్రైవర్ల ఆగడాలను కట్టిపెట్టాలన్నా.. ఇవన్నీ సామాన్యుడు ఎదుర్కొనే సమస్యలే. ఇవన్నీ ఆ సామాన్యుడు ఎదురు తిరిగితేనే వాటికి అడ్డుకట్ట వేయడం సాధ్యం. ఆ సామాన్యుడు మగ అవడం కంటే 'ఇల్లాలు' అయితే.. అలా ఆ ఆలోచన నుంచి పుట్టిందే 'రజని.'

ఏడాదికి సరిపడా కథనాలు సిద్ధమయ్యాయి. అవినీతి వ్యవస్థపై పోరాటం, సామాజిక సమస్యలను పరిష్కరించడంలో ముందుండే రజని 1985లలో బుల్లితెరపై ప్రతీ ఆదివారం ఉదయం ప్రేక్షకుల ముందుకు వచ్చేది.

## నిజాల నిగ్గు తేల్చే గృహిణి

రజని ఒక ఆవేశపూరితమైన మహిళ. ఆమె దేనికీ భయపడదు. అన్యాయం ఎక్కడ జరిగినా ఎదిరిస్తుంది. నిజాల నిగ్గు తేలుస్తుంది. ఆమె కుటుంబం మొదట కంగారుపడుతుంది తప్ప, ఎదురు చెప్పదు. తమ చుట్టుపక్కల పిల్లలకి స్కూల్‌లో అడ్మిషన్ కావాలన్నా, టెలిఫోన్ కనెక్షన్ కావాలన్నా, ఆటో, రిక్షా డ్రైవర్ల సమస్య అయినా.. జనం తరపున పోరాడటానికి రజని ముందుంటుంది. రాజకీయ నాయకులు, పోలీసు అధికారులను సైతం హెచ్చరించడానికి ఆమె ఏ మాత్రం వెనుకాడదు. చెడును చూసినప్పుడు వెనకడుగువేసే ప్రసక్తేలేదు. ధైర్యంగా పోరాడుతుంది. వ్యవస్థతో పోరాడటానికి తన గొంతుకను వినిపించడానికి ఏ మాత్రం వెను కంజవేయదు. 'మగవాడు ఎంతటి కఠిన మార్గం మీదనైనా వెళతాడు, ఆడది అతణ్ణి అనుసరించాలి' అని చెప్పే పెద్దల నీతి మాటలను రజని తప్పని చూపుతుంది. మార్గం ఎవరికైనా ఒకటే అని రుజువుచేస్తుంది.

## దారితీసిన ఉద్యమాలు

'రజని' ఆదివారం ఉదయం టిఫిన్ ముగించుకునే సమయానికి వచ్చేది. అరగంటపాటు అర్థవంతమైన సమస్యలపై సామాన్య మానవుడు పడే అగచాట్లను చూపేది. అన్ని ఎపిసోడ్లలో బాగా పాపులర్ అయిన ఎపిసోడ్స్..

వంటకు ఉపయోగించే ఎల్‌పీజీ సిలిండర్ సమస్య. ఇప్పటిలాగా నాటి రోజుల్లో బుక్ చేసిన రెండు రోజుల్లోనే గ్యాస్ వచ్చేది కాదు. రోజుల తరబడి ఎదురు చూడాల్సి వచ్చేది. ఆ సమయంలో ఇల్లాళ్లు పడే ఇక్కట్లు అన్నీ ఇన్నీ కావు. అంతేకాదు, సిలిండర్ డెలివరీచేసే ఏజెంట్లు సృష్టించే సమస్యలూ ఇన్నీ అన్నీ కావు. సామాన్య మానవుల కష్టాలు కాబట్టి ఇది అందరి నాడిని పట్టుకుంది. ముంబయ్‌కి చెందిన 'ఆల్ ఇండియా ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్స్ ఫెడరేషన్' ఈ షోకి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేసింది.

మరో ఎపిసోడ్‌లో.. టాక్సీ డ్రైవర్ల వేధింపులు. 'తమవి చెడ్డ పాత్రలుగా సృష్టించారని, క్షమాపణ చెప్పి తీరాల్సిందే అని ముంబయ్‌లో 500 మంది టాక్సీ డ్రైవర్లు ఒక ఉద్యమంగా నడుస్తూ దూరదర్శన్ కార్యాలయానికి వెళ్లారు. రజని ప్రభావం ఎంతటిదంటే ఓ నిశ్శబ్ద విప్లవానికి దారితీసింది. భారతీయ బుల్లితెర చరిత్రలో 'రజని' ఎప్పుడూ చెప్పుకోదగిన పాత్రగా మిగిలిపోతుంద'ని దర్శకుడు ఛటర్జీ గుర్తుచేసుకున్నారు.

### ప్రియా 'రజనీ' టెండూల్కర్

ప్రియ తన బాల్యం నుండే కళలు, సంస్కృతి పట్ల మొగ్గు చూపేవారు. ఆమె తండ్రి ప్రముఖ రచయిత, పద్మ భూషణ్ అవార్డు గ్రహీత విజయ్ టెండూల్కర్. ముంబయ్‌లోనే పుట్టి పెరిగారు. పద్నాలుగేళ్ల వయసులో మొదటిసారి మరాఠీ స్టేజీ మీద నటించింది. ఆ తర్వాతి కాలంలో .. ఫైవ్‌స్టార్ హోటల్‌లో రిసెప్షనిస్ట్, ఎయిర్ హోస్టెస్, పార్ట్–టైమ్ మోడల్, న్యూస్ రీడర్.. ఇలా భిన్నమైన ఉద్యోగాలు చేసింది.1974లో శ్యామ్ బెనెగల్ 'అంకుర్' సినిమాలో నటించింది. ఆ తర్వాత వరసగా డజన్ మరాఠీ సినిమాల్లో అవకాశాలు వచ్చాయి. ఒక కన్నడ సినిమాలోనూ నటించింది. 1985లో 'రజని' టీవీ సీరియల్ ద్వారా ఇండియా మొత్తం ప్రియ పరిచయం అయ్యింది. ఆ తర్వాత కొన్నాళ్లకు 'స్వయంసిద్ధ' అనే టీవీ సిరీస్‌లోనూ నటించింది. ప్రియ సహజంగానే స్వేచ్ఛావాది. సామాజిక కార్యకర్త కూడ. సామాజిక సమస్యల మీద ఎలాంటి భయం లేకుండా తన భావాలను బయటపెట్టేది. ప్రియా నిర్వహించే 'జిమ్మెదార్ కౌన్'అనే టాక్ షోలో ఆమె ఒక మండే అగ్నికణంలా ప్రేక్షకులకు కనిపించేది. 'పూజ న ఫూల్' అనే గుజరాతీ సినిమాలోనూ ముఖ్యపాత్ర పోషించారు ప్రియ. ఆ మూవీ ద్వారా పెద్ద విజయాన్ని అందుకుంది. రజనీ సీరియల్‌లో సహనటుడైన కరణ్ రాజ్దాన్‌ను 1988లో పెళ్లి చేసుకున్న ప్రియ కుటుంబ కలహాలతో 1995లో విడిపోయింది. కొన్నేళ్లపాటు రొమ్ముక్యాన్సర్‌తో పోరాడిన ప్రియ అనే రజని 2002 సెప్టెంబర్‌లో గుండెపోటుతో హఠాన్మరణం పొందారు.





### పద్మిని కొల్హాపూర్ - ప్రియా టెండూల్కర్

ప్రియా టెండూల్కర్‌కి ముందు ఈ షోకి బాలీవుడ్ నటి పద్మిని కొల్హాపురి అనుకున్నారట.'అప్పటికే పద్మిని ఇండస్ట్రీలో పెద్ద తార. ఆమెతో 'రజని' పైలట్ ఎపిసోడ్ కూడా షూట్ చేశాం. కానీ, ఆ తర్వాత పద్మిని డేట్స్ దొరకడం గగనమైపోయింది. అప్పుడు యాక్టర్స్ అయిన అనితారాజ్, బిందియా గోస్వామి, ప్రియలతో విడివిడిగా పైలట్ ఎపిసోడ్స్ షూట్ చేశాం. ప్రియ 'రజని'కి పర్‌ఫెక్ట్ అనుకున్నాం. అలా అందరినీ దాటుకొని ప్రియా టెండూల్కర్‌ని 'రజని' వరించింది. అది ఆమె కోసమే పుట్టిన సీరియల్ అయ్యింది' అన్నారు బసు చటర్జీ.

పదమూడు ఎపిసోడ్లు పూర్తయిన తర్వాత ముంబయ్ చర్చిగేట్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో సీరియల్ టీమ్ అంతటినీ దూరదర్శన్ ఘనంగా సత్కరించింది. ఇంతటి ఘనవిజయం సాధించిన సీరియల్ కనీసం ఏడాది పాటు వస్తుందని ఆశించాం. 42 వారాలకు ఎపిసోడ్స్ రష్ సిద్ధం. కానీ, ప్రభుత్వం ఈ సీరియల్‌ని నిలిపివేయమని కోరింది. కారణం, సీరియల్ సామాన్యుడి వైపు ఉండటమే. ఈ సమాధానం మమ్మల్ని చాలా నిరాశపరిచింది' అని గుర్తుచేసుకున్నారు దర్శకుడు ఛటర్జీ.

'రజని' సీరియల్ వచ్చిన దాదాపు 27 ఏళ్లకు అమీర్ ఖాన్ 'సత్యమేవ్ జయతే' అంటూ స్టార్ ప్లస్‌లో సామాజిక సమస్యల అవగాహనపై ఓ కార్యక్రమం చేశారు. బాలీవుడ్ స్టార్‌ని సైతం 'రజని' సీరియల్ ఈ విధంగా ప్రభావితం చేసిందని చెప్పవచ్చు.

– ఎస్.ఆర్



# నా సిగ్గును పొగరు అనుకుంటున్నారు

**"ఓ బేబీ' చిత్రంలో నాది అతిథి పాత్ర అని చెప్పినా నందినీ రెడ్డిగారికి ఓకే చెప్పేశా. ఎందుకంటే ఈ సినిమాలో నాకు చాలా ఇష్టమైన లక్ష్మీగారు ఉన్నారు. 'మురారి' సినిమా చూసినప్పటి నుంచి ఆమెతో పని చేయాలనుకుంటున్నా. ఇంతకు ముందు ఒకసారి అనుకున్నా కుదరలేదు. 'ఓ బేబీ' తో కుదిరింది" అని హీరో నాగశౌర్య అన్నారు. సమంత, లక్ష్మి, రాజేంద్ర ప్రసాద్, నాగశౌర్య, రావు రమేష్ ముఖ్య పాత్రల్లో బి.వి. నందినీరెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఓ బేబీ'. సురేశ్ బాబు, సునీత తాటి, టి.జి.విశ్వప్రసాద్, హ్యూన్ హు, థామస్ కిమ్ నిర్మించిన ఈ సినిమా గత శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా నాగశౌర్య చెప్పిన విశేషాలు.**

● హీరోగా చేస్తూ అతిథి పాత్రలు చేయడం ఇబ్బందిగా లేదు. నాకు నచ్చిన వారితో సినిమా చేయడం చాలా ఇష్టం. నందినీరెడ్డి గారు నాకు అక్కలాంటివారు. ఈ సినిమా గురించి ఆమె నాకు చెప్పడానికి సందేహిస్తుంటే మా అమ్మ ఒత్తిడి చేసి నాకు చెప్పించింది. కథ వినగానే తప్పకుండా హిట్ అయ్యే సినిమా అనిపించి, ఇందులో నేనూ భాగం కావాలనుకున్నా.

● తొలుత నాది అతిథి పాత్రే అనుకున్నా. సెట్లోకి వెళ్లాక ఫుల్ లెంగ్త్ అయింది. లక్ష్మీగారు సెట్లో ఉన్నప్పుడు ఒక రోజు మొత్తం నేను, సమంతగారు అక్కడే ఉన్నాం. నేను ఒక్కసారి ఆమెను పలకరించాను. ఆ తర్వాత దూరం నుంచి చూస్తూ నిలబడ్డాను. ఎందుకంటే నాకు సిగ్గెక్కువ. అందరూ దాన్ని పొగరు అనుకుంటారు. నా సిగ్గు వల్ల రొమాంటిక్ సీన్స్‌కి దూరంగా ఉంటున్నా. కానీ, తప్పదంటే మాత్రం చేస్తా.

● ఈ సినిమాలో నా లుక్ బాగుందని అంటున్నారు. అంటే ఇన్నాళ్లు నేను బాగా లేనా? అనిపించింది (నవ్వుతూ). సమంత గారితో పని చేస్తున్నప్పుడు నేను పెద్ద హీరోయిన్‌తో పని చేస్తున్నానని ఏ రోజూ అనిపించలేదు. ఈ సినిమాలో ఆమె ముఖం మీద ఉమ్మివేసే సీన్ ఉంటుంది. నేను ఆ పని చేస్తే బయట అందరూ నా మీద ఉమ్మేస్తారనుకున్నా. కానీ ఆమె డెడికేటెడ్ వ్యక్తి. సినిమా కోసమే కదా అని సహకరించడంతో ఆ సీన్ చేశా.

● ప్రస్తుతం మా ఐరా క్రియేషన్స్‌లో 'అశ్వత్థామ' సినిమా చేస్తున్నాం. అవసరాల శ్రీనివాస్ దర్శకత్వంలో 'ఫలానా అబ్బాయి, ఫలానా అమ్మాయి' చేస్తున్నా. అదే విధంగా 'పార్థు' అని మరో సినిమా జరుగుతోంది. రిస్క్ చేయడం వల్ల ఇటీవల గాయపడ్డానని అంటున్నారు. అంత రిస్క్ అవసరమే. అది 14 నిమిషాల సీను. డూప్‌ని పెడితే ప్రేక్షకులకు అర్థమైపోతుంది. హీరో పడే టెన్షన్ వాళ్లూ పడాలంటే నేనే కష్టపడాలని అర్థమైంది.. అందుకే రిస్క్ చేసి నేనే చేస్తున్నా.

పరి పరిశోధన

# సోపు.. షాంపూ.. షవర్ జెల్.. అన్నీ ఇంట్లోనే!



ఒంటిని శుభ్రం చేసుకునేందుకు వాడుకునే సోపు మొదలుకొని.. జుట్టుకోసం వాడే షాంపూ, పాత్రలకు ఉపయోగించే డిష్ సోప్‌లతోపాటు అనేక ఇతర పదార్థాలను ఇంట్లోనే తయారు చేసుకునేందుకు అమెరికాలోని మియామీకి చెందిన నిక్ మాథ్యూ, మార్క్ గునియా ఓ వినూత్నమైన పరికరాన్ని సిద్ధం చేశారు. ఈ పదార్థాలన్నీ ప్లాస్టిక్ ట్యూబుల్లో వస్తూండటం ఈ అన్నదమ్ములకు అసలు నచ్చలేదు. అన్నీ ఇంట్లోనే తయారు చేసుకోగలిగితే.. ప్యాకింగ్ కూడా కలిసి వస్తుంది కదా అనుకున్నారు. నాలుగేళ్లపాటు శ్రమించి ఈ యంత్రాన్ని సిద్ధం చేశారు. క్లీనిస్ట్ అని పేరు పెట్టారు. 2015లో తాము ఓ వినూత్నమైన సీసాను చూశామని... నేలను శుభ్రం చేసుకునే ద్రవాలను అవసరానికి తగ్గట్టుగా కలిపి ఇవ్వగలిగిన ఈ సీసాలను చూసిన తరువాత తమకు క్లీనిస్ట్ తయారీకి స్ఫూర్తి వచ్చిందని వీరు అంటున్నారు. క్లీనిస్ట్‌లో నీళ్లు ఉంచే పాత్ర ఒకటి ఉంటుంది. దీంతోపాటు ప్యాకెట్లలో వచ్చే వేర్వేరు మిశ్రమాలను మనం కొనుగోలు చేయాలి. అన్నీ సహజసిద్ధమైనవి కావడం గమనార్హం. నీటిపాత్రను నింపేసి ప్యాకెట్‌ను పరికరంలో ఉంచాలి. ఆ తరువాత ఎల్‌ఈడీ తెరపై కావాల్సిన బటన్‌ను నొక్కితే చాలు. షాంపూ, సోపు, డిష్ సోపు వంటివి రెడీ అయిపోతాయి. అంతేకాదు.. నచ్చిన సువాసనను చేర్చుకోగలగడం ఇంకో విశేషం. దాదాపు 5.5 కిలోల బరువుండే క్లీనిస్ట్ ఖరీదు దాదాపు పద్నాలుగు వేల రూపాయల వరకూ ఉండవచ్చు.

# క్రిస్పర్‌తో హెచ్ఐవీ మాయం!

అవసరాలకు తగ్గట్టుగా జన్యువుల్లో మార్పులు చేర్పులు చేసేందుకు వీలు కల్పించే క్రిస్పర్ క్యాస్–9 టెక్నాలజీతో శాస్త్రవేత్తలు జంతువుల్లో హెచ్ఐవీని లేకుండా చేయగలిగారు. బతికున్న జంతువుల జన్యువుల్లోంచి హెచ్ఐవీ కారక వైరస్‌ను తొలగించగలగడం ఇదే తొలిసారి. వైద్యశాస్త్రం చాలా అభివృద్ధి చెందినప్పటికీ హెచ్ఐవీకి ఇప్పటి వరకూ పూర్తిస్థాయి చికిత్స అన్నది లేదన్నది తెలిసిందే. యాంటీ రెట్రో వైరల్ మందులను వాడుతూ జీవితకాలాన్ని పెంచుకునేందుకు మాత్రమే అవకాశముంది. ఈ నేపథ్యంలో టెంపుల్ యూనివర్శిటీ, నెబ్రాస్కా యూనివర్శిటీ మెడికల్ సెంటర్‌ల శాస్త్రవేత్తలు క్రిస్పర్ సాయంతో హెచ్ఐవీ వైరస్‌లను తొలగించే ప్రయత్నాలు మొదలుపెట్టారు. 2014లో టెంపుల్ యూనివర్శిటీ శాస్త్రవేత్తలు పరిశోధన శాలలో మానవ కణాల జన్యువుల్లోంచి వైరస్‌ను తొలగించడంలో విజయం సాధించగా.. తరువాతి కాలంలో నెబ్రాస్కా యూనివర్శిటీ శాస్త్రవేత్తలతో కలిసి బతికున్న జంతువులపై ప్రయోగాలు చేసి విజయం సాధించారు. హెచ్ఐవీ వైరస్ తనదైన డీఎన్ఏ సాయంతో కణాల్లోకి చొరబడి విభజితమవుతుందన్నది తెలిసిందే. వ్యాధితో కూడిన ఎలుకలకు యాంటీ రెట్రో వైరల్ మందులను చాలా నెమ్మదిగా వారాలపాటు విడుదల చేస్తూ వైరస్ మోతాదు అతి తక్కువ స్థాయిలో ఉండేలా చేసిన తరువాత శాస్త్రవేత్తలు.. ఆ తరువాత కణాల లోపల ఉండే వైరస్ డీఎన్ఏ పోగును కత్తిరించారు. ఆ తరువాత జరిపిన పరిశీలనల్లో మూడు వంతుల ఎలుకల్లో వైరస్ లేకుండా పోయినట్లు స్పష్టమైంది.



# రియల్ స్టార్ టైటిల్ మా ఇద్దరిదీ!

**"ప్రస్తుతం బీబీఏ మూడో సంవత్సరం చదువుతున్నాను. స్టూడెంట్‌గా ఓ 70 శాతం మార్కులు వస్తాయి. చిన్నప్పట్నించి సినిమాల్లోకి రావాలనే ఐడియాతోనే పెరిగాను. అందుకే సినిమా తప్ప నాకు ఏమీ తెలియదు. మా నాన్న కూడా 'మా చిన్నోడు హీరో అవుతాడు, పెద్దోడు డైరెక్టర్ అవుతాడు' అని చెప్పేవారు. అది అలాగే నా మైండ్‌లో పడిపోయింది" అన్నారు మేఘాంశ్. దివంగత నటుడు, రియల్ స్టార్ శ్రీహరి రెండో కుమారుడు మేఘాంశ్. అర్జున్-కార్తీక్‌ల దర్శకత్వంలో సత్యనారాయణ నిర్మించిన 'రాజ్‌దూత్' చిత్రం ద్వారా మేఘాంశ్ హీరోగా పరిచయమవుతున్నారు. ఈ శుక్రవారం విడుదల సందర్భంగా మేఘాంశ్ చెప్పిన విశేషాలు.**

● నాన్న మరణం తర్వాత అనుకోకుండా ఇండస్ట్రీకి అలా దూరమైపోయాం. ఈ గ్యాప్‌లో మేం పర్సనల్‌గా ఫుల్ స్ట్రగుల్ అయ్యాం. అమ్మని మేం చూసుకోవటం, ఆమె మమ్మల్ని చూసుకోవటం జరిగింది. సడెన్‌గా ఇలా హీరోలా ఎంట్రీ ఇస్తే అందరూ నిండు మనసుతో ఆదరించారు. సినీ పరిశ్రమ మొత్తం వెల్‌కమ్ చేస్తూ ఎంతో ప్రేమతో మాట్లాడుతుంటే చాలా హ్యాపీగా ఉంది.

● ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డాం. 44 డిగ్రీస్ ఎండల్లో హైదరాబాద్, రాజమండ్రి, రంపచోడవరంలలో షూటింగ్ జరిపాం. మంచి అవుట్ పుట్ వచ్చింది. ఇది హారర్ జానర్ అని, ఇలా ఒక జానర్ అని అనుకోలేం. రెండు, మూడు జానర్లు కలిసిన కథ.

● ఇలాంటి ఓ సినిమా ఉందని టీజర్ లాంచ్ వరకు ఎవరికీ తెలియక పోవటానికి కారణం మొదట్లో చాలా ప్రెజర్ ఉండేది. మా అమ్మ షూటింగ్‌కి వస్తేనే నాకు చాలా ఒత్తిడిగా ఉండేది. ఇక అందరికీ చెప్పి చేస్తే ఆ ఒత్తిడి ఇంకా ఎక్కువ ఉంటుంది. అందుకే ఎవరికీ చెప్పకుండా షూటింగ్ అంతా కంప్లీట్ చేసి టీజర్‌తో మీ ముందుకు వచ్చాను. కొంచెం సినిమా రోడ్ జర్నీతో ముడిపడి ఉంటుంది. ఈ సినిమాకి 'రాజ్‌దూత్' టైటిల్ ఫుల్ యాప్ట్. ఇది కమర్షియల్ సినిమానే కానీ, కొంచెం డిఫరెంట్‌గా ఉంటుంది. నా ఫేస్‌కి, నా ఏజ్‌కి ఇది కరెక్ట్ సినిమా అనిపించింది.

● మొన్న అమ్మకు సినిమా చూపించాను. మొదట్లో అమ్మ కొంచెం నెర్వస్‌గా ఉండేది. సినిమా అవుట్‌పుట్ ఎలా వస్తుందో అని. సినిమా చూశాక ఆమె ప్రౌడ్‌గా ఫీలయ్యింది. 'ఏందిరా ఇంత తెల్లగా ఉన్నావు' అంది. ఇంట్లో మేం డాన్స్ వేసినప్పుడల్లా అమ్మ గైడ్ చేసేది. అంత పెద్ద డాన్సర్ మా ఇంట్లోనే ఉందిగా మరి.

● నాన్న ఉన్నప్పుడు అందరినీ బాగా చూడు, ఎవరూ ఎక్కువ కాదు, ఎవరూ తక్కువ కాదు, అందరూ సమానమే అని చెప్పేవారు. అందరికీ హెల్ప్ చేయాలనేవారు. నాన్న ఉండి ఉంటే ఇంకా బెటర్ లాంచ్ డెఫినెట్‌గా ఉండేది.

● ఈ సినిమా స్టార్ట్ అవక ముందు ఓ నెలరోజుల పాటు నటనలో బేసిక్ ట్రైనింగ్ తీసుకొన్నాను. స్కూల్లోనే థియేటర్ యాక్టింగ్ మీద అవగాహన ఉంది. మా సినిమాలోని బైక్ వాయిస్ టీజర్‌కి మాత్రమే ఉంటుంది. సునీల్‌గారు వాయిస్ ఓవర్ చెప్పారు. సినిమాలో బైక్‌కి వాయిస్ ఉండదు.

● మా సినిమాకి ఇద్దరు దర్శకులు. అర్జున్ అండ్ కార్తీక్. వాళ్లు దర్శకుడు సుధీర్ వర్మ దగ్గర రైటర్స్‌గా ఉండేవాళ్లు. నాకు సినిమా స్టార్టింగ్ నుంచి ఓ డౌట్ ఉండేది. వీరిద్దరి మధ్య అభిప్రాయ భేదాలు వస్తే సినిమా ఆగిపోతుందేమో అనుకొనేవాణ్ని. ఇద్దరూ మంచి కో– ఆర్డినేషన్‌తో ఒకే మాట మీద ఫుల్ క్లారిటీతో ఉంటారు. నిర్మాత సత్యనారాయణ గారు నన్ను చాలా బాగా చూసుకున్నారు.

శ్రీహరి గారి రియల్ స్టార్ టైటిల్ మీ ఇద్దరిలో ఎవరు తీసుకుంటారు? అని కొంతమంది అడిగారు. ఆ టైటిల్ నా ఒక్కడిదే కాదు, నాది, మా అన్నయ్య శశాంక్ ది. నాది అమ్మ పోలిక, కానీ నాన్న యంగ్‌గా ఉన్నప్పుడు ఎలా ఉండేవారో ఇప్పుడు నేను అలానే ఉన్నాను అంటున్నారు. అన్నయ్య ఇంకా ట్రైన్ అవుతున్నాడు. మరో నాలుగైదేళ్లల్లో దర్శకుడు అవుతాడు. మా అమ్మ, అన్న ఎప్పుడూ గైడ్ చేస్తారు నన్ను. ఫ్యూచర్‌లో నాతో, అన్నతో సి.కళ్యాణ్ మామ సినిమా చేస్తాను అన్నారు.



● మేఘాంశ్

సాక్షి భవిత
స్పర్ధయా వర్ధతే విద్య
మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక, రోడ్ నంబరు-1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com
బుధవారం
10-7-2019




# స్కిల్ ఇండియా దారిలో.. నైపుణ్యాల సాధనలో..!

**స్కిల్ ఇండియా.. స్కిల్ డెవలప్‌మెంట్.. ఎంప్లాయబిలిటీ స్కిల్స్.. వీటికి ఇటీవల కాలంలో ఎన్నడూ లేనంత ప్రాధాన్యం.. ఓ వైపు దేశంలో యువతలో ఎంప్లాయబిలిటీ స్కిల్స్ లేవనే అభిప్రాయాలు! మరో వైపు దేశ భవితకు వెన్నెముక అయిన యువతకు నైపుణ్యాలు అందించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్‌కు శ్రీకారం చుడుతున్న వైనం. వీటిని అందిపుచ్చుకుంటే జాబ్ మార్కెట్లో ముందంజలో నిలవడం ఖాయం! ప్రస్తుత కొత్త విద్యా సంవత్సరంలో విద్యార్థులు ఇప్పటి నుంచే స్కిల్స్ దిశగా అడుగులు వేస్తే.. కోర్సు పూర్తిచేసుకునే నాటికి ఉద్యోగ నైపుణ్యాలతో జాబ్ మార్కెట్లో అడుగు పెట్టొచ్చు! ఈ నేపథ్యంలో యువతకు అందుబాటులో ఉన్న స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్ గురించి తెలుసుకుందాం...**

దేశవ్యాప్తంగా ఐటీఐ, పాలిటెక్నిక్, బీటెక్, ఎంటెక్ వంటి సాంకేతిక కోర్సులు మొదలు.. సంప్రదాయ బీఏ/బీకామ్/బీఎస్సీ తదితర డిగ్రీ కోర్సుల వరకూ.. ఏటా దాదాపు రెండు కోట్ల మంది పట్టాలతో బయటికి వస్తున్నారు. వీరిలో చాలామంది నేటి టెక్నాలజీ యుగంలో జాబ్ మార్కెట్లో పోటీ పడలేకపోతున్నారు. ఫలితంగా ఉద్యోగాలు పొందలేక నిరుత్సాహానికి గురవుతున్నారు. ఇందుకు ప్రధాన కారణం.. ఆయా కోర్సులు పూర్తిచేసుకుంటున్న అభ్యర్థుల్లో క్షేత్రస్థాయి నైపుణ్యాలు, ప్రాక్టికల్ దృక్పథం లేకపోవడమే ముఖ్యకారణమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. నిపుణులు, విద్యావేత్తల వాదనలను పరిగణనలోకి తీసుకున్న కేంద్ర ప్రభుత్వం.. విద్యార్థుల్లో క్షేత్రస్థాయి నైపుణ్యాలతోపాటు ఎంప్లాయబిలిటీ స్కిల్స్ మెరుగుపరచడంపై దృష్టిసారిస్తోంది. స్కిల్ ఇండియా లక్ష్యంగా ముందడుగు వేయాలని భావిస్తోంది. అందుకోసం పలు స్కిల్ డెవలప్‌మెంట్ పథకాలను అమలు చేస్తోంది.

**ఐటీఐ, పాలిటెక్నిక్ నుంచి ఇంజనీరింగ్, పీజీ వరకు.. అన్ని రకాల కోర్సులకు స్కిల్ డెవలప్‌మెంట్ స్కీమ్స్**

**సంప్రదాయ డిగ్రీ విద్యార్థులకు సైతం ఉద్యోగ నైపుణ్య పథకాల అమలు**

**అందిపుచ్చుకుంటే 'జాబ్ రెడీ'గా రూపొందడం ఖాయమంటున్న నిపుణులు**

...ప్‌మెంట్ పథకాల గురించి తమకు తెలియదని చెప్పారని... ఇటీవల అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్, వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్‌లు సంయుక్తంగా 'యంగ్ ఇండియా-వర్క్ ఇండియా' పేరుతో నిర్వహించిన సర్వేలో పేర్కొనడమే ఇందుకు నిదర్శనం.

✦ వెబ్‌సైట్: https://skillindia.nsdcindia.org

## స్కిల్ ఇండియా

యువతలో క్షేత్రస్థాయి నైపుణ్యాలను పెంచేందుకు అయిదేళ్ల క్రితం జాతీయ స్థాయిలో ప్రారంభమైన ప్రత్యేక స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్.. స్కిల్ ఇండియా! ఈ పథకం ముఖ్య ఉద్దేశం.. 2022 నాటికి 40 కోట్ల మందికి నైపుణ్యాలను అందించడం. ఇందుకోసం దేశవ్యాప్తంగా శిక్షణ కేంద్రాలను నెలకొల్పుతారు. స్కిల్ ఇండియా పథకాన్ని సమర్థంగా అమలు చేసేందుకు ఎంఎస్‌డీఈ(మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్), ఎన్‌ఎస్‌డీసీ (నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్)లు సంయుక్తంగా పనిచేస్తాయి. పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్యంలో సెక్టార్ స్కిల్ ట్రైనింగ్ సెంటర్లను ఏర్పాటుచేసి.. వాటిద్వారా ఆయా ప్రాంతాల్లోని యువతకు షార్ట్ టర్మ్, లాంగ్ టర్మ్ విధానంలో శిక్షణ అందించాలి. ఇలా శిక్షణ పూర్తి చేసుకున్న వారికి పరీక్ష నిర్వహించి సర్టిఫికెట్ కూడా అందజేస్తారు. స్కిల్ ఇండియా పథకంలో భాగంగా పలు శిక్షణ కార్యక్రమాలు అమలవుతున్నప్పటికీ.. నేటికీ చాలామందికి వీటిపై సరైన అవగాహన లేదు. దాదాపు 70 శాతం మంది విద్యార్థులు స్కిల్ డెవల...



## ఎన్ఎస్‌డీసీ.. పలు రంగాలకు వేదిక

విద్యార్థులకు పలు రంగాల్లో శిక్షణ ఇచ్చేందుకు ఉమ్మడి వేదికగా నిలుస్తోంది.. నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎస్‌డీసీ). పదోతరగతి నుంచి ప్రొఫెషనల్ కోర్సుల వరకు.. ఆయా రంగాలకు సంబంధించి సెక్టార్ స్కిల్ కౌన్సిల్స్ పేరుతో వేర్వేరుగా శిక్షణ అందిస్తోంది. ఇలా దాదాపు 30 విభాగాల్లో శిక్షణ సదుపాయం అందుబాటులో ఉంది. ఇందుకోసం ఆయా ప్రాంతాల్లో పలు సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. విద్యార్థులు తమ సమీపంలోని ఎన్ఎస్‌డీసీ అధీకృత శిక్షణ కేంద్రంలో చేరి నిర్దిష్ట వ్యవధిలో శిక్షణ పూర్తిచేసుకోవాలి.

✦ వెబ్‌సైట్: https://nsdcindia.org

### స్కిల్ ఇండియా ప్రోగ్రామ్స్.. ముఖ్యాంశాలు

- ✦ ఎంఎస్‌డీఈ ఆధ్వర్యంలో పలు నైపుణ్య శిక్షణ ప్రోగ్రామ్‌లు.
- ✦ ఏఐసీటీఈ, యూజీసీ ఆధ్వర్యంలో ఆన్ జాబ్ ట్రైనింగ్ సదుపాయం.
- ✦ పీఎంకేవీవై ద్వారా ఇప్పటి వరకు దాదాపు 15 లక్షల మందికి శిక్షణ.
- ✦ ఎన్ఏపీఎస్ అమలు తర్వాత దాదాపు 40 శాతం రెట్టింపైన అప్రెంటీస్ ట్రైనీ నియామకాలు.
- ✦ సంప్రదాయ డిగ్రీ కోర్సుల విద్యార్థులకూ ఆన్ జాబ్ ట్రైనింగ్ కోర్సులు.

## పీఎంకేవీవై

ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన..సంక్షిప్తంగా పీఎంకేవీవై. ఈ పథకం 2015లో ప్రారంభమైంది. 2020 నాటికి దేశంలో కోటి మంది యువతకు శిక్షణ ఇవ్వడం ఈ పథకం లక్ష్యం. ప్రస్తుతం దేశంలో అందుబాటులో ఉన్న ముఖ్యమైన స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్.. పీఎంకేవీఐ. ఎంఎస్‌డీఈ, ఎన్ఎస్‌డీసీ, డీజీఈటీ తదితర విభాగాలకు చెందిన పథకాలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తెచ్చే విధంగా పీఎంకేవీవై విధి విధానాలు రూపొందించారు. పీఎంకేవీవై ద్వారా స్కూల్ స్థాయి కోర్సుల నుంచి ప్రొఫెషనల్ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థుల వరకు.. పలు విభాగాల్లో ప్రాక్టికల్ శిక్షణ అందిస్తున్నారు. మూడు నెలలు, ఆరు నెలలు ఇలా.. నిర్దిష్ట వ్యవధిలో శిక్షణ కార్యక్రమాలను పూర్తిచేసుకున్న వారికి పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో విజయం సాధించిన విద్యార్థులకు వారు శిక్షణ పూర్తిచేసుకున్న విభాగానికి సంబంధించిన పరిశ్రమల్లో ఉద్యోగం పొందేలా తోడ్పాటును అందించడం ఈ పథకం మరో ప్రత్యేకత. అభ్యర్థులు పీఎంకేవీవై అధికారిక వెబ్‌సైట్ (pmkvyofficial.org)లో లాగిన్ అయి తమ ప్రొఫైల్‌ను అప్‌డేట్ చేసుకోవచ్చు. ఆసక్తి ఉన్న విభాగానికి సంబంధించి సమీపంలోని శిక్షణ కేంద్రాల వివరాలు తెలుసుకోవచ్చు.

## నేషనల్ అప్రెంటీస్ ప్రమోషన్ స్కీమ్

విద్యార్థుల్లో ఎంప్లాయబిలిటీ స్కిల్స్ పెంచేందుకు ఉద్దేశించిన మరో ముఖ్యమైన పథకం.. నేషనల్ అప్రెంటీస్ ప్రమోషన్ స్కీమ్. 2020 నాటికి 50 లక్షల మందికి అప్రెంటీస్‌షిప్ ట్రైనింగ్ అందించడం ప్రధాన లక్ష్యం. ఈ పథకాన్ని ఇటు విద్యార్థులకు, అటు ఇండస్ట్రీ వర్గాలకు అనుకూలంగా ఉండేలా రూపొందించారు. కొత్త పథకం కారణంగా సంస్థలు అప్రెంటీస్ ట్రైనీలను నియమించుకోవడం దాదాపు తప్పనిసరిగా మారింది. అప్రెంటీస్ ట్రైనీలను నియమించుకున్న సంస్థలకు.. సదరు అభ్యర్థికి శిక్షణ ఇచ్చేందుకు అయ్యే వ్యయంలో 50 శాతాన్ని ప్రభుత్వమే భరిస్తుంది. అభ్యర్థులు వెబ్‌సైట్ **www.apprenticeship.gov.in**లో లాగిన్ అయి తమ వివరాలు నమోదు చేసుకోవాలి. అలా దరఖాస్తు చేసుకున్న వారి అర్హతల ఆధారంగా సంస్థలు ఆన్‌లైన్ విధానంలోనే అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తాయి. తర్వాత దశలో ఇంటర్వ్యూ నిర్వహించి అప్రెంటీస్ ట్రైనీగా ఖరారు చేస్తాయి.

### అందిపుచ్చుకుంటే.. జాబ్ రెడీగా..

"ప్రస్తుతం యువత క్షేత్రస్థాయి నైపుణ్యాలు అందుకునేందుకు ఎన్నో మార్గాలు అందుబాటులో ఉన్నాయి. వాటి గురించి అవగాహన లేక చాలామంది అవకాశాలు కోల్పోతున్నారు. ఈ విషయంలో ఇన్‌స్టిట్యూట్‌లు చొరవ చూపాలి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నైపుణ్యాలు అందించే శిక్షణ పథకాల గురించి తెలియజేయాలి. ఈ శిక్షణ కార్యక్రమాలన్నీ ఇండస్ట్రీ వర్గాల భాగస్వామ్యంతో నిర్వహిస్తున్నందున వీటిని పూర్తిచేసుకుంటే ఉద్యోగం లభించడం ఖాయం.

– **ఆర్.సి.ఎం.రెడ్డి**, ఎన్ఎస్‌డీఏ సభ్యులు.

## సంకల్ప్

స్కిల్స్ అక్విజిషన్ అండ్ నాలెడ్జ్ అవేర్‌నెస్ ఫర్ లైవ్లీహుడ్ ప్రమోషన్ (SANKALP సంకల్ప్). ఇటీవల కాలంలో ఎంఎస్‌డీఈ రూపొందించిన మరో పథకం ఇది. విద్యార్థులకు జాబ్ ఓరియెంటెడ్ ట్రైనింగ్ ఇచ్చేందుకు అవసరమైన నిధులను ఇన్‌స్టిట్యూట్‌లకు సమకూర్చడం ఈ స్కీమ్ ప్రత్యేకత. ఈ పథకం ద్వారా ఇన్‌స్టిట్యూట్‌లు తాము అందిస్తున్న కోర్సులకు సంబంధించి పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్యం విధానంలో శిక్షణ కేంద్రాలను నెలకొల్పి విద్యార్థులకు శిక్షణ ఇస్తాయి. ఈ శిక్షణలో పరిశ్రమ వర్గాల ప్రమేయం కూడా ఉంటుంది. ఫలితంగా శిక్షణ పూర్తవుతూనే సదరు పరిశ్రమల్లో విద్యార్థులకు ఉద్యోగావకాశాలు మెరుగవుతాయి.

✦ వెబ్‌సైట్: www.msde.gov.in/sankalp.html

## ఏఐసీటీఈ.. అందించే శిక్షణ

జాతీయస్థాయిలో బీటెక్, ఎంటెక్, ఎంబీఏ తదితర ప్రొఫెషనల్ కోర్సుల నియంత్రణ, పర్యవేక్షణ సంస్థ.. ఏఐసీటీఈ. ఈ సంస్థ సైతం విద్యార్థులకు క్షేత్రస్థాయి నైపుణ్యాలు అందించేందుకు పలు స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలను అమలు చేస్తోంది.

### పీఎంకేవీవై-టీఐ

ప్రధానమంత్రి కౌశల్ వికాశ్ యోజన ఫర్ టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్స్ (పీఎంకేవీవై-టీఐ). వచ్చే మూడేళ్లలో పది లక్షల మంది డ్రాప్ అవుట్స్‌కు శిక్షణ ఇవ్వడం ఈ స్కీమ్ లక్ష్యం. పీఎంకేవీవై-టీఐ ద్వారా దేశవ్యాప్తంగా ఏఐసీటీఈ పరిధిలో ఉన్న పాలిటెక్నిక్స్, ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్స్‌లో మధ్యలోనే కోర్సులు ఆపేసిన విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యాలు అందిస్తారు. ఇలా నైపుణ్యాలు అందుకున్న వారికి తదుపరి దశలో ఉపాధి అవకాశాలు లభించేలా తోడ్పాటు అందించే ఉద్దేశంతో ఏఐసీటీఈ ఈ పథకాన్ని అమలు చేస్తోంది. ఇందుకోసం జాతీయస్థాయిలో ఏఐసీటీఈ అనుబంధ కళాశాలల్లో శిక్షణ కేంద్రాలను నెలకొల్పింది. ఔత్సాహిక విద్యార్థులు తమ సమీపంలోని కళాశాలల్లో ఉన్న శిక్షణ కేంద్రాల్లో తమపేర్లు నమోదు చేసుకుని నిర్దిష్ట వ్యవధిలోని శిక్షణ పూర్తిచేసుకోవచ్చు. ఆ తర్వాత నిర్వహించే పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే సర్టిఫికెట్ కూడా సొంతమవుతుంది. శిక్షణ ప్రస్తుతం 250 గంటల నుంచి మూడు వందల గంటలు ఉంటుంది. ఈ స్కీమ్‌లో విద్యార్థులు తమ వివరాలను ఆన్‌లైన్లోనే పొందుపరుస్తారు. ఫలితంగా ఇండస్ట్రీ వర్గాలు వారి అవసరాలకు సరితూగే నైపుణ్యాలున్న విద్యార్థుల వివరాలను తెలుసుకునే వీలుంటుంది. దీనివల్ల వివిధ కోర్సులు పూర్తిచేసుకున్న విద్యార్థులకు ఉద్యోగావకాశాలు మెరుగవుతాయి.

✦ వెబ్‌సైట్: www.aicte-india.org

### ఈఈటీపీ

ఏఐసీటీఈ అందిస్తున్న మరో స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్.. ఎంప్లాయబిలిటీ ఎన్‌హ్యాన్స్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ (ఈఈటీపీ). విద్యార్థుల్లో ఎంప్లాయబిలిటీ స్కిల్స్ పెంపొందించడం ఈ పథకం ముఖ్య లక్ష్యం. ఏఐసీటీఈ.. ఈ స్కీమ్‌ను సమర్థంగా నిర్వహించేందుకు ఐసీటీ అకాడమీ, మాన్‌స్టర్ డాట్ కామ్, లింక్డ్ ఇన్ వంటి సంస్థలతో ఒప్పందం చేసుకుంది. ఈఈటీపీ శిక్షణ పూర్తిచేసుకున్న అభ్యర్థుల వివరాలు ఈ సంస్థలకు అందిస్తుంది. తర్వాత దశలో విద్యార్థులు నైపుణ్యం పొందిన విభాగం ఆధారంగా వారి ప్రొఫైల్స్‌ను సదరు వెబ్‌సైట్లలో అందుబాటులో ఉంచుతారు. ఫలితంగా సంస్థలు ఆన్‌లైన్లోనే అభ్యర్థుల వివరాలు పరిశీలించి తమకు సరితూగే అర్హతలున్న వారిని నియమించుకోవడం తేలికవుతుంది.

✦ వెబ్‌సైట్: http://eetp.ictacademy.in

### నీమ్

డిప్లొమా స్థాయి విద్యార్థులకు ఎంప్లాయబిలిటీ స్కిల్స్ అందించేందుకు ఏఐసీటీఈ అమలు చేస్తున్న మరో వినూత్నమైన ట్రైనింగ్ ప్రోగ్రామ్.. నేషనల్ ఎంప్లాయబిలిటీ ఎన్‌హ్యాన్స్‌మెంట్ మిషన్(నీమ్). డిప్లొమా కోర్సుల ఉత్తీర్ణులు, లేదా ప్రస్తుతం డిప్లొమా కోర్సులు చదువుతున్న విద్యార్థులు, వారి బ్రాంచ్ ఆధారంగా.. సంబంధిత పరిశ్రమల్లోని ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలు అందించేలా శిక్షణ ఇస్తారు. ఇందుకు నీమ్ ఫెసిలిటేటర్ పేరుతో జాతీయస్థాయిలో ప్రైవేటు ఏజెన్సీలను నియమించారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 16 ఏజెన్సీల ద్వారా శిక్షణ కార్యక్రమాలను ఏఐసీటీఈ నిర్వహిస్తోంది.

✦ వెబ్‌సైట్: www.aicte-india.org

## యూజీసీ పర్యవేక్షణ

సంప్రదాయ డిగ్రీ కోర్సులు, కళాశాలలు, యూనివర్సిటీల పర్యవేక్షణ సంస్థ యూజీసీ (యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్).. ప్రస్తుతం పలు స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్‌ను అందిస్తోంది. వీటిద్వారా సంప్రదాయ కోర్సులు చదువుతున్న విద్యార్థులు సైతం జాబ్ మార్కెట్‌కు అవసరమైన నైపుణ్యాలను సొంతం చేసుకోవచ్చు. ప్రస్తుతం యూజీసీ అందిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్ వివరాలు..

### యూజీసీ స్పెషల్ అసిస్టెన్స్ ప్రోగ్రామ్

ఇన్‌స్టిట్యూట్‌లకు రీసెర్చ్, టీచింగ్ పరంగా సహకారం అందించడం.. విద్యార్థులకు రీసెర్చ్ కార్యకలాపాల్లో పాల్పంచుకునే అవకాశం కల్పించడం ఈ ప్రోగ్రామ్ ప్రధాన ఉద్దేశం. యూజీసీ సదరు ఇన్‌స్టిట్యూట్‌లకు ఆర్థిక ప్రోత్సాహకాలు కూడా అందిస్తుంది. వీటిని అందుకోవాలంటే.. విద్యాసంస్థలు నిర్దిష్ట ప్రమాణాలు పాటించాల్సి ఉంటుంది. ఇన్‌స్టిట్యూట్‌లు ఆన్‌లైన్లో వివరాలు నమోదు చేసుకుంటే.. అర్హత కలిగిన వాటిని యూజీసీ ఎంపిక చేస్తుంది.

### దీన్ దయాళ్ ఉపాధ్యాయ కౌశల్ కేంద్రాలు

ఒకేషనల్ కోర్సుల విద్యార్థులకు నైపుణ్యాలు అందించేందుకు ఉద్దేశించిన పథకం.. దీన్ దయాళ్ ఉపాధ్యాయ కౌశల్ కేంద్ర. ఇందులో ప్రధానంగా ఆయా కళాశాలల్లో ఒకేషనల్ కోర్సులను అడ్వాన్స్‌డ్ స్థాయిలో బోధిస్తారు. ఈ పథకంలో ఆన్-జాబ్ ట్రైనింగ్ విధానం అమలు చేస్తారు. ఫలితంగా విద్యార్థులకు సంబంధిత విభాగంలో క్షేత్రస్థాయి నైపుణ్యాలు లభిస్తాయి. తద్వారా కోర్సు తర్వాత ఉపాధి అవకాశాలు పొందడంలో ముందంజలో ఉంటారు.



### డీడీయూ-జీకేవై

గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో ఎంప్లాయబిలిటీ స్కిల్స్ పెంపొందించేందుకు రూపొందించిన పథకం.. డీడీయూ-జీకేవై(దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన). ఈ పథకాన్ని అయిదేళ్ల క్రితం ప్రారంభించారు. పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్యం విధానంలో ఆయా ప్రాంతాల్లో శిక్షణ కేంద్రాల ద్వారా గ్రామీణ విద్యార్థులకు శిక్షణనిస్తారు. శిక్షణ పూర్తిచేసుకున్న వారికి ప్లేస్‌మెంట్ సహకారం కూడా లభిస్తోంది. ఔత్సాహిక యువత ddugky.gov.in వెబ్‌సైట్ ద్వారా తమ సమీప ప్రాంతంలోని శిక్షణ కేంద్రాలను తెలుసుకోవచ్చు. దాని ఆధారంగా తమ వివరాలు నమోదు చేసుకుని శిక్షణకు హాజరవ్వచ్చు.

### శ్రేయాస్ స్కీమ్

సంప్రదాయ డిగ్రీ కోర్సుల విద్యార్థులకు వృత్తి నైపుణ్యాలు అందించే లక్ష్యంతో ఎంహెచ్ఆర్‌డీ ప్రతిపాదించిన కొత్త స్కీమ్.. శ్రేయాస్(స్కీమ్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇన్ యూత్ ఇన్ అప్రెంటీస్‌షిప్ అండ్ స్కిల్స్). సంప్రదాయ డిగ్రీ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులకు ఆన్ జాబ్ ఎక్స్‌పోజర్ అందించడమే శ్రేయాస్ ముఖ్య ఉద్దేశం. అందుకోసం కోర్సు పూర్తిచేసుకునే సమయానికి క్షేత్రస్థాయి నైపుణ్యాలు సొంతం చేసుకునేలా అప్రెంటీస్ అవకాశాలను అందుబాటులోకి తెస్తారు. ఈ పథకం ద్వారా ఉన్నతవిద్యలో 'ఎర్న్ వైల్ యూ లెర్న్' దృక్పథాన్ని ప్రవేశ పెట్టాలని భావిస్తున్నారు. అంతేకాకుండా బీఏ/బీకామ్/బీఎస్సీల్లో ప్రొఫెషనల్ కోర్సులను ప్రవేశపెట్టాలనే ఆలోచన కూడా ఉంది. పలు రంగాలకు చెందిన సెక్టార్ స్కిల్ కౌన్సిల్స్, నేషనల్ స్కిల్ క్వాలిఫికేషన్ ఫ్రేమ్‌వర్క్ మార్గ నిర్దేశాలకు అనుగుణంగా.. ఐటీ, రిటైల్, లాజిస్టిక్స్, టూరిజం, హెల్త్‌కేర్, బీఎఫ్ఎస్ఐ, ఎలక్ట్రానిక్స్, మీడియా, లైఫ్‌సైన్సెస్, మేనేజ్‌మెంట్ విభాగాల కోర్సుల అభ్యర్థులకు సరితూగే అప్రెంటీస్‌షిప్ కోర్సుల్లో శిక్షణ ఇస్తారు. శిక్షణ తర్వాత పరీక్ష నిర్వహించి సర్టిఫికెట్ అందిస్తారు. ఫలితంగా విద్యార్థులకు వారు అప్రెంటీస్ శిక్షణ పూర్తిచేసుకున్న సంస్థలోనే ఉద్యోగం లభించే అవకాశాలు మెరుగవుతాయి.

✦ వెబ్‌సైట్: www.shreyas.ac.in/Home/about

---




**స్టడీ అబ్రాడ్**

# జీమ్యాట్

**విదేశీ యూనివర్సిటీల్లో ఎంబీఏకు మార్గం**

**ప్రపంచవ్యాప్తంగా 2000 బీస్కూల్స్‌లో ప్రవేశం**

**విదేశాల్లో మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఎంబీఏ), పోస్టుగ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్(పీజీడీఎం) కోర్సులు చదవాలనుకునే విద్యార్థులు రాయాల్సిన పరీక్ష.. గ్రాడ్యుయేట్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్టు (జీమ్యాట్)! జీమ్యాట్ స్కోరు ఆధారంగా భారత్‌తోపాటు ప్రపంచ వ్యాప్తంగా 80 దేశాల్లోని ప్రముఖ యూనివర్సిటీలు/ఇన్‌స్టిట్యూట్‌లు మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జీమ్యాట్ పరీక్ష విధానం, ప్రయోజనాలపై ప్రత్యేక కథనం..**

### ప్రత్యేక కోర్సులు

మేనేజ్‌మెంట్ పీజీ అంటే ఎంబీఏ గుర్తొస్తుంది. పలు విదేశీ యూనివర్సిటీలు ఎంబీఏతోపాటు పీజీ డిప్లొమా, మాస్టర్స్ ఇన్ మేనేజ్‌మెంట్, మాస్టర్స్ ఇన్ ఫైనాన్స్, మాస్టర్స్ ఇన్ అకౌంటింగ్, ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ తదితర కోర్సులను అందిస్తున్నాయి. వీటి కాలవ్యవధి రెండేళ్లలోపే ఉంటోంది. దీంతో సమయం, ఖర్చును దృష్టిలో పెట్టుకొని మన విద్యార్థులు ఈ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. మరోవైపు ఆయా కోర్సులు చేసిన వారికి జాబ్ మార్కెట్లో మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయి. జీమ్యాట్ ప్రతిభ ఆధారంగా విదేశీ యూనివర్సిటీల్లో ఎంబీఏ కోర్సుల్లో ప్రవేశాలు పొందవచ్చు. అమెరికాతోపాటు ప్రపంచ వ్యాప్తంగా 2,000 యూనివర్సిటీలు/ఇన్‌స్టిట్యూట్‌లు/బీస్కూల్స్.. బిజినెస్ కోర్సుల్లో ప్రవేశానికి జీమ్యాట్ స్కోరును ప్రామాణికంగా తీసుకుంటున్నాయి.

### విదేశాల్లో ఎందుకు

అమెరికా, యూకే, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్ దేశాల్లోని టాప్ ఇన్‌స్టిట్యూట్స్‌లో మేనేజ్‌మెంట్ కోర్సులను పూర్తిచేస్తే అంతర్జాతీయంగా గుర్తింపు లభిస్తుంది. ఇది కెరీర్ అవకాశాల పరంగా కలిసొస్తోంది. వీటిని దృష్టిలో పెట్టుకొని విద్యార్థులు సదరు ఇన్‌స్టిట్యూట్స్‌లో చదివేందుకు మొగ్గుచూపుతున్నారు. వీరికి జీమ్యాట్ కీలకంగా మారుతోంది.

### అర్హత నిబంధనలు

- వ్యాలిడ్ పాస్‌పోర్టు ఉండాలి.
- విదేశాల్లో మేనేజ్‌మెంట్ పీజీ కోర్సుల్లో ప్రవేశాలు పొందే క్రమంలో విద్యార్థులు తప్పనిసరిగా ఆయా నిబంధనలు పాటించాలి.
- జీమ్యాట్ స్కోర్ 600కు పైగా ఉంటే అత్యున్నత సంస్థల్లో ప్రవేశానికి అవకాశం లభిస్తుంది.
- అకడమిక్ ట్రాక్ రికార్డ్.. ముఖ్యంగా సీనియర్ సెకండరీ నుంచి అండర్ గ్రాడ్యుయేషన్ వరకు 7కు పైగా జీపీఏ ఉండటం మేలు చేస్తుంది.
- లాంగ్వేజ్ టెస్ట్‌ల్లో ఉత్తమ స్కోర్లు సాధించాలి.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

### ముఖ్య దశలు

- జీమ్యాట్ అకౌంట్‌ను క్రియేట్ చేసుకోవాలి.
- రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత టెస్టు అపాయింట్‌మెంట్‌ను ఎంచుకోవాలి.
- తప్పనిసరి సమాచారాన్ని పూరించాలి.
- వర్క్ ఎక్స్‌పీరియెన్స్, లక్ష్యాలు తదితరాల వివరాలను అందించడం మేలు.
- ప్రొఫైల్‌లో తప్పులు లేకుండా సరిచూసుకోవాలి.
- ప్రాధాన్యతల ఆధారంగా పరీక్ష కేంద్రాలు, పరీక్ష తేదీలను ఎంచుకోవాలి.
- పరీక్ష ఫీజు చెల్లించాలి.

### పరీక్ష విధానం

జీమ్యాట్‌ను ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు.

| విభాగం | ప్రశ్నలు | సమయం |
|---|---|---|
| వెర్బల్ రీజనింగ్ | 36 | 65 ని.లు. |
| క్వాంటిటేటివ్ రీజనింగ్ | 31 | 62 ని.లు. |
| ఇంటిగ్రేటెడ్ రీజనింగ్ | 12 | 30 ని.లు. |
| అనలిటికల్ రైటింగ్ అసెస్‌మెంట్ | 1 | 30 ని.లు. |
| **మొత్తం** | 80 | 3 గం. 7 ని. |

- వెర్బల్ రీజనింగ్ విభాగంలో క్రిటికల్ రీజనింగ్, సెంటెన్స్ కరెక్షన్, రీడింగ్ కాంప్రెహెన్షన్ ప్రశ్నలు వస్తాయి.
- క్వాంటిటేటివ్ రీజనింగ్ విభాగంలో ప్రాబ్లమ్ సాల్వింగ్, డేటా సఫిషియెన్సీ ప్రశ్నలు వస్తాయి.
- ఇంటిగ్రేటెడ్ రీజనింగ్ నుంచి టేబుల్ అనాలసిస్, టూ పార్ట్ అనాలసిస్, గ్రాఫిక్స్ ఇంటర్‌ప్రిటేషన్, మల్టిసోర్స్ రీజనింగ్ ప్రశ్నలు వస్తాయి.
- అనలిటికల్ రైటింగ్ అసెస్‌మెంట్‌లో ఆర్గ్యుమెంట్ అనాలసిస్‌కు సంబంధించిన ప్రశ్న వస్తుంది.

### పరీక్ష కేంద్రాలు

- జీమ్యాట్ వందకి పైగా దేశాల్లోని టెస్టు సెంటర్లలో ఏడాది పొడవునా అందుబాటులో ఉంటుంది. దేశంలో హైదరాబాద్, విశాఖపట్నం, బెంగళూరు, చెన్నై, కోయంబత్తూరు, కోచి తదితర చోట్ల ఈ పరీక్ష రాయాలనుకునేవారు ముందుగా విజ్ఞప్తి చేసుకునే ప్రాతిపదిక మీద సంవత్సరంలో ఎప్పుడైనా రాసే వెసులుబాటు ఉంది.

### టాప్ ఇన్‌స్టిట్యూట్స్‌లో పని అనుభవం

విదేశీ మేనేజ్‌మెంట్ కోర్సులు క్రేజీగా మారుతున్నప్పటికీ.. మన విద్యార్థులకు కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా యూకే,ఆస్ట్రేలియా, ఫ్రాన్స్ తదితర దేశాల్లోని ప్రముఖ ఇన్‌స్టిట్యూట్‌లు మేనేజ్‌మెంట్ పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు పని అనుభవాన్ని తప్పనిసరి చేశాయి. కనీసం రెండేళ్లు, గరిష్ఠంగా అయిదేళ్ల పని అనుభవం ఉన్నవారినే దరఖాస్తుకు అనుమతి ఇస్తున్నాయి. ఇది మన ఫ్రెషర్స్‌కు ఇబ్బందిగా మారుతోంది. కొన్ని ఇన్‌స్టిట్యూట్‌లు పని అనుభవంతో సంబంధం లేకుండా జీమ్యాట్ స్కోర్ ఆధారంగానే ప్రవేశాలు కల్పిస్తున్నప్పటికీ.. టాప్ యూనివర్సిటీలు మాత్రం వర్క్ ఎక్స్‌పీరియన్స్‌ను తప్పనిసరి చేశాయి. దాంతో బీటెక్, ఇతర బ్యాచిలర్ డిగ్రీ కోర్సులు పూర్తిచేశాక ఏదో ఒక సంస్థలో పని అనుభవం గడించి మేనేజ్‌మెంట్ కోర్సుల వైపు దృష్టిసారిస్తున్నారు.

## స్కోరు వివరాలు

**న్యూజిలాండ్ ఇన్నింగ్స్:** గప్టిల్ (సి) కోహ్లి (బి) బుమ్రా 1; నికోల్స్ (బి) రవీంద్ర జడేజా 28; విలియమ్సన్ (సి) జడేజా (బి) చహల్ 67; టేలర్ (బ్యాటింగ్) 67; నీషమ్ (సి) కార్తీక్ (బి) పాండ్యా 12; గ్రాండ్‌హోమ్ (సి) ధోని (బి) భువనేశ్వర్ 16; లాథమ్ (బ్యాటింగ్) 3; ఎక్స్‌ట్రాలు 17; **మొత్తం (46.1 ఓవర్లలో 5 వికెట్లకు) 211.**
**వికెట్ల పతనం:** 1-1, 2-69, 3-134, 4-162, 5-200.
**బౌలింగ్:** భువనేశ్వర్ 8.1-1-30-1; బుమ్రా 8-1-25-1; పాండ్యా 10-0-55-1, రవీంద్ర జడేజా 10-0-34-1, చహల్ 10-0-63-1.

# సశేషం!


87 ఏళ్ల భారత అభిమాని చారులత ఉత్సాహం

ప్రతిష్టాత్మక ప్రపంచ కప్ సెమీఫైనల్ మ్యాచ్‌కు వరుణ దేవుడు అడ్డు పడ్డాడు. భారత్, న్యూజిలాండ్ మధ్య పోరులో ఒక ఇన్నింగ్సూ పూర్తిగా ముగియకుండానే వర్షం కారణంగా ఆటకు అంతరాయం కలిగింది. అయితే వరల్డ్ కప్ నాకౌట్ నిబంధనల ప్రకారం 'రిజర్వ్ డే' అయిన నేడు మ్యాచ్ కొనసాగుతుంది. 46.1 ఓవర్ల వద్ద కివీస్ ఇన్నింగ్స్ నిలిచిపోగా... ఇప్పుడు అక్కడి నుంచే బుధవారం ఆట జరుగుతుంది. భారత బౌలర్లు చెలరేగడంతో స్వల్ప స్కోరు మాత్రమే చేయగలిగిన కివీస్ మిగిలిన 3.5 ఓవర్లలో మరికొన్ని పరుగులు జోడించే అవకాశం ఉంది. రెండో రోజు వాన దెబ్బ లేకుండా సెమీస్ సజావుగా సాగితే భారీ బ్యాటింగ్ లైనప్ కలిగిన టీమిండియాకు లక్ష్యాన్ని ఛేదించడంలో ఇబ్బంది ఉండకపోవచ్చు. ఒకవేళ నేడు కూడా మ్యాచ్ మధ్యలో వర్షం కారణంగా ఆటకు అంతరాయం కలిగితే డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం భారత లక్ష్యాన్ని సవరిస్తారు. భారత ఇన్నింగ్స్‌లో కనీసం 20 ఓవర్లు కూడా సాధ్యంకాకపోతే మ్యాచ్ రద్దయినట్లు ప్రకటిస్తారు. ఈ నేపథ్యంలో నిబంధనల ప్రకారం లీగ్ దశలో టాప్ ర్యాంక్‌లో నిలిచిన భారత జట్టు ఫైనల్‌కు చేరుకుంటుంది.

**భారత్, న్యూజిలాండ్ సెమీఫైనల్ నేడు కొనసాగింపు • మ్యాచ్‌కు వర్షం కారణంగా అంతరాయం**

**46.1 ఓవర్లలో కివీస్ 211/5 • ఇదే స్కోరు నుంచి మ్యాచ్ ముందుకు • రాణించిన భారత బౌలర్లు**

**రాస్ టేలర్, విలియమ్సన్ అర్ధసెంచరీలు • నేటి మధ్యాహ్నం 3 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం**

**మాంచెస్టర్:** ప్రపంచ కప్ తొలి సెమీస్ మ్యాచ్ రెండో రోజుకు చేరింది. సుదీర్ఘ సమయం పాటు కురిసిన వర్షం కారణంగా మంగళవారం ఆట అర్ధాంతరంగా నిలిచిపోయింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న న్యూజిలాండ్ మ్యాచ్ ఆగిపోయే సమయానికి 46.1 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 211 పరుగులు చేసింది. రాస్ టేలర్ (85 బంతుల్లో 67 బ్యాటింగ్; 3 ఫోర్లు, 1 సిక్స్), విలియమ్సన్ (95 బంతుల్లో 67; 6 ఫోర్లు) అర్ధ సెంచరీలు సాధించారు. ఐదుగురు భారత బౌలర్లు తలా ఒక వికెట్ తీశారు. ప్రస్తుతం టేలర్‌తో పాటు లాథమ్ (3 బ్యాటింగ్) క్రీజ్‌లో ఉన్నాడు.

### ఎదురుచూపులు...

కివీస్ ఇన్నింగ్స్‌లో భువనేశ్వర్ వేసిన 47వ ఓవర్ తొలి బంతికి టేలర్ రెండు పరుగులు తీశాడు. ఈ దశలో వర్షం వచ్చింది. కొన్ని చినుకుల వరకు అంపైర్లు ఆగినా... చహల్ మైదానంలో జారడం, వాన పెరిగితే పిచ్ పాడయ్యే ప్రమాదం ఉండటంతో వెంటనే ఆటను నిలిపివేశారు. భారత కాలమానం ప్రకారం సా. 6.30 గంటలకు ఆట ఆగిపోయింది. ఆ తర్వాతి నుంచి వర్షం పెరగడం, మధ్యలో కొంత తెరిపినిచ్చినా పూర్తిగా తగ్గకపోవడంతో గంటలు గడిచిపోయాయి. దాదాపు రెండున్నర గంటల తర్వాత వాన ఆగడంతో అంపైర్లు పరిస్థితిని సమీక్షించేందుకు సిద్ధమయ్యారు. అయితే ఆ వెంటనే మళ్లీ వర్షం వచ్చింది. కివీస్ ఇన్నింగ్స్‌ను అంతటితో ఆపివేసి భారత్ కనీసం 20 ఓవర్లు ఆడే అవకాశం ఇవ్వాలన్నా రాత్రి గం.11.05కు ఆట ఆరంభం కావాల్సింది. కానీ అలాంటి పరిస్థితి కనిపించలేదు. చివరకు రాత్రి గం.10.52కు మంగళవారం ఆటను యథాతథ స్థితిలో నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు.

### బౌలర్లు భళా...

న్యూజిలాండ్‌ను ప్రపంచ కప్ ఆసాంతం వేధించిన ఓపెనింగ్ సమస్య సెమీస్‌లోనూ కొనసాగింది.


విలియమ్సన్ వికెట్ తీసిన చహల్‌కు రోహిత్, కోహ్లి అభినందన

భువీ, బుమ్రా వేసిన తొలి రెండు ఓవర్లు మెయిడిన్లుగా ముగియగా, తీవ్రంగా ఇబ్బంది పడుతూ ఆడిన గప్టిల్ (1)ను చక్కటి బంతితో బుమ్రా పెవిలియన్ పంపించాడు. స్లిప్‌లో కోహ్లి అద్భుత రీతిలో ఈ క్యాచ్‌ను అందుకున్నాడు. ఎనిమిదో ఓవర్ చివరి బంతికి గానీ తొలి ఫోర్ కొట్టలేకపోయిన కివీస్... తొలి 10 ఓవర్లలో 27 పరుగులే చేయగలిగింది. ఈ దశలో నికోల్స్ (51 బంతుల్లో 28; 2 ఫోర్లు), విలియమ్సన్ కలిసి జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. రెండో వికెట్‌కు వీరిద్దరు 68 పరుగులు జత చేశారు. అయితే భారత బౌలర్లు కట్టుదిట్టంగా బంతులు వేయడంతో కివీస్ స్కోరు బాగా నెమ్మదిగా సాగింది. ఈ జోడి కుదురుకుంటున్న దశలో జడేజా టర్నింగ్ బంతితో నికోల్స్ స్టంప్స్‌ను పడగొట్టాడు. దాంతో ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే బాధ్యత కెప్టెన్‌తో పాటు మరో సీనియర్ టేలర్‌పై పడింది. అయితే ఈ జంట కూడా బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కోలేక మరీ నెమ్మదిగా ఆడింది. ఒక దశలో 80 బంతుల పాటు న్యూజిలాండ్ ఫోర్ కూడా కొట్టలేకపోయింది! ఎట్టకేలకు చహల్ ఓవర్లో రెండు ఫోర్లు సాధించిన కివీస్ తడబాటును అధిగమించే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో విలియమ్సన్ 79 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 65 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యానికి విలియమ్సన్, టేలర్ ఏకంగా 102 బంతులు తీసుకున్నారు. చివరకు చహల్ బౌలింగ్‌లో చెత్త షాట్‌కు విలియమ్సన్ ఔటయ్యాడు. వెంటనే నీషమ్ (12), గ్రాండ్‌హోమ్ (16) పెవిలియన్ చేరారు. మరో వైపు చహల్ బౌలింగ్‌లో సిక్సర్‌తో టేలర్ 73 బంతుల్లో హాఫ్ సెంచరీ మార్క్‌ను చేరుకున్నాడు. చివర్లో భారత బౌలర్లు కట్టు తప్పడంతోపాటు నాసిరకమైన ఫీల్డింగ్‌తో 5 ఓవర్లలో కివీస్ 47 పరుగులు చేయగలిగింది. వారి ఇన్నింగ్స్‌లో 153 డాట్ బాల్స్ ఉండటం ఆ జట్టు బ్యాటింగ్ వైఫల్యానికి నిదర్శనం.


టేలర్


విలియమ్సన్

### మ్యాచ్ రద్దయితే... మనమే ఫైనల్‌కు

వాతావరణ శాఖ అంచనా ప్రకారం మాంచెస్టర్‌లో బుధవారం కూడా పరిస్థితి అంత మెరుగ్గా ఏమీ లేదు. ఒక వేళ మ్యాచ్ సమయంలో మళ్లీ వర్షం పడితే కివీస్ ఇన్నింగ్స్‌ను అక్కడితోనే ముగించి డక్‌వర్త్ లూయిస్ ప్రకారం భారత్‌కు లక్ష్యాన్ని నిర్దేశించే అవకాశం ఉంది. కనీసం 20 ఓవర్ల ఆట సాధ్యమైనా డక్‌వర్త్ లూయిస్ వర్తిస్తుంది. అదీ జరగకుండా పూర్తిగా రద్దయితే మాత్రం లీగ్ దశలో టాప్ ర్యాంలో నిలిచిన భారత్ ఫైనల్‌కు చేరుతుంది. నిజానికి మంగళవారం మళ్లీ వర్షం రావడమే భారత్‌కు మంచిదైంది. మ్యాచ్‌ను 20 ఓవర్లకు కుదిస్తే టీమిండియా విజయానికి 148 పరుగులు చేయాల్సిన స్థితిలో ఉంది. టి20 స్టార్లు టీమ్‌లో ఉన్నా...వర్షం ఆగిన తర్వాత పిచ్‌లో వచ్చే మార్పు, మబ్బు పట్టిన వాతావరణంలో కివీస్ బౌలర్లు స్వింగ్‌తో చెలరేగిపోయే ప్రమాదం ఉండేది. అదే జరిగితే భారత్‌కు ఛేదన కష్టంగా మారిపోయేదేమో!

### భారత్‌కు రెండోసారి...

ప్రపంచకప్‌లో భారత్ ప్రత్యర్థిగా ఉన్న ఓ మ్యాచ్ రిజర్వ్ డేకు వాయిదా పడటం ఇది రెండోసారి. ఇంగ్లండ్ ఆతిథ్యమిచ్చిన 1999 ప్రపంచకప్‌లో తొలిసారి ఈ సంఘటన జరిగింది. బర్మింగ్‌హామ్‌లో మే 29న భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య లీగ్ మ్యాచ్ ఇలా జరిగింది. తొలి రోజు భారత ఇన్నింగ్స్ (232/8) ముగిసి, ఇంగ్లండ్ ఇన్నింగ్స్ ప్రారంభమయ్యాక వర్షం రావడంతో మే 30న ఈ మ్యాచ్‌ను కొనసాగించారు. ఈ మ్యాచ్‌లో భారత్ 63 పరుగుల తేడాతో గెలిచింది.

### తొలి బంతికే రివ్యూ పోయింది!

భువనేశ్వర్ వేసిన మ్యాచ్ తొలి బంతి గప్టిల్ ప్యాడ్లను తాకడంతో భారత ఆటగాళ్లు ఎల్బీడబ్ల్యూ కోసం గట్టిగా అప్పీల్ చేశారు. అయితే అంపైర్ కెటిల్‌బరో తిరస్కరించడంతో కోహ్లి రివ్యూ కోరాడు. రీప్లేలో బంతి లెగ్‌స్టంప్‌కు దూరంగా వెళుతున్నట్లు తేలింది. దాంతో గప్టిల్ బతికిపోగా... మొదటి బంతికే రివ్యూ కోల్పోయిన భారత్ తీవ్రంగా నిరాశ చెందింది.

# విజేత అర్జున్



**సాక్షి, హైదరాబాద్:** కామన్వెల్త్ చెస్ చాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారులు తమ ఆధిపత్యాన్ని చాటుకున్నారు. న్యూఢిల్లీలో ముగిసిన ఈ టోర్నమెంట్‌లో 16 విభాగాల్లో భారత క్రీడాకారులు క్లీన్‌స్వీప్ చేశారు. తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఎరిగైసి అర్జున్ ఆరు పాయింట్లతో అండర్-16 ఓపెన్ విభాగంలో విజేతగా నిలిచి స్వర్ణ పతకాన్ని దక్కించుకున్నాడు. తొమ్మిది గేమ్‌లు ఆడిన అర్జున్ ఐదు విజయాలు సాధించాడు. రెండు గేమ్‌లను 'డ్రా' చేసుకొని, మరో రెండు గేముల్లో ఓడిపోయాడు. అండర్-14 బాలికల విభాగంలో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి చిన్నం వైష్ణవి, అండర్-14 ఓపెన్ విభాగంలో తెలంగాణ ప్లేయర్ గంపా ఆదిత్య, అండర్-20 బాలికల విభాగంలో మౌనిక అక్షయ కాంస్య పతకాలు గెలిచారు. సీనియర్ ఓపెన్ విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్ అభిజిత్ గుప్తా ఐదోసారి చాంపియన్‌గా నిలిచాడు. మహిళల విభాగంలో తానియా సచ్‌దేవ్ విజేతగా నిలిచింది.

# మీరాబాయికి స్వర్ణం

**మత్స్య సంతోషికి రజతం**





**అపియా (సమోవా):** కామన్వెల్త్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో తొలి రోజు భారత్ పతకాల పంట పండించింది. సీనియర్, జూనియర్, యూత్ విభాగాల్లో కలిపి మొదటి రోజు భారత్‌కు మొత్తం 13 పతకాలు వచ్చాయి. ఇందులో ఎనిమిది స్వర్ణాలు, మూడు రజతాలు, రెండు కాంస్యాలు ఉన్నాయి. ప్రపంచ మాజీ చాంపియన్ మీరాబాయి చాను సీనియర్ మహిళల 49 కేజీల విభాగంలో విజేతగా నిలిచింది. ఆమె మొత్తం 191 కేజీలు (స్నాచ్‌లో 84+క్లీన్ అండ్ జెర్క్‌లో 107 కేజీలు) బరువెత్తి అగ్రస్థానాన్ని సంపాదించింది. సీనియర్ మహిళల 55 కేజీల విభాగంలో ఆంధ్రప్రదేశ్ లిఫ్టర్ మత్స్య సంతోషి రజత పతకం సొంతం చేసుకుంది. సంతోషి మొత్తం 182 కేజీలు (స్నాచ్‌లో 80+క్లీన్ అండ్ జెర్క్‌లో 102 కేజీలు) బరువెత్తి రెండో స్థానంలో నిలిచింది. ఇదే విభాగంలో భారత్‌కే చెందిన బింధ్యారాణి దేవి (183 కేజీలు) స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. సీనియర్ మహిళల 45 కేజీల విభాగంలో జిల్లి దాలబెహెరా (164 కేజీలు) కూడా బంగారు పతకాన్ని దక్కించుకుంది.



# అమిత్‌కు నేరుగా చోటు

**ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు భారత జట్టు ప్రకటన**

**న్యూఢిల్లీ:** ఇటీవల ఆసియా చాంపియన్‌షిప్‌లో స్వర్ణం గెలిచిన భారత స్టార్ బాక్సర్ అమిత్ పంగల్... ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే భారత జట్టులోకి నేరుగా ఎంపికయ్యాడు. అతనికి ఎలాంటి ట్రయల్స్ నిర్వహించకుండానే ఈ మెగా ఈవెంట్‌లో బరిలోకి దిగే జాతీయ జట్టులోకి భారత బాక్సింగ్ సమాఖ్య (బీఎఫ్ఐ) ఎంపిక చేసింది. సెప్టెంబర్ 7 నుంచి 21 వరకు రష్యాలోని ఎకతెరీన్‌బర్గ్‌లో ఈ మెగా ఈవెంట్ జరగనుంది. మొత్తం ఎనిమిది వెయిట్ కేటగిరీలలో పోటీపడే భారత జట్టును మంగళవారం ప్రకటించారు. వరుసగా నాలుగు ఆసియా చాంపియన్‌షిప్‌లలో పతకాలు సాధించిన శివ థాపాను ట్రయల్స్‌లో ఓడించి 63 కేజీల విభాగంలో మనీశ్ కౌశిక్ బెర్త్ సాధించడం విశేషం.

### భారత బాక్సింగ్ జట్టు

అమిత్ పంగల్ (52 కేజీలు), మనీశ్ కౌశిక్ (63 కేజీలు), కవీందర్ సింగ్ బిష్త్ (57 కేజీలు), దుర్యోధన్ సింగ్ నేగి (69 కేజీలు), ఆశిష్ కుమార్ (75 కేజీలు), బ్రిజేష్ యాదవ్ (81 కేజీలు), సంజీత్ (91 కేజీలు), సతీష్ కుమార్ (+91 కేజీలు).



# సెరెనా..శ్రమించి సెమీస్‌కు

**హలెప్, స్వితోలినా, స్ట్రికోవా కూడా • వింబుల్డన్ ఓపెన్ టోర్నీ**

**లండన్:** సెరెనా అడుగులు మార్గరెట్ కోర్ట్ రికార్డు దిశగా పడుతున్నాయి. వింబుల్డన్ ఓపెన్‌లో 12సారి సెమీస్ చేరిన ఈ నల్లకలువ 24వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌పై కన్నేసింది. ముందుగా 37 ఏళ్ల వెటరన్ స్టార్ ఇక సెమీస్ విజయమే లక్ష్యంగా తన రాకెట్‌ను రఫ్ఫాడించనుంది. సెరెనాతోతో పాటు ఏడో సీడ్ సిమోనా హలెప్ (రొమేనియా), ఎనిమిదో సీడ్ స్వితోలినా (ఉక్రెయిన్), బార్బరా స్ట్రికోవా (చెక్ రిపబ్లిక్) సెమీఫైనల్లోకి దూసుకెళ్లారు.

### కాస్త రిస్కీ అయింది!

మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో సెరెనా గెలిచేందుకు తుదికంటా పోరాడాల్సి వచ్చింది. సహచర అమెరికా క్రీడాకారిణి అలీసన్ రిస్కీని ఓడించేందుకు సెరెనా మూడు సెట్లదాకా శ్రమించింది. 2 గంటల ఒక నిమిషం పాటు జరిగిన ఈ పోరులో చివరకు సెరెనా 6-4, 4-6, 6-3తో అన్‌సీడెడ్ రిస్కీపై గెలిచి ఊపిరి పీల్చుకుంది. వింబుల్డన్ కోర్టులపై అమెరికా నల్లకలువకు ఇది 97వ విజయం కావడం విశేషం. మిగతా క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌ల్లో ఏడో సీడ్ హలెప్ 7-6 (7/4), 6-1తో షువాయ్ జంగ్ (చైనా)పై గెలుపొందగా, ఎనిమిదో సీడ్ స్వితోలినా 7-5, 6-4తో కరోలినా ముచోవా (చెక్ రిపబ్లిక్)పై విజయం సాధించింది.

### సెరెనా... 10 వేల డాలర్ల జరిమానా కట్టు!

ఏడు సార్లు వింబుల్డన్ చాంపియన్ అయిన సెరెనా విలియమ్స్‌పై ఆల్ ఇంగ్లండ్ క్లబ్ జరిమానా విధించింది. టోర్నీకి ముందు ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొన్న ఆమె టెన్నిస్ కోర్టును రాకెట్‌తో నష్టపరిచినట్లు తేలింది. దీంతో 10 వేల డాలర్లు (రూ.6.85 లక్షలు) జరిమానాగా చెల్లించాలని ఆల్ ఇంగ్లండ్ క్లబ్ 37 ఏళ్ల అమెరికన్ స్టార్‌ను ఆదేశించింది.

### క్వార్టర్స్ దాటిన స్ట్రికోవా

చెక్ రిపబ్లిక్ ప్లేయర్ బార్బరా స్ట్రికోవా ఎట్టకేలకు గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో క్వార్టర్ ఫైనల్ అంచెను దాటింది. 17 ఏళ్లుగా వింబుల్డన్ బరిలో దిగుతున్న ఆమె ఒకే ఒక్కసారి క్వార్టర్స్ (2014) చేరింది. ఇపుడు క్వార్టర్స్‌లో స్ట్రికోవా 7-6 (7/5), 6-1తో జొహానా కొంటా (బ్రిటన్)పై విజయం సాధించింది. **గురువారం జరిగే సెమీఫైనల్స్‌లో స్ట్రికోవాతో సెరెనా; స్వితోలినాతో హలెప్ ఆడతారు.**

### డబుల్స్‌లో తొలి 12-12 టై బ్రేక్

మారథాన్ మ్యాచ్‌లకు మంగళం పలకాలని భావించిన ఆల్ ఇంగ్లండ్ క్లబ్ ఈ ఏడాది 12-12 స్కోరు వద్ద టైబ్రేక్‌కు కటాఫ్ మార్క్ ఇచ్చింది. ఈ కటాఫ్ స్కోరు తొలిసారిగా పురుషుల డబుల్స్ మ్యాచ్‌లో నమోదైంది. హెన్రీ కొంటినెన్ (ఫిన్‌లాండ్)-జాన్ పీర్స్ (ఆస్ట్రేలియా), రాజీవ్ రామ్ (అమెరికా)-జో సాలిస్‌బరీ (బ్రిటన్) జంటల మధ్య జరిగిన మ్యాచ్‌లో చివరికి హెన్రీ-పీర్స్ జోడీ 7-6 (7/2), 6-4, 3-6, 13-12 (7/2)తో నెగ్గింది. గతేడాది అండర్సన్, ఇస్నెర్‌ల మధ్య పురుషుల సింగిల్స్ సెమీస్ మ్యాచ్‌లో ఆఖరి సెట్ 26-24 స్కోరుదాకా అప్రతిహతంగా సాగింది. దీంతో ఈ ఏడాది నుంచి 12-12 వద్ద టైబ్రేక్‌ను అనివార్యం చేశారు.

### నేటి షెడ్యూల్

(పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్)

జొకోవిచ్ x డేవిడ్ గాఫిన్
ఫెడరర్ x నిషికోరి
గిడో పెల్లా x బాటిస్టా అగుట్
నాదల్ x స్యామ్ క్వెరీ

సాయంత్రం 5.30 నుంచి స్టార్ స్పోర్ట్స్ సెలెక్ట్-2లో ప్రత్యక్ష ప్రసారం


స్వితోలినా


స్ట్రికోవా


హలెప్


"మ్యూచువల్ ఫండ్ లోని రిస్క్‌ని అర్థం చేసుకుని ఇన్వెస్ట్ చేయడం నిజమే మరి."
• మ్యూచువల్ ఫండ్‌లోని రిస్క్‌ని అర్థం చేసుకున్న తర్వాతనే అందులో ఇన్వెస్ట్ చెయ్యండి
• ఎక్కువ కాలం పెటుబడి పెట్టగల డబ్బునే ఇన్వెస్ట్ చెయ్యండి
MUTUAL FUNDS
నిజమే మరి
మరింత సమాచారానికై mutualfundssahihai.com ని సందర్శించండి | @mutualfundssahihai | @MFSahiHai | Mutual Funds Sahi Hai
మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు మార్కెట్‌లోని సంక్షోభాలకు లోబడి ఉంటాయి, స్కీముకి సంబంధించిన అన్ని డాక్యుమెంట్స్‌నీ జాగ్రత్తగా చదవండి.
1102.2019C

# కర్నాటకంలో కొత్త ట్విస్ట్


స్పీకర్‌తో మాట్లాడుతున్న సిద్ధరామయ్య, కాంగ్రెస్ కర్ణాటక చీఫ్ దినేశ్ తదితరులు

- 9 మంది రాజీనామాలు ఫార్మాట్‌లో లేవన్న స్పీకర్ రమేశ్ కుమార్
- పొరపాటు నిర్ణయంతో చరిత్రలో ద్రోహిగా నిలిచిపోలేనని వ్యాఖ్య
- రెబెల్స్‌ను అనర్హులుగా ప్రకటించాలని కాంగ్రెస్ డిమాండ్
- రాజీనామా చేసిన మరో కాంగ్రెస్ ఎమ్మెల్యే • మళ్లీ ముంబైకి చేరిన రెబెల్స్

**సాక్షి, బెంగళూరు/ ముంబై:** కర్ణాటక రాజకీయ పరిణామాలు రోజుకో మలుపు తిరుగుతున్నాయి. రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో తను తీసుకునే ప్రతి నిర్ణయమూ చరిత్రలో నిలిచిపోతుందని, తప్పుడు నిర్ణయంతో చరిత్రలో ద్రోహిగా మారడం ఇష్టం లేదని స్పీకర్ రమేశ్ కుమార్ వ్యాఖ్యానించారు. అంతేకాకుండా, తనకు అందిన 14 మంది ఎమ్మెల్యేల రాజీనామా లేఖల్లో 5 మాత్రమే ఫార్మాట్ ప్రకారం ఉన్నాయని ప్రకటించారు. కాంగ్రెస్‌కు చెందిన శివాజీనగర ఎమ్మెల్యే రోషన్ బేగ్ కూడా రెబెల్స్ జాబితాలో చేరిపోగా, సర్కారు మనుగడ ఇప్పుడు స్పీకర్ నిర్ణయంపైనే ఆధారపడి ఉంది.

### బేగ్ రాజీనామా లేఖ అందింది

'నేను జాగరూకతతో వ్యవహరించాల్సి ఉంది. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో నేను తీసుకునే ప్రతి నిర్ణయమూ చరిత్రలో నిలిచిపోతుంది. అందుకే ఎట్టి పరిస్థితుల్లోనూ తప్పు చేయకూడదు. భవిష్యత్ తరాలు నన్నో అపరాధిగా చూస్తాయి'అని కర్ణాటక అసెంబ్లీ స్పీకర్ రమేశ్ అన్నారు. మంగళవారం విధాన సౌధలో స్పీకర్ మీడియాతో మాట్లాడారు. రాజీనామాలు సమర్పించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలన్న కాంగ్రెస్ అభ్యర్థనపై ఆయన స్పందిస్తూ.. రెబెల్ ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయింపులకు పాల్పడినట్లు ఈ నెల 11వ తేదీలోగా ఆధారాలను చూపాలని కోరానని, సమాధానాన్ని బట్టి చర్యలుంటాయని వివరించారు. రాజీనామా చేసిన 14 మందిలో 11 మంది కాంగ్రెస్, ముగ్గురు జేడీఎస్‌కు చెందిన ఎమ్మెల్యేలున్నారని వెల్లడించారు. రాజీనామాలను ఆమోదించాలా లేక మరే ఇతర చర్యలు చేపట్టాలా అనే విషయంలో అనుభవజ్ఞుల సలహాలు, రూల్‌బుక్ ప్రకారం నడుచుకుంటానన్నారు. మంత్రుల రాజీనామాలు గవర్నర్ పరిధిలోకి వస్తాయని చెప్పారు. 'ఎమ్మెల్యే రోషన్ బేగ్ రాజీనామా లేఖ ఈ రోజే అందింది. దానిని ఇంకా పరిశీలించలేదు. ఇప్పటికే అందిన అధికార కాంగ్రెస్, జేడీఎస్‌లకు చెందిన 14 ఎమ్మెల్యేల రాజీనామా పత్రాల్లో ఐదుగురివే ఫార్మాట్ ప్రకారం ఉన్నాయి. మిగతా వారికి ఈ మేరకు సమాచారం అందించాం. వారు మరోసారి రాజీనామా పత్రాలు అందజేస్తే పరిశీలిస్తా'అని స్పష్టం చేశారు.

### సీఎల్పీ భేటీకి రాని 20 మంది

మంగళవారం ఉదయం బెంగళూరులో కాంగ్రెస్ శాసనసభా పక్షం సమావేశం జరిగింది. పదవులకు రాజీనామా చేసిన వారితోపాటు మొత్తం 20 మంది ఈ భేటీకి గైర్హాజరయ్యారని సమాచారం. ఈ సమావేశం అనంతరం కాంగ్రెస్ నేతలు స్పీకర్‌ను కలిశారు. తమ పార్టీ రెబెల్ ఎమ్మెల్యేలపై ఫిరాయింపుల చట్టం కింద వెంటనే అనర్హత వేటు వేయాలని కోరారు. లెజిస్లేచర్ పార్టీ సమావేశంలో చేసిన తీర్మానం ప్రతిని వారు స్పీకర్‌కు అందజేశారు. అనంతరం రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు దినేశ్ గుండూరావు మీడియాతో మాట్లాడుతూ.. 'ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు రాజీనామాలు చేసి, బీజేపీతో చేతులు కలిపిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని స్పీకర్‌ను కోరాం. స్పీకర్ వారిని అనర్హులుగా ప్రకటించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి'అని వెల్లడించారు. రాజీనామాలు సమర్పించిన ఎమ్మెల్యేలంతా వెనక్కి తిరిగి రావాలని, లేకుంటే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని సీఎల్పీ నేత సిద్ధరామయ్య హెచ్చరించారు. 'రాజ్యాంగం పదో షెడ్యూల్‌లోని ఫిరాయింపుల చట్టంలోని నిబంధనలు తెలియకనే వారంతా రాజీనామా చేశారు. బీజేపీ వలలో చిక్కుకున్న ఆ ఎమ్మెల్యేలు ఆ పార్టీతో చేతులు కలిపారు. మోదీ, అమిత్ షా ఈ వ్యవహారంలో తలదూరుస్తున్నారు' అని అన్నారు. అంతకుముందు విధానసౌధ వద్ద ఉన్న గాంధీ విగ్రహం ఎదుట కాంగ్రెస్ నేతలు ధర్నా చేశారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ సీనియర్ నేతలు గులాం నబీ ఆజాద్, బీకే హరిప్రసాద్ బెంగళూరుకు చేరుకుని ఎమ్మెల్యేలు, నేతలతో చర్చలు ప్రారంభించారు.

### రెబెల్స్ మళ్లీ ముంబైకి..

కర్ణాటక తిరుగుబాటు శాసనసభ్యులు సోమవారం ముంబై నుంచి గోవాకు బయలుదేరి మార్గమధ్యంలో సతారా సమీపంలో ఆగిపోయారు. తమ రాజీనామాలపై స్పీకర్ తీసుకునే నిర్ణయం కోసం వారు అక్కడే మంగళవారం ఎదురు చూశారు. కొందరి ఎమ్మెల్యేల రాజీనామాలు నిర్దేశిత నమూనా ప్రకారం లేవని స్పీకర్ ప్రకటించడంతో తిరిగి ముంబై వెళ్లారు.

### రిసార్టులో జేడీఎస్ ఎమ్మెల్యేలు

ప్రభుత్వాన్ని కాపాడుకునే పనిలో ముఖ్యమంత్రి కుమారస్వామి కూడా బిజీబిజీగా ఉన్నారు. తన పార్టీ ఎమ్మెల్యేలలతో సమావేశాలను నిర్వహిస్తూ ప్రభుత్వానికి ఎలాంటి ఢోకా లేదని చెబుతున్నారు. నగర శివార్లలోని ఒక రిసార్టులో జేడీఎస్ ఎమ్మెల్యేలు మకాం వేశారు. ఎవరూ బీజేపీ ప్రలోభాలకు లోనుకావద్దని, మరో నాలుగు రోజుల్లో అంతా సర్దుకుంటుందని చెప్పారు.

### హెచ్చరికలకు లొంగని రెబెల్స్

రాజీనామాలు చేసిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేస్తామంటూ కాంగ్రెస్ హెచ్చరికలు పంపినప్పటికీ వారు దిగివచ్చే సూచనలు కనిపించడం లేదు. 'రాజీనామాలను ఉపసంహరించుకునే ప్రశ్నే లేదు. స్వచ్ఛందంగా రాజీనామాలు ఇచ్చాం. ఎటువంటి పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడలేదు'అని కాంగ్రెస్ ఎమ్మెల్యే సోమశేఖర్ మీడియాతో వ్యాఖ్యానించారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలతో ఇటీవల సస్పెండయిన ఎమ్మెల్యే రోషన్ బేగ్ మంగళవారం రాజీనామా సమర్పించినట్లు ప్రకటించారు. అనంతరం కొద్ది సేపటికే.. ఐఎంఏ గ్రూప్ చిట్ ఫండ్ కుంభకోణం కేసులో విచారణకు హాజరు కావాలంటూ ఎమ్మెల్యే బేగ్‌కు సిట్ నోటీసులు జారీ చేసింది. ఐఎంఏ గ్రూప్ ముఖ్య నిర్వాహకుడు, ఐఎంఏ జ్యుయెల్లర్స్ అధినేత మొహమ్మద్ మన్సూర్ ఖాన్ ప్రస్తుతం అజ్ఞాతంలో ఉన్నారు. రోషన్‌బేగ్ తన వద్ద నుంచి రూ.400 కోట్లు తీసుకుని, ఎగనామం పెట్టాడని ఆయన విడుదల చేసిన ఆడియోలో ఆరోపించడం కలకలం రేపింది.

# సభకు కర్ణాటక సెగ

- పార్లమెంట్ ఉభయసభల్లో కాంగ్రెస్ ఆందోళనలు
- ఎమ్మెల్యేలను 'వేటాడటాన్ని' బీజేపీ ఆపాలంటూ నినాదాలు


'కర్ణాటక'పై ప్రభుత్వ వైఖరికి నిరసనగా లోక్‌సభ నుంచి వాకౌట్ చేస్తున్న కాంగ్రెస్ సభ్యులు

**న్యూఢిల్లీ:** కర్ణాటకలో కాంగ్రెస్–జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వాన్ని కూల్చేయడానికి ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షాల సూచనల మేరకు బీజేపీ విశ్వ ప్రయత్నాలు చేస్తోందంటూ పార్లమెంటులో ఈ అంశంపై మంగళవారం కాంగ్రెస్ ఆందోళనలు చేపట్టింది. ఆ పార్టీ సభ్యులు ఆందోళనను విరమించకపోవడం, వివిధ ఇతర అంశాలపై తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), సీపీఐ, సీపీఎం సభ్యులు కూడా ఆందోళన చేపట్టడంతో రాజ్యసభ మంగళవారం పూర్తిగా వాయిదా పడింది. ఉదయం రాజ్యసభ అధ్యక్షుడు వెంకయ్య నేతృత్వంలో సభ ప్రారంభం కాగానే కాంగ్రెస్ సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చి ఆందోళనలు, నినాదాలు చేశారు. దీంతో సభను వెంకయ్య వాయిదా వేసి, మళ్లీ మధ్యాహ్నం 12 గంటలకు రాజ్యసభ సమావేశం ప్రారంభమవుతుందని చెప్పారు. 12 గంటలకు సభ తిరిగి సమావేశమైనప్పుడు రాజ్యసభ ఉపాధ్యక్షుడు హరివంశ్ కార్యకలాపాలను చేపట్టారు. ఆ సమయాన్ని ప్రశ్నోత్తరాలకు కేటాయించినప్పటికీ, సభ్యులు సభ మొదలవగానే వెల్‌లోకి వచ్చి నిరసనలకు దిగారు. దీంతో మధ్యాహ్నం రెండు గంటలకు సభను వాయిదా వేస్తున్నట్లు హరివంశ్ ప్రకటించారు. 2 గంటలకు సమావేశమైనప్పుడు పరిస్థితిలో మార్పు లేకపోవడంతో రాజ్యసభను బుధవారానికి వాయిదా వేశారు. కాగా, మంగళవారం ఉదయం సభా కార్యకలాపాలను ప్రారంభించిన అనంతరం వెంకయ్య మాట్లాడుతూ ముందే నిర్ణయించిన, సభలో ప్రస్తుతం చర్చించాల్సిన విషయాలను పక్కనబెట్టి కర్ణాటక అంశంపై చర్చించేందుకు అనుమతి ఇవ్వాలంటూ కాంగ్రెస్ సభ్యుడు బీకే హరిప్రసాద్ నుంచి తనకు నోటీసు అందిందనీ, కానీ దీనికి ఒప్పుకోవడం లేదని తెలిపారు.

### లోక్‌సభలో నినాదాలు చేసిన రాహుల్

కర్ణాటక అంశంపై లోక్‌సభలోనూ కాంగ్రెస్ సభ్యులు ఆందోళనకు దిగారు. ఎమ్మెల్యేలను 'వేటాడే' చర్యలను బీజేపీ ఆపివేయాలని డిమాండ్ చేస్తూ లోక్‌సభ నుంచి ఆ పార్టీ ఎంపీలు బయటకు వెళ్లిపోయారు. అంతకుముందు సభలో కాంగ్రెస్‌పక్ష నాయకుడు అధిర్ రంజన్ మాట్లాడుతూ కర్ణాటకలో తమ ప్రభుత్వాన్ని కూల్చడమే బీజేపీ లక్ష్యమని ఆరోపించారు. కాంగ్రెస్ సభ్యులు లోక్‌సభలోనూ వెల్‌లోకి వచ్చి నినాదాలు చేశారు. చౌధరి మాట్లాడుతుండగా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు, ఎంపీ రాహుల్ గాంధీ సభలోకి వచ్చారు. 'నియంతృత్వం నశించాలి. వేటాడే రాజకీయాలను ఆపేయాలి' అని నినాదాలు చేశారు. ఈడీ, సీబీఐల చేత కేసులు పెట్టిస్తామని బెదిరిస్తూ కాంగ్రెస్ ఎమ్మెల్యేల చేత బీజేపీయే రాజీనామాలు చేయిస్తోందని బీకే హరివంశ్ ఆరోపించారు. కర్ణాటక ప్రభుత్వాన్ని అస్థిర పరచడంలో తమ పాత్ర లేదని బీజేపీ చెప్పడం పెద్ద అబద్ధమన్నారు.

# 150 కి.మీ. పాదయాత్ర చేయాలి


ఢిల్లీలో బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశానికి వస్తున్న ప్రధాని మోదీ

- బీజేపీ ఎంపీలకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు
- గాంధీ, పటేల్‌ల జయంతి సందర్భంగా నిర్వహించాలని వెల్లడి

**న్యూఢిల్లీ:** మహాత్మా గాంధీ, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతిలను పురస్కరించుకొని బీజేపీ ఎంపీలు పాదయాత్ర చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. బీజేపీ ఎంపీలందరూ అక్టోబర్ 2 నుంచి 31 వరకు వారి వారి నియోజకవర్గాల్లో 150 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేయాలని అన్నారు. ఈ మేరకు మంగళవారం జరిగిన బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఎంపీలను ప్రధాని మోదీ కోరినట్లు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి మీడియాకు తెలిపారు. అలాగే పార్టీ బలహీనంగా నియోజకవర్గాల్లో రాజ్యసభ సభ్యులు పర్యటించాలని మోదీ సూచించారు. మహాత్మా గాంధీ జయంతి రోజైన అక్టోబర్ 2, వల్లభ్‌భాయ్ పటేల్ జయంతి రోజైన అక్టోబర్ 31లను పురస్కరించుకుని బీజేపీ ఎంపీలందరూ తప్పనిసరిగా ఈ పాదయాత్ర నిర్వహించాలని మోదీ తెలిపారు. పాదయాత్రలో ముఖ్యంగా గ్రామాలపై దృష్టి కేంద్రీకరించాలని, ప్రజల్ని నేరుగా కలుసుకోవాలని సూచించారు. ప్రజల నుంచి కేంద్ర ప్రభుత్వం పట్ల అభిప్రాయాన్ని ఎంపీలు తెలుసుకోవాలని, అలాగే ప్రజలు ప్రభుత్వం నుంచి ఏం కోరుకుంటున్నారో అడగాలని అన్నారు. యాత్రలో భాగంగా గ్రామాల్లో మొక్కలు నాటడం, పరిశుభ్రత వంటి కార్యక్రమాలు ఉండేలా చూసుకోవాలని సూచించారు.


వెనిజులా రాజధాని కారకస్‌లోని అధ్యక్ష భవనంలో భేటీ సందర్భంగా దేశాధ్యక్షుడు నికొలస్ మదురోతో భారత ఆధ్యాత్మిక గురువు శ్రీ శ్రీ రవిశంకర్ కరచాలనం

## జయలలిత కేసులో జోక్యం చేసుకోలేం

న్యూఢిల్లీ: తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత జయలలితకు వచ్చిన బహుమతుల విషయంపై సీబీఐ దాఖలు చేసిన వ్యాజ్యాన్ని సుప్రీం కోర్టు కొట్టివేసింది. ఈ కేసుకు సంబంధించి మద్రాసు హైకోర్టు ఇచ్చిన తీర్పులో తాము జోక్యం చేసుకోలేమని పేర్కొంది. 1991లో జయలలిత రూ.2.09 కోట్ల విలువైన వస్తువులను బహుమతుల రూపంలో పొందారని.. వాటికి సరైన లెక్కలు చూపలేదని పేర్కొంటూ సీబీఐ 1996లో మద్రాసు హైకోర్టును ఆశ్రయించింది. జయలలిత పుట్టినరోజు సందర్భంగా ఆమెకు ఈ బహుమతులు వచ్చాయని.. డిమాండ్ డ్రాఫ్ట్‌ల రూపంలో ఉన్న ఈ మొత్తాన్ని అధికారిక లెక్కల్లో చూపలేదని ఆరోపించింది.

## కాంగ్రెస్ అధ్యక్షుడి ఎంపికకు కమిటీ ఏదీ?



**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ కొత్త అధ్యక్షుడిని ఎంపిక చేస్తున్న విధానంపై ఆ పార్టీ సీనియర్ నేత జనార్దన్ ద్వివేది మంగళవారం పెదవివిరిచారు. పార్టీ నిబంధనల ప్రకారం చూస్తే ఇప్పటికీ రాహుల్ గాంధీయే అధ్యక్షుడనీ, కొత్త అధ్యక్షుడి ఎంపిక కోసం ఆయనే ఓ కమిటీని నియమించి ఉండాల్సిందన్నారు. 'ఎప్పుడో లోక్‌సభ ఎన్నికల కోసం నియమించిన ఓ కమిటీకి ఆ పని అప్పగించారు. ఇప్పుడు ఎన్నికలు అయిపోయి దాదాపు 50 రోజులైంది. అధ్యక్షుడిని ఎంపిక చేస్తున్న ఆ కమిటీ సమావేశాలకు సీనియర్ నాయకుడు ఏకే ఆంటోని ఒక్కసారి కూడా హాజరుకాలేదు' అని తెలిపారు.

## డిగ్రీలో పాఠ్యాంశంగా ఆరెస్సెస్ చరిత్ర

**నాగ్‌పూర్:** ఆరెస్సెస్ చరిత్రను, దేశ నిర్మాణంలో దాని పాత్రను పాఠంగా చేరుస్తూ నాగ్‌పూర్‌లోని రాష్ట్రశాంత్ తుకడోజి మహరాజ్ యూనివర్సిటీ నిర్ణయం తీసుకుంది. బీఏ ద్వితీయ సంవత్సరంలో ఆరెస్సెస్ చరిత్రను చేర్చింది. దేశ నిర్మాణంలో ఆరెస్సెస్ పాత్రను ఆ పాఠంలోని మూడో భాగం వివరించింది. వీటితోపాటు నాటి సమకాలీన అంశాలైన కాంగ్రెస్ ఏర్పాటు, నెహ్రూల గురించి వివరించింది. అయితే ఆరెస్సెస్‌పై పాఠాన్ని చేర్చడంపై దుమారం రేగింది. బ్రిటీష్ వారితో కలసి పని చేసిన ఆరెస్సెస్ గురించి ఏం పాఠాలు నేర్పుతారంటూ మహారాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి సచిన్ సవాంత్ ట్వీట్ చేశారు. ఆరెస్సెస్ స్వాతంత్ర్యాన్ని వ్యతిరేకించిందని, 52 ఏళ్ల పాటు జాతీయ జెండాను ఎగురవేయలేదని మండిపడ్డారు.

## అయోధ్యపై సత్వర విచారణ చేపట్టాలి



మధ్యవర్తిత్వంతో పరిష్కారమయ్యేలా లేదని సుప్రీంకోర్టులో పిటిషన్

**న్యూఢిల్లీ:** అయోధ్య వివాద పరిష్కారం మధ్యవర్తిత్వంతోనూ పరిష్కారమయ్యే సూచనలు కనిపించడం లేదని, వెంటనే ఈ వ్యవహారంలో జోక్యం చేసుకుని పరిష్కారం చూపాలంటూ దాఖలైన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. రామ జన్మభూమి– బాబ్రీ మసీదు వివాదంలో వాస్తవ కక్షిదారుల్లో ఒకరైన గోపాల్ సింగ్ విశారద్ ఈ మేరకు వేసిన పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ దీపక్ గుప్తా, జస్టిస్ అనిరుద్ధ బోస్‌లతో కూడిన ధర్మాసనం స్వీకరించింది. తో ప్రాముఖ్యమున్న వివాదానికి సామరస్య పూర్వక పరిష్కారం కనుగొనే దిశగా ఎటువంటి అడుగులు పడలేదని విశారద్ తరపున న్యాయవాది తెలిపారు. ఈ పిటిషన్‌పై సత్వరం విచారణ చేపట్టాలన్న ఆయన వినతిపై ధర్మాసనం సానుకూలంగా స్పందించింది. అయోధ్య సమస్య పరిష్కారానికి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎఫ్.ఎం.ఐ. కలీఫుల్లా నేతృత్వంలో ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ కమిటీకి ఆగస్టు 15వ తేదీ వరకు గడువు పొడిగిస్తూ సీజేఐ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం మే 10న ఉత్తర్వులిచ్చింది.

## దేశవ్యాప్తంగా 110 ప్రాంతాల్లో సీబీఐ దాడులు

**న్యూఢిల్లీ:** సీబీఐ అధికారులు మంగళవారం రికార్డు స్థాయిలో సోదాలు చేపట్టారు. ఆంధ్రప్రదేశ్, హైదరాబాద్‌సహా దేశవ్యాప్తంగా 19 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 110 ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలను ప్రధాని మోదీ హయాంలో అవినీతిపై చేపట్టిన అతిపెద్ద చర్యగా భావిస్తున్నారు. హిమాచల్ ప్రదేశ్‌లో చోటుచేసుకున్న రూ.250 కోట్ల స్కాలర్ షిప్ కుంభకోణానికి సంబంధించి పలు విద్యా సంస్థలపై దాడులు జరిపింది. అదేవిధంగా, యూపీలో రద్దయిన నోట్ల చెలామణీ ఆరోపణలపై నాలుగుచోట్ల సోదాలు జరిపింది. రూర్కెలాలోని బోకారో స్టీల్ ప్లాంట్‌లో అవినీతి కేసులో రాంచీ, బొకారో, కోల్‌కతాలోని అధికారుల ఇళ్లపై దాడులు చేసింది. ఈ సందర్భంగా సీబీఐ.. అవినీతి, నేరపూరిత ప్రవర్తన, ఆయుధాల స్మగ్లింగ్ తదితర నేరాలకు సంబంధించి 30 కేసులు నమోదు చేసింది. జమ్మూకశ్మీర్‌లో ఆయుధాల లైసెన్స్ జారీలో అక్రమాలకు సంబంధించి 13 చోట్ల సోదాలు చేశామని సీబీఐ తెలిపింది. మంగళవారం ఉదయం ఏకకాలంలో ప్రారంభమైన ఈ సోదాల్లో 500 మంది అధికారులు పాల్గొన్నట్లు పేర్కొంది. ఈ సందర్భంగా నగదు, నగలతోపాటు పలు బ్యాంకు పత్రాలు, స్థిరాస్తులు, మ్యూచువల్ ఫండ్స్ పత్రాలను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించింది. రూ.1,139 కోట్ల బ్యాంకింగ్ కుంభకోణానికి సంబంధించి సీబీఐ గత వారం 14 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 50 చోట్ల తనిఖీలు చేపట్టిన విషయం తెలిసిందే.

## నేడు అమేథీకి రాహుల్



**అమేథీ (యూపీ)/అహ్మదాబాద్:** తాజా సార్వత్రిక ఎన్నికల్లో తాను పోటీచేసి ఓడిన అమేథీ నియోజకవర్గంలో నేడు రాహుల్‌గాంధీ పర్యటించనున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి చెందిన ప్రత్యర్థి స్మృతి ఇరానీ చేతిలో ఆయన ఓడారు. తన పర్యటన సందర్భంగా రాహుల్ పార్టీ ప్రతినిధులను కలుస్తారు. సలోన్, అమేథీ, గౌరిగంజ్, జగదీశ్‌పూర్, తిలోయి అసెంబ్లీ నియోజకవర్గ బూత్ అధ్యక్షులను కలుసుకుంటారు. అలాగే కొన్ని గ్రామాలను సందర్శించే అవకాశం ఉందని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి తెలిపారు. రాహుల్ 1999 నుంచి అమేథీ లోక్‌సభ స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ప్రస్తుతం ఆయన కేరళలోని వయనాడ్ నుంచి ఎంపీగా గెలిచారు.

### రాహుల్‌కి గుజరాత్ కోర్ట్ సమన్లు

హోంమంత్రి అమిత్ షాను హత్య కేసులో నిందితుడిగా పేర్కొని ఆయన పరువుకు నష్టం కలిగించారన్న కేసులో రాహుల్‌కు గుజరాత్ కోర్టు మంగళవారం సమన్లు జారీ చేసింది. స్థానిక బీజేపీ నేత ఒకరు రాహుల్‌పై ఈ కేసువేశారు. ఈ కేసులో ఆగస్టు 9న హాజరు కావాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. గతంలో మే 1న ఇదే కేసులో అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ రాహుల్‌కి సమన్లు జారీ చేసినప్పటికీ ఆయన లోక్‌సభ సభ్యుడు కావడంతో లోక్‌సభ స్పీకర్ నోటీసును తిరస్కరించారు. దీంతో ఆగస్టు 9న హాజరు కావాలంటూ తాజాగా సమన్లు జారీ చేశారు. ఈ నోటీసును రాహుల్ నివాసంలో నేరుగా అందించనున్నారు. ఏప్రిల్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో రాహుల్ అమిత్ షాపై అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారని స్థానిక బీజేపీ కార్పొరేటర్ ఆరోపించారు. సోహ్రాబుద్దీన్ షేక్ ఎన్‌కౌంటర్ కేసులో అమిత్‌ను సీబీఐ కోర్టు నిర్దోషిగా ప్రకటించింది.

## 'శరవణ' పిటిషన్ కొట్టివేత

సుప్రీంకోర్టు ఆదేశాలతో చెన్నై కోర్టులో లొంగిపోయిన రాజగోపాల్

**న్యూఢిల్లీ/సాక్షి ప్రతినిధి, చెన్నై:** అనారోగ్యంతో ఉన్న కారణంగా జైలుకు వెళ్లేందుకు తనకు మరికొంత సమయం కావాలంటూ 'శరవణ భవన్' హోటళ్ల యజమాని పి.రాజగోపాల్ చేసుకున్న అభ్యర్థనను సుప్రీంకోర్టు మంగళవారం తోసిపుచ్చింది. దీంతో ఆయన చెన్నైలోని సెషన్‌కోర్టులో లొంగిపోయారు. దక్షిణ భారత ఆహారాన్ని అందించడంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన 'శరవణ భవన్' హోటళ్లను స్థాపించిన రాజగోపాల్ ఓ హత్య కేసులో దోషి. ఇద్దరు భార్యలున్న రాజగోపాల్ జ్యోతిష్యాన్ని బాగా నమ్మేవాడు. 2001లో ఓ జ్యోతిష్యుడి మాటను నమ్మిన రాజగోపాల్, తన దగ్గర పనిచేస్తున్న శాంతకుమార్ అనే ఉద్యోగి భార్యను మూడో పెళ్లి చేసుకునేందుకు శాంతకుమార్‌ను అంతమొందించాడు. ఈ కేసులో 2004లో కింది కోర్టు ఆయనతోపాటు మరో 8 మందికి 10 ఏళ్ల జైలు శిక్ష విధించగా, వారంతా హైకోర్టులో అప్పీల్ చేసుకోవడంతో మద్రాసు హైకోర్టు 2009లో శిక్షను పదేళ్ల నుంచి యావజ్జీవానికి పెంచింది. మద్రాసు హైకోర్టు వేసిన శిక్షను ఇటీవలే సుప్రీంకోర్టు సమర్థించింది.


చెన్నై కోర్టు వద్ద రాజగోపాల్

# డాలర్ డ్రీమ్స్‌కి పచ్చజెండా!

అమెరికా కాంగ్రెస్‌లో గ్రీన్‌కార్డు బిల్లు • ఆమోదం పొందితే భారతీయులకు భారీ లబ్ధి

**వాషింగ్టన్:** అమెరికాలో శాశ్వత నివాసం, ఉపాధి కోసం ఉద్దేశించిన గ్రీన్ కార్డు బిల్లుపై అమెరికా కాంగ్రెస్‌లో ఓటింగ్‌కు సర్వం సిద్ధమైంది. ఈ బిల్లు కాంగ్రెస్ ఆమోదం పొందితే దశాబ్దాల తరబడి గ్రీన్ కార్డు కోసం ఎదురుచూస్తున్న భారతీయులకు భారీగా ప్రయోజనాలు దక్కుతాయి. గ్రీన్ కార్డు విషయంలో అమెరికా ఒక్కో దేశానికి గరిష్టంగా ఏడు శాతానికి మించి ఇవ్వకూడదన్న కోటా నిబంధనలు భారత్ వలసదారులకు కష్టాలు తెచ్చిపెడుతున్నాయి. జనాభా ఎక్కువ ఉన్న దేశాలకు, తక్కువ ఉన్న దేశాలకు ఒకే నిబంధనలు అమలవుతూ ఉండడంతో భారత్, చైనా, ఫిలిప్పీన్స్‌కు చెందిన వలసదారుల దరఖాస్తులు కుప్పలుతెప్పలుగా పెండింగ్‌లో ఉన్నాయి. ఈ ఇక్కట్లకు తెరదించడానికి గత ఫిబ్రవరిలో ఫెయిర్‌నెస్ ఫర్ హై స్కిల్డ్ ఇమ్మిగ్రెంట్ యాక్ట్ (హెచ్‌ఆర్1044) బిల్లును భారత సంతతికి చెందిన సెనేటర్ కమలా హ్యారిస్ తన సహచరుడు మైక్‌లీతో కలిసి సెనేట్‌లో ప్రవేశపెట్టారు. ఇదే తరహా బిల్లును కాంగ్రెస్ ప్రతినిధుల సభలో జో లాఫ్రెన్, కెన్‌బర్గ్‌లు ప్రవేశపెట్టారు. ప్రతినిధుల సభలో మొత్తం 435 సభ్యులకు గాను రిపబ్లికన్, డెమొక్రాట్ పార్టీకి చెందిన 310 మందికి పైగా ప్రజాప్రతినిధుల మద్దతు ఈ బిల్లుకు ఉంది. 203 మంది డెమొక్రాట్లు, 108 మంది రిపబ్లికన్లు ఈ బిల్లుకు కో స్పాన్సరర్లుగా ఉన్నారు. 290 ఓట్లు బిల్లుకు అనుకూలంగా వస్తే దీనిపై ఎలాంటి చర్చలూ, సవరణలూ లేకుండా ఆమోదం పొందుతుంది.

### భారతీయులకు కలిగే ప్రయోజనాలేంటి?

భారతీయుల డాలర్ డ్రీమ్స్ సాకారమయ్యే రోజు ఎంతో దూరంలో లేదు. ఏకంగా 3 లక్షల మంది భారతీయులకు ప్రయోజనం చేకూరనుంది. ప్రస్తుతం అమల్లో ఉన్న వలస విధానం వల్ల ఇండియాకు చెందిన అత్యంత ప్రతిభావంతులు, ఐటీ వృత్తి నిపుణులు ఎక్కువగా నష్టపోతున్నారు. అతి పెద్ద ఐటీ కంపెనీలు కూడా తక్కువ వేతనాలకు భారతీయుల్ని నియమిస్తూ వారి శ్రమను దోపిడీ చేస్తున్నాయి. గ్రీన్‌కార్డు బిల్లు దేశాల కోటా పరిమితిని ఎత్తివేయడంతో పాటుగా కుటుంబాల ప్రాతిపదికన వలస వీసా కోటాను 15శాతానికి పెంచనుంది. అమెరికాలో ఉద్యోగాలు చేయడానికి వీలుగా హెచ్1బీ వీసా దారులకు ఈబీ కేటగిరీ కింద ప్రతి ఏటా 1.4 లక్షల మందికి గ్రీన్ కార్డులు జారీ చేస్తున్నారు. ఏడు శాతం కోటా నిబంధనలతో ఒక్కో దేశం 9,800కు మించి ఎక్కువ కార్డులు పొందలేదు. ఫలితంగా జనాభా అత్యధికంగా ఉండే ఇండియా, చైనా వంటి దేశాల నిపుణులు గ్రీన్ కార్డు కోసం ఎక్కువ కాలం ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పుడు ఇక ఆ ఎదురుచూపులకు తెరపడినట్టే.

### మనోళ్లలో 90 శాతం మందికి లబ్ధి

గ్రీన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న భారతీయుల్లో ఇప్పటివరకు ప్రతీ ఏడాది 25 శాతం మందికి మాత్రమే మంజూరవుతూ వచ్చాయి. కొత్త చట్టం రూపుదాల్చితే వచ్చే పదేళ్లలోనే 90 శాతానికిపైగా భారతీయులకు గ్రీన్ కార్డులు లభిస్తాయని యూఎస్‌సీఐఎస్ (యునైటెడ్ స్టేట్స్ సెంటర్ ఫర్ ఇమ్మిగ్రేషన్ స్టడీస్) అంచనా వేస్తోంది.




## కెనడాలో 51% పైకి



కెనడాలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న భారతీయుల సంఖ్య భారీగా పెరిగినట్టు ఆ దేశ ప్రభుత్వ వలస విభాగం వెల్లడించింది. 2018 సంవత్సరానికి 39,500 మందికిపైగా భారతీయులకు ఈ ఏడాది గ్రీన్ కార్డులు మంజూరైనట్టు ఒక నివేదికలో తెలిపింది. 2017తో పోల్చి చూస్తే గ్రీన్ కార్డులు 51శాతం పెరిగినట్టు కెనడా ఇమ్మిగ్రేషన్, రిఫ్యూజీ అండ్ సిటిజన్ షిప్ నివేదిక వివరించింది. కెనడాలో జస్టిన్ ట్రూడ్యూ నేతృత్వంలో ప్రభుత్వం ఈ ఏడాది ఎక్స్‌ప్రెస్ ఎంట్రీ సిస్టమ్ విధానం ద్వారా ఏకంగా 92 వేల మంది వలసదారులకు శాశ్వత నివాసం కోసం అనుమతులు మంజూరు చేసింది. దీని ప్రకారం 46శాతం మంది భారతీయులకు కెనడా పౌరసత్వం వస్తే, ఆ తర్వాత స్థానం నైజీరియన్లు, చైనీయులు ఉన్నారు. అమెరికాలో వలస విధానాన్ని కఠినతరం చేయడం, హెచ్1బీ వీసాలు లభించడం కష్టమైపోవడం, గ్రీన్‌కార్డు మంజూరులో జాప్యాలు, వలసదారుల జీవిత భాగస్వాములకు ఉద్యోగ అవకాశాలు కరువైపోవడంతో భారతీయుల చూపు ఈ మధ్య అమెరికా నుంచి కెనడా వైపు తిరిగింది. దానికి తగ్గట్టుగానే అక్కడి ప్రభుత్వం రికార్డు స్థాయిలో శాశ్వత నివాసం కోసం వీసాలు మంజూరు చేసింది.

## షార్జా గోల్డెన్ వీసా



యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)కి చెందిన పారిశ్రామికవేత్త లాలో శామ్యూల్‌కు శాశ్వత నివాసాన్ని కల్పిస్తూ మొదటిసారిగా షార్జా గోల్డ్‌కార్డు వీసా మంజూరు చేసింది. కింగ్‌స్టన్ హోల్డింగ్స్ మేనేజింగ్ డైరెక్టర్ అయిన లాలో శామ్యూల్ గత కొన్నేళ్లుగా యూఏఈలో వాణిజ్య కార్యకలాపాలు నిర్వహిస్తూ అరబ్ ప్రపంచంలో తనకంటూ ఒక గుర్తింపు పొందారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ) అభివృద్ధి కోసం ఈ మధ్య కాలంలో పెట్టుబడుల్ని ఆకర్షించడానికి, ఆర్థికంగా దేశాన్ని పరుగులు పెట్టించడానికి గోల్డెన్ కార్డు వీసా వివిధ దేశాల పారిశ్రామికవేత్తలకు మంజూరు చేస్తోంది. అందులో భాగంగానే లాలో శామ్యూల్‌కు వీసా లభించింది. ఈ వీసా ప్రకారం స్పాన్సరర్లు లేకుండా శామ్యూల్, ఆయన భార్యా పిల్లలు షార్జాలో శాశ్వత నివాసం ఉండవచ్చు. మధ్య ప్రాచ్య దేశాల్లో ప్లాస్టిక్, మెటల్ ప్రాసెసింగ్ యూనిట్లను నడుపుతూ శామ్యూల్ వరుసగా కొన్నేళ్ల పాటు ఫోర్బ్స్ మ్యాగజైన్‌లో స్థానం పొందారు. వజ్రాభరణాల సంస్థ మలబార్ గ్రూపు కో చైర్మన్,కేరళలో పుట్టిన డాక్టర్ ఇబ్రహీం హాజీకూ గోల్డెన్ వీసా లభించింది.

సాక్షి బిజినెస్
బుధవారం 10-7-2019
WWW.SAKSHIBUSINESS.COM

## స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 10 ▲ | 3 ▼ |
| 38,731 | 11,556 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30గం.లకు)

| సూచీ | విలువ | మార్పు |
|---|---|---|
| నాస్‌డాక్ | 8,127 | ▲ 28 |
| డోజోన్స్ | 26,729 | ▼ 77 |
| ఎఫ్‌టీఎస్ఈ 100 | 7,536 | ▼ 13 |
| డాక్స్ | 12,437 | ▼ 107 |
| షాంఘై | 2,928 | ▼ 5 |
| నికాయ్ | 21,565 | ▲ 30 |

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | కరెన్సీ | | • కొనుగోలు | • అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 67.90 | 69.54 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 84.37 | 87.62 |
| € | యూరో | ఎస్‌బీఐ | 75.71 | 78.58 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 61.99 | 64.39 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 46.85 | 49.03 |
| S$ | సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 49.65 | 51.42 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 17.65 | 19.36 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.07 | 19.58 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.39 | 10.75 |

# హ్యుందాయ్ ‘కోనా’ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ

- 9.7 సెకన్లలో 0–100 కి.మీ వేగం
- ఒక్కసారి చార్జింగ్‌తో 452 కి.మీ ప్రయాణం
- కారుతో పాటు హోమ్ చార్జింగ్ కిట్
- ఇండియన్ ఆయిల్‌తో కలిసి స్టేషన్ల ఏర్పాటు..


ధర రూ.25.3 లక్షలు

**న్యూఢిల్లీ:** ప్రముఖ వాహన తయారీ కంపెనీ హ్యుందాయ్ మోటార్స్ ఇండియా (హెచ్ఎంఐఎల్).. భారత ఎలక్ట్రిక్ కార్ల మార్కెట్లో సంచలనం సృష్టించింది. మంగళవారం తన తొలి పూర్తిస్థాయి ఎలక్ట్రిక్ స్పోర్ట్స్ యుటిలిటీ వాహనం (ఎస్‌యూవీ)ని ఇక్కడి మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. ‘కోనా’ పేరుతో విడుదలైన ఈ కారు ధర రూ.25.3 లక్షలుగా ప్రకటించింది. కేవలం 9.7 సెకన్లలోనే సున్నా నుంచి వంద కిలోమీటర్ల వేగాన్ని అందుకోగలిగిన ఈ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ.. గరిష్టంగా 154 కి.మీటర్ల వేగంతో, ఒక్కసారి చార్జ్ చేస్తే 452 కి.మీ దూరం వరకు ప్రయాణించగలదు. కారుతో పాటు హోమ్ చార్జింగ్ కిట్ వస్తోంది. ఇందులోని 50కిలోవాట్ వేగవంతమైన చార్జర్ సహాయంతో కేవలం 57 నిమిషాల్లోనే బ్యాటరీ సున్నా నుంచి 80 శాతం చార్జ్ అవుతుంది. స్టాండర్డ్ 7.2 కిలోవాట్ చార్జర్‌తో అయితే ఆరు గంటల సమయం పడుతుందని కంపెనీ వివరించింది. దేశంలోని నాలుగు ప్రధాన నగరాల్లో చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయడం కోసం ఇండియన్ ఆయిల్ కంపెనీతో జట్టుకట్టినట్లు ప్రకటించింది. చెన్నైలోని హ్యుందాయ్ ప్లాంట్‌లో అసెంబుల్ అయిన ఈ కారు ఫీచర్ల విషయానికి వస్తే.. ఆరు ఎయిర్ బ్యాగులు, యాంటీ–లాక్ బ్రేకింగ్ సిస్టమ్స్, ఎలక్ట్రానిక్ బ్రేక్–ఫోర్స్ డిస్ట్రిబ్యూషన్, టైర్ ప్రెజర్ మానిటరింగ్ సిస్టమ్, మార్గదర్శకాలతో కూడిన వెనుక కెమెరా ఉన్నాయి. ఈ సందర్భంగా కంపెనీ సీఈఓ, ఎండీ ఎస్ ఎస్ కిమ్ మాట్లాడుతూ.. ‘చార్జింగ్ సమస్యల కారణంగా తొలుత ఈ కారును దేశంలోని 11 నగరాల్లో విడుదలచేస్తున్నాం. కేవలం వాణిజ్య వాహనాలకు మాత్రమే పరిమితం కాకుండా.. వ్యక్తిగతంగా ఉపయోగించే ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీ)లకు కూడా ఫేమ్ 2 పథకం ద్వారా ప్రయోజనాలను అందజేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నా. ప్రపంచవ్యాప్తంగా 2025 నాటికి 44 పర్యావరణ అనుకూల మోడళ్లను విడుదలచేయాలనేది మాతృసంస్థ లక్ష్యం కాగా, వీటిలో 23 పూర్తిస్థాయి ఎలక్ట్రిక్ కార్లు ఉన్నాయి’ అని వ్యాఖ్యానించారు.

**సామాన్యుడి ఈవీల నిమిత్తం హైదరాబాద్‌లో పరిశోధన**

కొరియా, హైదరాబాద్ ప్రత్యేక బృందాలు కలిసి సామాన్యుడు వినియోగించే ఎలక్ట్రిక్ కార్ల పరిశోధన, అభివృద్ధిపై దృష్టిసారించినట్లు కంపెనీ ప్రకటించింది. వచ్చే రెండు నుంచి మూడేళ్లలో మాస్ మార్కెట్లో కంపెనీ పట్టుపెరిగే దిశగా ఈ బృందాలు పనిచేస్తున్నట్లు ఎస్ ఎస్ కిమ్ వెల్లడించారు.




# భారత టారిఫ్‌లను ఆమోదించేది లేదు

మరోసారి విరుచుకుపడ్డ ట్రంప్



**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి భారత్ విధిస్తున్న టారిఫ్‌లపై మండిపడ్డారు. భారత్ ఎంతో కాలంగా అమెరికన్ ఉత్పత్తులపై టారిఫ్‌లను మోపుతోందని, వీటిని ఇంకెంత కాలం ఆమోదించేది లేదంటూ మంగళవారం ట్వీట్ చేశారు. గత నెల 28న జీ–20 దేశాల సమావేశం సందర్భంగా ట్రంప్, మన దేశ ప్రధానితో సమావేశం అవడం, ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్య వివాదాస్పద అంశాలపై సత్వర చర్చకు అంగీకారానికి వచ్చిన విషయం తెలిసిందే. ఇది జరిగిన కొన్ని రోజులకే ట్రంప్ భారత్ పట్ల తన కఠిన వైఖరిని మరోసారి తన మాటల ద్వారా ప్రదర్శించుకున్నారు. అమెరికా వాణిజ్య మంత్రి విల్‌బర్‌రాస్, ఇంధన మంత్రి రిక్‌పెర్రీ ఈ వారం చివర్లో వాషింగ్టన్‌లో భారత్‌కు సంబంధించి జరిగే ఓ సదస్సును ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ సందర్భంలో ట్రంప్ వ్యూహాత్మకంగా భారత్ టారిఫ్‌లపై మరోసారి మాట్లాడడం గమనార్హం. గత నెలలో అమెరికాకు చెందిన బాదం, యాపిల్ సహా 28 ఉత్పత్తులపై భారత్ టారిఫ్‌లు పెంచుతూ నిర్ణయాన్ని అమలు చేసింది. గతేడాది మన దేశ అల్యూమినియం, స్టీల్ దిగుమతులపై అమెరికా విధించిన దిగుమతి సుంకాలకు ప్రతీకారంగానే ఈ నిర్ణయాన్ని ఆలస్యంగా అమలు చేసింది. ఇది తమకు ఆమోదం కాదని, భారత్ అమెరికాకు వ్యతిరేకంగా ఎక్కువ టారిఫ్‌లను అమలు చేస్తోందని, ఈ విషయమై ప్రధాని మోదీతో మాట్లాడాలనుకుంటున్నట్టు జీ20 దేశాల సమావేశానికి ముందు ట్రంప్ ట్వీట్ చేయడం తెలిసిందే. హార్లే డేవిడ్సన్ బైకులపై భారత్ భారీ టారిఫ్‌లు విధిస్తోందని అంతకుముందు పలు సందర్భాల్లోనూ ట్రంప్ అభ్యంతరం వ్యక్తం చేశారు.

# టీసీఎస్ బోణీ భేష్!

**క్యూ1 లాభం 8,131 కోట్లు; 11% వృద్ధి**

- ఆదాయం కూడా 11 శాతం అప్
- ఒక్కో షేర్‌కు రూ. 5 డివిడెండ్
- ఈ క్యూ1లో 12,356 నికర ఉద్యోగాలు
- గత ఐదేళ్లలో ఇదే అత్యధికం



క్యూ1 ఆర్థిక ఫలితాలను ప్రకటిస్తున్న టీసీఎస్ సీఈఓ రాజేశ్ గోపీనాథన్. చిత్రంలో సీఎఫ్‌ఓ రామకృష్ణన్

**ముంబై:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఐటీ దిగ్గజం టీసీఎస్ మెరుగైన ఫలితాలతో బోణీ చేసింది. నికర లాభం అంచనాలను మించగా, ఆదాయం, మార్జిన్ల విషయంలో అంచనాలు మిస్ అయ్యాయి. జూన్ 30తో ముగిసిన మూడు నెలల కాలానికి నికర లాభం 11 శాతం వృద్ధితో రూ.8,131 కోట్లకు పెరిగిందని టీసీఎస్ తెలిపింది. గత ఆర్థిక సంవత్సరం క్యూ1లో రూ.7,340 కోట్ల నికర లాభం సాధించామని కంపెనీ సీఈఓ ఎమ్‌డీ రాజేశ్ గోపీనాథన్ చెప్పారు. సీక్వెన్షియల్‌గా చూస్తే, గత ఆర్థిక సంవత్సరం క్యూ4లో వచ్చిన నికర లాభం (రూ. 8,126 కోట్ల)తో పోల్చితే 0.06 శాతం వృద్ధి నమోదైంది. ఇక గత క్యూ1లో రూ.34,261 కోట్లుగా ఉన్న ఆదాయం ఈ క్యూ1లో 11% వృద్ధితో రూ.38,172 కోట్లకు పెరిగిందని గోపీనాథన్ పేర్కొన్నారు. 3 నెలల కాలాన్ని పరగణనలోకి తీసుకుంటే, కంపెనీ చరిత్రలో ఇదే అత్యధిక ఆదాయం. అయితే గత నాలుగు క్వార్టర్లలో ఈ కంపెనీ 16–20% ఆదాయ వృద్ధి సాధిస్తోంది. దీంతో పోల్చితే ఈ క్యూ1లో ఆదాయ వృద్ధి అంతంతమాత్రంగానే ఉంది. రూ. 1 ముఖ విలువగల ఒక్కో షేర్‌కు రూ.5 డివిడెండ్‌ను ఇవ్వనున్నామని గోపీనాథన్ తెలిపారు.

**నిలకడైన ఆరంభం....**

కొత్త ఆర్థిక సంవత్సరం నిలకడైన ఆరంభంతో మొదలైందని రాజేశ్ గోపీనాథన్ సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ కంపెనీలు వృద్ధి, డిజిటల్ మార్పుల కోసం గణనీయంగానే పెట్టుబడులు పెడుతున్నామని వివరించారు. ఫలితంగా ఈ క్యూ1లో మంచి ఆర్డర్లు, డీల్స్ సాధించామని తెలిపారు. ఈ క్యూ1లో డీల్స్ 25 శాతం వృద్ధితో 570 కోట్ల డాలర్లకు పెరిగాయని పేర్కొన్నారు. మొత్తం ఆదాయంలో 32 శాతం వాటా ఉన్న డిజిటల్ ఆదాయం ఈ క్యూ1లో 42 శాతం ఎగసిందని గోపీనాథన్ పేర్కొన్నారు.

**13% వృద్ధితో రూ.21.67కు ఈపీఎస్...**

మార్జిన్లు మంచి వృద్ధినే సాధించాయని టీసీఎస్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ వి. రామకృష్ణన్ తెలిపారు. కార్యకలాపాల జోరుతో నగదు నిల్వలు పెరిగాయని, ఈపీఎస్ 13% వృద్ధితో రూ.21.67కు చేరిందని పేర్కొన్నారు.

**మరిన్ని విశేషాలు...**

- ఆదాయం రూపాయల పరంగా చూస్తే, ఏడాది కాలంలో 11 శాతం, సీక్వెన్షియల్‌గా 0.4 శాతం వృద్ధి చెందింది.
- ఆదాయం డాలర్ల పరంగా చూస్తే, ఏడాది కాలంలో 9 శాతం వృద్ధి చెందింది.
- గత క్యూ1లో 25 శాతంగా, మార్చి క్వార్టర్‌లో 25.1 శాతంగా ఉన్న నిర్వహణ మార్జిన్ ఈ క్యూ1లో 24.2 శాతానికి తగ్గింది. నికర మార్జిన్ 21.3 శాతంగా నమోదైంది. వేతన పెంపు, రూపాయి బలపడటం ప్రభావం చూపాయి.
- ఇతర ఆదాయం సీక్వెన్షియల్‌గా 40 శాతం పెరగడంతో లాభదాయకత మెరుగుపడింది.
- స్థూల లాభం(వడ్డీ, ట్యాక్స్‌లను కలుపుకొని) 3 శాతం క్షీణించి రూ.9,220 కోట్లకు చేరింది.

మార్కెట్ ముగిశాక ఫలితాలు వెలువడ్డాయి. ఫలితాలపై అనిశ్చితి, డాలర్‌తో రూపాయి విలువ పెరగడంతో టీసీఎస్ షేర్ 2 శాతం నష్టంతో రూ.2,131 వద్ద ముగిసింది.

### నగదు తిరిగిచ్చే విధానం కొనసాగుతుంది...

డివిడెండ్ డిస్ట్రిబ్యూషన్ ట్యాక్స్(డీడీటీ) తప్పించుకోవడానికి పలు కంపెనీలు ముఖ్యంగా ఐటీ కంపెనీలు షేర్లను బైబ్యాక్ చేస్తున్నాయి. దీని నుంచి ఆదాయం పొందడానికి కొత్తగా 20 శాతం బైబ్యాక్ ట్యాక్స్‌ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిపాదించారు. ఈ నేపథ్యంలో....వాటాదారులకు నగదు నిల్వలను తిరిగిచ్చే విధానాన్ని కొనసాగిస్తామని గోపీనాథన్ తెలిపారు. అయితే ఎలా తిరిగివ్వాలి, తదితర విధి విధానాలపై కసరత్తు చేస్తున్నామని పేర్కొన్నారు. మరోవైపు లిస్టెడ్ కంపెనీల్లో పబ్లిక్ హోల్డింగ్‌ను 35 శాతానికి పెంచే ప్రతిపాదన నేపథ్యంలో, కొత్త ఈక్విటీ షేర్లను జారీ చేయడం ద్వారా తమ వాటాను తగ్గించుకునే ప్రయత్నాలు చేయబోమని ఆయన స్పష్టం చేశారు. టీసీఎస్‌లో టాటా గ్రూప్‌కు 75 శాతానికి పైగా వాటా ఉంది. టాటా గ్రూప్ మొత్తం నికర లాభంలో టీసీఎస్ వాటాయే 85 శాతం వరకూ ఉంటుంది.

### ఐదేళ్ల గరిష్టానికి కొత్త కొలువులు..

ఈ క్యూ1లో నికరంగా 12,356 ఉద్యోగాలిచ్చామని, గత ఐదేళ్లలో ఇదే అత్యధికమని టీసీఎస్ తెలిపింది. దీంతో మొత్తం ఉద్యోగుల సంఖ్య 4.36 లక్షలకు పెరిగింది. 30 వేల మంది తాజా గ్రాడ్యుయేట్లకు జాయినింగ్ లెటర్లు ఇచ్చామని, వీరిలో 40% మంది ఈ క్యూ1లో ఉద్యోగాల్లో చేరారని, మిగిలిన వాళ్లు ఈ క్యూ2లో చేరనున్నట్లు కంపెనీ తెలిపింది. ఉద్యోగుల వలస(ఆట్రీషన్ రేటు) 11.5%గా ఉంది.

# విదేశాలకు వెళ్లాలనుకుంటే 18,000 కోట్లు కట్టండి

జెట్ ప్రమోటర్ నరేష్ గోయల్‌కు తేల్చిచెప్పిన ఢిల్లీ హైకోర్టు



**న్యూఢిల్లీ:** జెట్ ఎయిర్‌వేస్ ప్రమోటర్ నరేష్ గోయల్‌కు ఢిల్లీ హైకోర్టు గట్టి షాకిచ్చింది. విదేశాలకు వెళ్లాలనుకుంటే, ఆయన కంపెనీ (జెట్‌ఎయిర్‌వేస్) రుణదాతలకు బకాయి పడిన రూ.18,000 కోట్లను గ్యారంటీ కింద డిపాజిట్ చేయాలని హైకోర్టు తేల్చి చెప్పింది. దేశం విడిచి వెళ్లేందుకు గోయల్ చేసిన అభ్యర్థనను తిరస్కరించింది. తనకు వ్యతిరేకంగా జారీ చేసిన లుకవుట్ సర్క్యులర్ (విదేశాలకు వెళ్లేందుకు ప్రయత్నిస్తే, సంబంధిత వ్యక్తి పోలీసుల విచారణకు అసరమా అని గుర్తించి నిలిపివేయడం)ను సవాల్ చేయగా, దీనిపై కేంద్ర ప్రభుత్వ స్పందనను కోర్టు కోరింది. ‘‘ఈ సమయంలో గోయల్‌కు ఎటువంటి మధ్యంతర ఉపశమనం కల్పించేది లేదు. మీరు 18,000 కోట్ల బ్యాంకు గ్యారంటీ ఇచ్చేందుకు సిద్ధపడితే, విదేశానికి వెళ్లొచ్చు’’ అని ఢిల్లీ హైకోర్టు జస్టిస్ సురేష్ కైత్ అన్నారు. ఈ ఏడాది మే 25న దుబాయికి వెళ్లే విమానం నుంచి, గోయల్, అతని భార్య అనిత్‌ను విమానాశ్రయంలో దించేసిన విషయం గమనార్హం. అయితే, తనపై ఎటువంటి ఎఫ్ఐఆర్ నమోదు కాకపోయినా, లుకవుట్ సర్క్యులర్ పేరిట ఈ విధమైన చర్య తీసుకోవడాన్ని సవాల్ చేస్తూ గోయల్ దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు విచారణ చేపట్టింది. తమ స్పందన తెలియజేయాలని హోం, కార్పొరేట్, న్యాయ శాఖలను ఆదేశిస్తూ తదుపరి విచారణను ఆగస్ట్ 23కు వాయిదా వేసింది.

**నిధుల కోసమే...**

గోయల్ దంపతుల తరపున న్యాయవాది మణిందర్‌సింగ్ వాదనలు వినిపించారు. మే 25న వారిని విమానం నుంచి దించేసినప్పుడు, వారు విచారణను తప్పించుకునే ప్రయత్నం చేశారని చెప్పేందుకు ఏ ఆధారం చూపలేదన్నారు. హైకోర్టులో గోయల్ పిటిషన్ దాఖలు చేసే వరకు ఆయనపై ఎటువంటి కేసు నమోదు కాలేదని, జూలై 6న మాత్రం, పిటిషన్ విచారణకు వచ్చినప్పుడు, ఎస్ఎఫ్ఐవో నుంచి విచారణకు రావాలని గోయల్‌కు సమన్లు అందినట్టు వివరించారు. తమ క్లయింట్లు ఎన్ఆర్ఐ హోదా కలిగిన వారని, జెట్ గ్రూపు కోసం నిధులు సమకూర్చుకునేందుకు దుబాయి, లండన్ వెళ్లాలనుకున్నట్టు తెలిపారు. గోయల్‌కు బ్రిటన్ నివాస వీసా, యూఏఈ నివాస పర్మిట్ ఉన్నాయని, ఇవి ఈ నెల 10, 23వ తేదీల్లో గడువు రెన్యువల్ చేసుకోవాల్సి ఉన్నందున వెంటనే బ్రిటన్, యూఏఈ వెళ్లాల్సి ఉందన్నారు. అయితే, నరేష్ గోయల్ అభ్యర్థనకు వ్యతిరేకంగా అడిషనల్ సొలిసిటర్ జనరల్ మణిందర్ ఆచార్య వాదనలు వినిపిస్తూ... ఇది తీవ్రమైన రూ.18,000 కోట్ల మోసమని, ఎస్ఎఫ్ఐవో ఆధ్వర్యంలో విచారణ జరుగుతున్నట్టు తెలిపారు. ఈ విచారణలో గోయల్ పాల్గొని తన స్పందనను తెలియజేయాల్సి ఉందన్నారు.

# టీవీలు, ఏసీలు ఆన్‘లైనే’...

- వచ్చే నాలుగేళ్లలో డిజిటల్ ప్రభావం 23 బిలియన్ డాలర్ల స్థాయికి
- బీసీజీ, గూగుల్ ఇండియా నివేదిక




**న్యూఢిల్లీ:** టీవీలు, ఏసీలు వంటి వినియోగ ఉత్పత్తుల గురించి ఆన్‌లైన్‌లో అధ్యయనం చేసి, వీడియోలు చూసిన తర్వాతే కొనుక్కునే ధోరణి పెరుగుతోంది. ఇలా డిజిటల్ మాధ్యమం ప్రభావంతో జరిగే కన్జూమర్ డ్యూరబుల్స్ అమ్మకాల పరిమాణం 2023 నాటికి 23 బిలియన్ డాలర్ల స్థాయికి చేరనుంది. టెక్ దిగ్గజం గూగుల్ ఇండియా, బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ (బీసీజీ) రూపొందించిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. కొనుగోలు ప్రక్రియలో ఏ దశలోనైనా కొనుగోలుదారు ఇంటర్నెట్‌ని వినియోగించిన పక్షంలో సదరు లావాదేవీని డిజిటల్ మాధ్యమం ప్రభావిత లావాదేవీగా పరిగణించి ఈ నివేదికను రూపొందించారు. ‘ప్రస్తుతం కన్జూమర్ డ్యూరబుల్స్ అమ్మకాల్లో దాదాపు 28% విక్రయాలు డిజిటల్ మాధ్యమంతో ప్రభావితమైనవే ఉంటున్నాయి. 2023 నాటికి ఇది 63%కి పెరగవచ్చు. విలువపరంగా చూస్తే 23 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉండొచ్చు. ఇందులో సుమారు 10 బిలియన్ డాలర్ల మేర అమ్మకాలు ఆన్‌లైన్ విక్రయాలే ఉంటాయని అంచనా‘ అని నివేదిక వివరించింది. టీవీలు, ఏసీలు, వాషింగ్ మెషీన్లు, ఫ్రిజ్‌లు, చిన్న గృహోపకరణాలు, వాటర్ ప్యూరిఫయర్లు, మైక్రోవేవ్ ఒవెన్లు మొదలైన ఉత్పత్తుల ధరలపై 33% డిజిటల్ ప్రభావం ఉంటోంది.

**కొనుగోలు నిర్ణయాలపై డిజిటల్ ప్రభావం..**

నివేదిక ప్రకారం.. కొనుగోలు నిర్ణయాలపై డిజిటల్ మాధ్యమం ప్రభావం గణనీయంగా పెరుగుతోంది. ఇలా ప్రభావితమైన వారి సంఖ్య గడిచిన నాలుగేళ్లలో రెట్టింపయ్యింది. ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లో వీరి సంఖ్య 5 రెట్లు పెరగ్గా, మహిళా కొనుగోలుదారుల సంఖ్య 10 రెట్లు పెరిగింది. కొనుగోలుకు ముందు దాదాపు 80% మంది డిజిటల్ ప్రభావిత కొనుగోలుదారుల్లో ఏ బ్రాండు కొనాలి వంటి అంశాలపై సందిగ్ధత ఉంటోంది. దీంతో వారు సగటున దాదాపు 2–3 వారాలు ఆన్‌లైన్‌లో అధ్యయనం చేశాకే కొంటున్నారు. సెర్చ్, సోషల్ మీడియా, బ్లాగ్‌లు, ఆన్‌లైన్ వీడియోలు మొదలైనవి ఆన్‌లైన్ రీసెర్చ్‌లో ఉపయోగపడుతున్నాయి. ఈ నేపథ్యంలో వ్యాపార సంస్థలు కూడా కొనుగోలుదారులకు చేరువయ్యేలా డిజిటల్ వ్యూహాలు అమలు చేస్తున్నాయని గూగుల్ ఇండియా కంట్రీ డైరెక్టర్ (సేల్స్) వికాస్ అగ్నిహోత్రి చెప్పారు.

# హైదరాబాద్ రియల్టీలో వృద్ధి


నివేదికను విడుదల చేస్తున్న శాంసన్ ఆర్థర్

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో ఉత్సాహం నెలకొంది. కొత్త గృహాల ప్రారంభాలు, కార్యాలయాల లావాదేవీల్లో వృద్ధిని నమోదు చేసింది. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ (హెచ్1) మధ్య కాలంలో నగరంలో కొత్త గృహాల లాంచింగ్స్‌లో 47 శాతం, ఆఫీస్ స్పేస్ లావాదేవీల్లో 43 శాతం వృద్ధి నమోదైందని నైట్ ఫ్రాంక్ ఇండియా 11వ ఎడిషన్ అర్ధ సంవత్సర నివేదిక తెలిపింది. ఈ సందర్భంగా హైదరాబాద్ బ్రాంచ్ డైరెక్టర్ శాంసన్ ఆర్థర్ మీడియాతో మాట్లాడారు. నివేదికలోని ముఖ్యమైన అంశాలివే..

**5,430 యూనిట్ల అమ్మకం..**

2019 హెచ్1లో నగరంలో కొత్తగా 5,430 గృహాలు ప్రారంభమయ్యాయి. 2018 హెచ్1లో ఇవి 3,706 యూనిట్లుగా ఉన్నాయి. ఫ్లాట్ల లాంచింగ్స్ ఎక్కువగా కూకట్‌పల్లి, మియాపూర్ వంటి ఉత్తరాది ప్రాంతాల్లోనే ఎక్కువగా జరిగాయి. రూ.25 లక్షల నుంచి రూ.50 లక్షల లోపు ప్రాజెక్ట్‌లే ఎక్కువగా ఉన్నాయి. ఇక, అమ్మకాల్లో స్వల్ప వృద్ధి కనిపించింది. ఈ అర్ధ సంవత్సరంలో నగరంలో 8,334 గృహాలు అమ్ముడుపోగా.. గతేడాది హెచ్1లో ఇవి 8,313 యూనిట్లు. ఈ ఏడాది అమ్మకాల్లో 63 శాతం గచ్చిబౌలి, మాదాపూర్ వంటి పశ్చిమ ప్రాంతాల్లోనే ఎక్కువ.

**ధరల్లో 9 శాతం వృద్ధి..**

నగరంలో సగటు చ.అ. ధరల్లో 9 శాతం వృద్ధి కనిపించింది. గతేడాది హెచ్1లో చ.అ. సగటున రూ.4,012 కాగా.. ఇప్పుడది రూ.4,373కి పెరిగింది. అమ్ముడుపోకుండా ఉన్న గృహాలు (ఇన్వెంటరీ) గతేడాది హెచ్1తో పోలిస్తే 67 శాతం తగ్గి ప్రస్తుతం 4,265 యూనిట్లుగా నిలిచాయి. నిర్మాణం పూర్తయిన లేదా తుది దశలో ఉన్న గృహాల కొనుగోళ్లకే నగరవాసులు ఆసక్తి చూపిస్తున్నారని, ఆయా గృహాలకు జీఎస్‌టీ లేకపోవటమే దీనికి కారణం.

**38.5 లక్షల చ.అ. ఆఫీస్ స్పేస్**

నగరంలో ఈ ఏడాది తొలి ఆరు నెలల కాలంలో 38.5 లక్షల చ.అ. ఆఫీస్ స్పేస్ లావాదేవీలు జరిగాయి. 2018 హెచ్1లో ఇది 26..9 లక్షల చ.అ.లుగా ఉంది. ఐటీ, ఐటీఈఎస్ రంగాలు 41 శాతం లావాదేవీలు జరిపాయి. గతేడాదితో పోలిస్తే నగరంలో ఆఫీస్ స్పేస్ ధరలు 11 శాతం వృద్ధి చెందాయి. ప్రస్తుతం నెలకు చ.అ. ధర సగటున రూ.59 ఉంది. కోకాపేట, నార్సింగి, పుప్పాలగూడ ప్రాంతాల్లో కార్యాలయాల ప్రాజెక్ట్‌లు విస్తరిస్తున్నాయి.

# క్రూయిజ్ విహారంలో భారతీయులే ముందు

**సింగపూర్ టూరిజం డైరెక్టర్ శ్రీధర్**



**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** దేశం నుంచి గతేడాది 14.4 లక్షల మంది సింగపూర్‌ను పర్యటించారు. 2017తో పోలిస్తే సంఖ్య పరంగా ఇది 13 శాతం అధికం. 2015 నుంచి పర్యాటకుల సంఖ్య ఒక మిలియన్ మార్కును దాటుతోందని సింగపూర్ టూరిజం బోర్డు భారత్, మిడిల్ ఈస్ట్, సౌత్ ఆసియా డైరెక్టర్ జి.బి.శ్రీధర్ తెలిపారు. మంగళవారమిక్కడ జరిగిన సింగపూర్ టూరిజం బోర్డు రోడ్ షో సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ‘పర్యాటకుల పరంగా చైనా, ఇండోనేసియా తర్వాత భారత్ మూడో స్థానంలో ఉంది. కొన్నేళ్లపాటు ఇండియా తన ర్యాంకును కొనసాగిస్తుంది. ద్వితీయ శ్రేణి పట్టణాల నుంచి పర్యాటకుల సంఖ్య 12 శాతం వృద్ధి నమోదైతే, మెట్రోల నుంచి 8 శాతంగా ఉంది. ఇక క్రూయిజ్‌లో విహరించేవారిలో అత్యధికులు భారతీయులే. 2018లో 1.6 లక్షల మంది క్రూయిజ్‌లో ప్రయాణించారు. అంత క్రితం ఏడాదితో పోలిస్తే ఇది 27 శాతం అధికం. 16 భారతీయ నగరాల నుంచి సింగపూర్‌కు విమాన సర్వీసులు నడుస్తున్నాయి. ఇందులో 10 దక్షిణాది నగరాలు కావడం విశేషం. హైదరాబాద్, వైజాగ్, విజయవాడ వీటిలో ఉన్నాయి’ అని వివరించారు.

# దూసుకొచ్చిన ‘డుకాటి మల్టిస్ట్రాడ 1260 ఎండ్యూరో’

**ధర రూ.19.99 లక్షలు**



**న్యూఢిల్లీ:** ఇటలీకి చెందిన లగ్జరీ మోటార్ బైక్‌ల తయారీ సంస్థ డుకాటి.. తన సూపర్ బైక్ మల్టిస్ట్రాడ 1260 బైక్‌లో అప్‌డేటెడ్ వెర్షన్‌ను మంగళవారం మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. ‘మల్టిస్ట్రాడ 1260 ఎండ్యూరో’ పేరుతో విడుదలైన ఈ బైక్ ధర రూ.19.99 లక్షలు. ఢిల్లీ–ఎన్‌సీఆర్, ముంబై, హైదరాబాద్, పూణే, అహ్మదాబాద్, బెంగళూరు, కొచ్చి, కోల్‌కతా, చెన్నైలలోని తమ డీలర్ల వద్ద బైక్ బుకింగ్స్ ప్రారంభమైనట్లు కంపెనీ ప్రకటించింది. ఈ సందర్భంగా డుకాటి ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ సెర్గీ కానోవాస్ మాట్లాడుతూ.. ‘ప్రత్యేకించి యువత కోసం రూపొందిన బైక్ ఇది. ఆఫ్ రోడ్ డ్రైవ్ ఇష్టపడే ఔత్సాహికుల స్పోర్టీ బైక్‌గా ఈ నూతన వేరియంట్‌ను అభివర్ణిస్తున్నాం’ అని అన్నారు.

# పాన్ షాపుకన్నా అధ్వానం!!

ఇండిగోలో తీవ్రస్థాయిలో గవర్నెన్స్ లోపాలు • జోక్యం చేసుకుని పరిస్థితులు చక్కదిద్దండి • సెబీకి ప్రమోటర్ గంగ్వాల్ లేఖ



భాటియా గంగ్వాల్

**న్యూఢిల్లీ:** దేశీ విమానయాన సంస్థ ఇండిగోలో ప్రమోటర్ల మధ్య వివాదాలు మరింతగా ముదిరాయి. కంపెనీ వ్యవహారాల్లో జోక్యం చేసుకుని పరిస్థితులు చక్కదిద్దాలని కోరుతూ కంపెనీ ప్రమోటర్లలో ఒకరైన రాకేష్ గంగ్వాల్ తాజాగా మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి లేఖ రాశారు. ఇండిగోలో గవర్నెన్స్ లోపాలు తీవ్ర స్థాయిలో ఉన్నాయని, దానితో పోలిస్తే కనీసం పాన్ షాపు నిర్వహణైనా మెరుగ్గా ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు. సంస్థను నేడు అత్యున్నత స్థాయిలో నిలబెట్టిన విలువలకు తిలోదకాలిచ్చి.. కంపెనీ పక్క దారి పడుతోందని గంగ్వాల్ ఆరోపించారు. మరో ప్రమోటరు రాహుల్ భాటియా, ఆయన సంస్థలు సందేహాస్పద లావాదేవీలు జరిపినట్లు పేర్కొన్నారు. చిరకాల మిత్రుడైన భాటియాకు కంపెనీపై అసాధారణ నియంత్రణాధికారాలు కట్టబెట్టేలా షేర్‌హోల్డర్ల ఒప్పందం ఉందని గంగ్వాల్ ఆరోపించారు. ‘సందేహాస్పద లావాదేవీలతో పాటు కనీసం ప్రాథమికమైన గవర్నెన్స్ నిబంధనలు, చట్టాలను కూడా పాటించడం లేదు. ఇది ఇలాగే కొనసాగితే దురదృష్టకర పరిణామాలు చోటు చేసుకునే ప్రమాదం ఉంది. కాబట్టి తక్షణం సరిదిద్దే చర్యలు తీసుకోవాలి‘ అని లేఖలో పేర్కొన్నారు. దీని కాపీని అటు ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, పౌర విమానయాన శాఖ మంత్రి హర్‌దీప్‌సింగ్ పురి, వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్‌కు కూడా పంపారు.

**19లోగా వివరణివ్వండి..:** రాకేష్ గంగ్వాల్ చేసిన ఫిర్యాదులపై మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ దృష్టి సారించింది. ఈ ఆరోపణల నేపథ్యంలో కీలక వివరాలు ఇవ్వాలంటూ ఇండిగో మాతృసంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్‌ను ఆదేశించింది. దీనికి జూలై 19 గడువు విధించింది. స్టాక్ ఎక్స్చేంజీలకు ఇండిగో ఈ విషయాలు తెలిపింది. సెబీకి గంగ్వాల్ రాసిన లేఖ ప్రతి తమకు కూడా అందినట్లు వివరించింది. తాజా పరిణామాల నేపథ్యంలో బీఎస్‌ఈలో ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ షేరు స్వల్పంగా నష్టపోయి రూ. 1,565.75 వద్ద క్లోజయ్యింది.

**వివాదం ఇదీ..**

ఇండిగో సహవ్యవస్థాపకుడు అయిన గంగ్వాల్‌కు కంపెనీలో 37% వాటాలు ఉన్నాయి. మరో సహవ్యవస్థాపకుడు రాహుల్ భాటియా, ఆయన సంబంధ సంస్థల (ఐజీఈ గ్రూప్)కు 38% వాటాలున్నాయి. సంబంధ పార్టీల మధ్య సందేహాస్పద లావాదేవీలపై ఇద్దరు ప్రమోటర్ల మధ్య విభేదాలు నెలకొన్నాయి. దీంతో అత్యవసర షేర్‌హోల్డర్ల సమావేశం నిర్వహించాలంటూ గంగ్వాల్ గతంలో ప్రతిపాదించగా భాటియా దాన్ని తిరస్కరించారు. అసమంజసమైన ఆయన డిమాండ్లను కంపెనీ బోర్డు ఒప్పుకోనందున గంగ్వాల్ ఇలాంటివన్నీ చేస్తున్నారంటూ భాటియా ఆరోపించారు. దేశీయంగా అతి పెద్ద ఎయిర్‌లైన్ అయిన ఇండిగోకు దాదాపు 49%మార్కెట్ వాటా ఉంది. 200 పైచిలుకు విమానాలతో రోజూ 1,400 ఫ్లయిట్స్ నడుపుతోంది. భాటియాకు అసాధారణ అధికారాలు కట్టబెట్టేలా షేర్‌హోల్డరు ఒప్పందం ఉన్నప్పటికీ.. సుదీర్ఘ మిత్రత్వం దృష్టిలో ఉంచుకుని, కంపెనీపై నియంత్రణాపేక్ష పెట్టుకోకుండా అగ్రిమెంటు తాను అంగీకరించానని గంగ్వాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒప్పందం ప్రకారం భాటియాకు చెందిన ఐజీఈ గ్రూప్‌నకు ఆరుగురిలో ముగ్గురు డైరెక్టర్లను, చైర్మన్, సీఈవో, ప్రెసిడెంట్‌ను నియమించే అధికారాలు ఉంటాయి. ప్రస్తుత చైర్మన్ స్వతంత్రతను తాను ప్రశ్నించడం లేదని కానీ స్వతంత్ర చైర్మన్ పేరిట జరిపే నియామక ప్రక్రియే సెబీ నిబంధనలను తుంగలో తొక్కేలా ఉందని గంగ్వాల్ ఆరోపించారు.

LOVED IN 70 COUNTRIES

BAJAJ | THE WORLD'S FAVOURITE INDIAN

# H GEAR టెక్నాలజి ఎలాంటిదంటే కొత్త ప్లాటినా 110 సవారి స్ఫూర్తిగా




సమర్పిస్తున్నాము మొదటి **H-GEAR** టెక్నాలజి.
దీనిలో ఉన్నాయి ఎక్స్‌ట్రా హైవే గేయర్ మరియు ఆధునిక
గేయర్ షిఫ్ట్ గైడ్, ఇవి కంఫర్టెక్ టెక్నాలజితో కొనసాగిస్తాయి
మీ ప్రతి సవారీని హాయిగా. ఇప్పుడిక ప్లాటినా **110 H-GEAR** తో
కుదుపులు నిషేధం.




**₹0/-# డౌన్ పేమెంట్**

**₹53 504/-* నుంచి ప్రారంభం**

Call 721 982 1111 | www.bajajauto.com

PLATINA

కుదుపులు నిషేధం

O&M 3200 TEL

For Institutional/Bulk orders, please send an e-mail to corporatesales@bajajauto.co.in | *Ex-showroom Price Telangana drum variant. #Down payment excluding the processing fee. Finance at the sole discretion of financier at dealership. Terms & Conditions apply.

**Authorised Dealers For Bajaj Auto Ltd.**: Nalgonda SANSAI BAJAJ 9160789555, 9160888876 • Miryalguda SANSAI BAJAJ 9247020304, 9160059997. **Authorised Service Centre**: CHOUTUPAL9290121333, 9160008499, BHONGIR 9247023637, 9133022441,, MUNUGODE 9912996208, SURYAPET 8886936767,9160966699 KODAD 9542488888, 9848644441.